మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 85 • పేజీలు:12+16 • వెల: రూ.5 శుక్రవారం • 23-2-2018 www.manamnews.com /manamnews

అవినీతి కట్టడిలో వెనక్కి!

పత్రికా స్వేచ్ఛలోనూ అధమం.. ఇదీ 2017లో భారత్ పరిస్థితి

- స్వచ్ఛమైన దేశంగా న్యూజిలాండ్.. ఈ వరుసలో భారత్ ర్యాంకు 81
- 2 స్థానాలు దిగజారిన ర్యాంకు.. చైనాతో పోలిస్తే వెనుకబాటు



- పాకిస్థాన్ కంటే మనమే మెరుగు
- 180 దేశాల్లో ప్రభుత్వరంగ అవినీతిపై ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22:

అవినీతి నియంత్రణలో భారత్ అడుగులు వెనక్కిపడుతున్నాయి. ప్రభుత్వ రంగంలో లంచగొండితనం నానాటికీ పెరిగిపోతోంది. ఆ అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తే మీడియా, ఎన్జీవోలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ **మిగతా 6లో..**



19 వేల ఎకరాల్లో ఫార్మా సిటీ

- 33 శాతం వ్యాక్సిన్లు రాష్ట్రం నుంచే
- ఈవోడీబీలో రాష్ట్రం నంబర్ వన్
- బయో ఏషియా సదస్సులో కేటీఆర్
- 50 దేశాల నుంచి 1500 మంది ప్రతినిధులు

2లో..

2 లక్షల రుణ మాఫీ

- రైతులకు ఉచితంగా బోరు బావులు
- ధరల స్థిరీకరణకు రూ.5 వేల కోట్లు
- బీజేపీ అధికారంలోకి రాగానే అమలు చేస్తాం
- ఆత్మహత్యల నివారణలో టీఆర్ఎస్ ఘోర వైఫల్యం
- గిట్టుబాటు ధర వచ్చేవరకు పోరాటం
- 'రైతు పోరు'సభలో లక్ష్మణ్

2లో..



ముఖ్యమంత్రి కేసీఆర్‌ను పరామర్శిస్తున్న గవర్నర్ నరసింహన్ దంపతులు; చిత్రంలో మంత్రి కేటీఆర్

రైతు సమన్వయ సమితి కార్పొరేషన్

ఏర్పాటు చేస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం

- లాభాపేక్షలేని సంస్థగా బాధ్యతలు.. త్వరలోనే జిల్లా, రాష్ట్రస్థాయి సమితులు
- 51 శాతం బీసీలు, మహిళలకు స్థానం.. ఐదు వేల ఎకరాలకు ఒక రైతు వేదిక
- రాష్ట్రవ్యాప్తంగా 2,630 వేదికలు.. వాటిలో రైతు అవగాహన సదస్సులు

హైదరాబాద్, ఫిబ్రవరి 22:

'తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి' పేరిట రాష్ట్రంలో కొత్త కార్పొరేషన్ ప్రారంభించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ **మిగతా 6లో..**

దశ తిరిగింది

మహిళా వర్సిటీగా కోఠి ఉమెన్స్ కాలేజ్.. వచ్చే ఏడాది నుంచే ప్రారంభం



- నెల రోజుల్లో నివేదిక ఇవ్వండి
- పరిశోధన విభాగం మినహా.. అన్ని వసతులూ ఉన్నాయ్!
- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి
- కాలేజీలో మంత్రి ఆకస్మిక తనిఖీ





హైదరాబాద్, ఫిబ్రవరి 22 (మనం ప్రతినిధి):

కోఠి ఉమెన్స్ కాలేజీని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంగా చేయనున్నట్టు డిప్యూటీ సీఎం, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. కోఠి ఉమెన్స్ కాలేజీలో వసతులను గురువారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంత రం మీడియాతో మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఒక్కటే ఉందని, రాష్ట్ర **మిగతా 6లో..**

ఇదీలోకం!



హబ్బులు, పబ్బులు ఎన్ని వెలిసేటట్టు చేసినా.. హోదాను మాత్రం మరిచేలా లేరు సార్ ఈ జనం..!

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో శుక్రవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలో మార్పులేదు. చలిగాలుల తీవ్రత పెరుగుతుంది. గంటకు 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 34 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు

గాలిలో తేమ: 47 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి తె.12.44 తదుపరి నవమి; నక్షత్రం: కృత్తిక మ.12.40 తదుపరి రోహిణి; వర్జ్యం: తె.3.51–5.22; దుర్ముహూర్తం: ఉ.9.01–9.47, మ.12.53–1.39; రాహుకాలం: ఉ.11.03–12.30; అమృతఘడియలు: ఉ.10.24–11.56; శుభసమయం: మ.1.40–3.00;

సూర్యోదయం: 6.42

సూర్యాస్తమయం: 6.17



బీఎస్ఈలో జీహెచ్ఎంసీ

- స్టాక్ ఎక్స్ఛేంజిలో బల్దియా లిస్టింగ్..
- హైదరాబాద్‌కు ఏఏ స్టేబుల్ రేటింగ్
- దేశంలోనే రెండో నగరంగా రికార్డు
- తొలి దశలో రూ.200 కోట్ల నిధులు
- అప్పు తెచ్చుకోవడం తప్పుకాదు: మేయర్
- జీహెచ్ఎంసీ 'ఏఏ' సాధిస్తుంది: సీఎస్

10లో..

నిరసన బాటలో కార్మిక సంఘాలు

కేంద్రం నిర్ణయంతో సింగరేణికి ముప్పు

- ఇది కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే
- కార్మిక సంఘాల ధ్వజం.. ఉద్యమాలకు సిద్ధం
- కలసివచ్చే సంఘాలతో ఆందోళనలకు వ్యూహం



నేడు సింగరేణి బోర్డు డైరెక్టర్ల సమావేశం

నల్ల సూరీళ్ల సొంతింటి కల నెరవేరేనా..!

మెడికల్ బోర్డు పునరుద్ధరణపై ఆశలు

6లో..

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (మనం ప్రతినిధి):

తొలి ప్రభుత్వ రంగ సంస్థగా విరాజిల్లిన సింగరేణి కాలరీస్ కంపెనీ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో అంధకారం కానుందా అనే మీమాంస కార్మికుల్లో **మిగతా 6లో..**



రైళ్లన్నీ ఇక పేపర్‌లెస్!

- బోగీల మీద చార్టులు అదృశ్యం
- మార్చి ఒకటో తేదీ నుంచి అమలు
- స్టేషన్‌లోని కియోస్క్‌లో వివరాలు
- పీఎన్ఆర్ నంబరు కొడితే చాలు
- సెల్‌ఫోన్‌కు ఎస్ఎంఎస్ కూడా..
- ఏటా 3.75 టన్నుల కాగితం ఆదా

విశాఖపట్నం, ఫిబ్రవరి 22 (మనం న్యూస్‌బ్యూరో):

రైల్లో టికెట్ బుక్ చేసుకున్నప్పుడు అది వెయిటింగ్ లిస్టులో వస్తే.. తర్వాత కన్ఫమ్ అయ్యాక మన బెర్తు ఏ బోగీలో ఉందో, ఆ బోగీకి అతికించిన చార్టు మీద మన పేరు ఉందా లేదా అని చూసుకోవడం సర్వసాధారణం. కానీ, ఇక మీదట ఇలా చూసుకునే చాన్స్ ఉండదు. ఎందుకంటే, బోగీల మీద చార్టులు పూర్తిగా అదృశ్యం కానున్నాయి. ఇప్పటికే బెంగళూరు డివిజన్‌లో ప్రయోగాత్మకంగా దీన్ని అమలుచేయగా.. మార్చి ఒకటో తేదీ నుంచి విశాఖ డివిజన్‌లోను, ఆ తర్వాత క్రమంగా విజయవాడ.. **మిగతా 6లో..**

హవాలా రాకెట్ గుట్టురట్టు

గుజరాతీ గల్లీలో పట్టుబడిన నిందితులు

- రూ.27.90 లక్షల నగదు స్వాధీనం
- దేశవ్యాప్తంగా పలు నగరాలకు డబ్బు



హైదరాబాద్, ఫిబ్రవరి 22:

హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు భారీ హవాలా రాకెట్ గుట్టు రట్టుచేశారు. కోఠిలోని గుజరాతీ గల్లీలో నడుస్తున్న ఈ రాకెట్‌పై దాడి చేసి.. వారివద్ద రూ.27.90 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు చేశారు. రాజస్థాన్‌కు చెందిన బల్వంత్ సింగ్ హైదరాబాద్‌కు వలస వచ్చి, అశోక్‌బజార్‌లో కుటుంబంతో **మిగతా 6లో..**

19 వేల ఎకరాల్లో ఫార్మా సిటీ

- 33 శాతం వ్యాక్సిన్లు రాష్ట్రం నుంచే
- ఈవోడీబీలో రాష్ట్రం నంబర్ వన్
- బయో ఏషియా సదస్సులో కేటీఆర్
- 50 దేశాల నుంచి 1500 మంది ప్రతినిధులు హాజరు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (మనం ప్రతినిధి): హైదరాబాద్ నగరంలో 19 వేల ఎకరాల్లో ఫార్మా కంపెనీని ఏర్పాటు చేయనున్నట్టు పరిశ్రమల, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణ ఫార్మా సిటీ ప్రపంచంలోనే అతి పెద్దది కానున్నదన్నారు. దీనికి అన్ని అనుమతులు వచ్చాయని తెలిపారు. నగరంలోని హెచ్ఐసీసీలో బయో ఏషియా సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ నెల 24 వరకు బయో ఏషియా సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు కేటీఆర్‌తోపాటు 50 దేశాల 1500 ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ... ఐటీ లైఫ్ సైన్సెస్ రంగాల్లో తెలంగాణను ప్రపంచానికే లీడర్‌గా మారుస్తామన్నారు. వందకు పైగా లైఫ్ సైన్సెస్ కంపెనీలు హైదరాబాద్‌లో ఉన్నాయని తెలిపారు. తెలంగాణ నుంచి అతి తక్కువ ధరలకే వాక్సిన్లను అందజేస్తున్నామని పేర్కొన్నారు. బయో సైన్స్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. 10 వేలకు పైగా కంపెనీలు బయోసైన్స్ రంగంలో పనిచేస్తున్నాయని తెలిపారు. 33 శాతం వ్యాక్సిన్లు తెలంగాణ నుంచి ఉత్పత్తి అయిన ని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద మెడికల్ డివైజెస్ పార్క్‌ని ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. సులభ వాణిజ్యం(ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో తెలంగాణ నెంబర్ వన్ స్థానంలో ఉందని తెలిపారు. టాప్ ఫార్మా కంపెనీలు హైదరాబాద్‌కు రావడానికి ఆసక్తి చూపెడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే జీనోమ్ వ్యాలీ క్లస్టర్ ఆసియాలోనే అతి పెద్దదని, జీనోమ్ వ్యాలీ విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంక్యుబేషన్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని, ఐటీ లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణను అగ్ర పథంలో నిలుపుతామని హామీ ఇచ్చారు. ఈ నెల 24 వరకు జరిగే ఈ సదస్సులో ఇన్నోవేషన్ ఎక్స్పోనెన్షియల్ మెడిసిన్, బయో మార్కర్స్ క్యాన్సర్ డయాగ్నోస్టిక్స్, డిజిటల్ హెల్త్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశాలపై ప్రధానంగా ప్రసంగించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నోవార్టిస్ ఫార్మా చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీరాం అర్థే, స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మిచెల్ ఎన్ హాల్ కీలకోపన్యాసం చేయనున్నారు. రేపు సాయంత్రం 6 గంటలకు సీఈవో కాంక్లేవ్లో భాగంగా జరిగే చర్చలో డాక్టర్ రెడ్డీస్‌ల్యాబొరేటరీస్ చైర్మన్ సతీష్ రెడ్డి, నోవార్టిస్ ఇండియా అధ్యక్షుడు జావెద్ జియా, డెలాయిట్ వైస్ చైర్మన్ గ్రేగోరి రే తదితరులు పాల్గొంటారు. 23న సాయంత్రం జరిగే సెషన్లో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్ ప్రభు, మంత్రి కేటీఆర్ పాల్గొననున్నారు. ప్రపంచ మార్కెట్లో వస్తున్న మార్పులు, అందుకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. హెచ్ఐసీసీలో ఫార్మా అనుబంధ రంగాలపై ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు. 50కి పైగా దేశాలకు చెందిన కార్పొరేట్ కంపెనీలు తమ ఉత్పత్తులు, యంత్ర పరికరాలను ప్రదర్శించనున్నాయి.





బయో ఏషియా సదస్సులో పాల్గొన్న మంత్రి కేటీఆర్ తదితరులు

ఆకట్టుకున్న శాండ్ ఆర్ట్..

సదస్సులో ప్రదర్శించిన సాండ్ ఆర్ట్ అందరినీ ఆకట్టుకుంది. బయో ఏషియా ప్రయాణాన్ని వాండ్ ఆర్ట్‌తో అద్భుతంగా వివరించారు. 2004 నుంచి లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్లో హైదరాబాద్ ప్రపంచ గుర్తింపును సాధించిన అంశాన్ని ప్రధానంగా తీసుకొని ఈ శాండ్ ఆర్ట్ గీశారు.

ప్రియురాలిపై కత్తితో దాడి

- తనను దూరంపెడుతోందని ద్వేషం..
- ఆగ్రహంతో యువకుడి దారుణం
- కత్తిపోట్లతో ఆస్పత్రికి చేరిన యువతి
- బోనకల్ మండలంలో దారుణం



కత్తిపోటుకు గురైన యమున

బోనకల్, ఫిబ్రవరి 22(మనం న్యూస్): తల్లిదండ్రులకు భయపడి తనను దూరం పెడుతుందనే కోపంతో ప్రియురాలిపై దాడి చేశాడో ప్రియుడు.. తనకు దక్కనిది మరొకరికి దక్కకూడదనే రాక్షసత్వంతో కత్తితో విచక్షణరహితంగా దాడి చేశాడు. కత్తిపోట్లతో రక్తం కారుతున్న ప్రియురాలిని వదిలి పరారయ్యాడు. బోనకల్ మండల పరిధిలోని రావినూతన గ్రామ పంచాయితీ పరిధిలో ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీస్ స్టేషన్ వెనకలైన్‌లో వల్లిబోయిన లక్ష్మి- అంజనేయులు దంపతుల కుమార్తె యమున(18) బోనకల్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే వీధిలో నివసించే కోలా వెంకటేశ్వరరావు–నాగమణి దంపతుల కుమారుడు లింగం మధిరలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. స్కూలు వయసు నుంచే యమున లింగంలు ప్రేమించుకున్నారు. ఆమె బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తుండగా అమ్మాయి ఇంటి పరిధిలో నివసించే కోలా వెంకటేశ్వరరావు–నాగమణిల కుమారుడు లింగం మధిరలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. వీరిద్దరికి స్కూల్ నాటి నుంచి ఉన్న పరిచయం ప్రేమగా మారింది. కాని దానికి అమ్మాయి తల్లిదండ్రులు వాళ్ళ ప్రేమను వ్యతిరేకించడంతో పాటు అబ్బాయి వాళ్ళ మీద అమ్మాయి కుటుంబం కేసు పెట్టింది. దీంతో పోలీసులు అబ్బాయిని ఆరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మధ్య కాలంలో బెయిల్‌పై బయటకి వచ్చిన వ్యక్తి ఈ విషయం గురించి అమ్మాయితో తేల్చుకోవడానికి గురువారం అమ్మాయి వాళ్ళ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో అమ్మాయి వాళ్ళ ఇంట్లో ఎవరూ లేరు. ఈ క్రమంలో ఇరువురి మధ్య మాట మాట పెరగడంతో లింగం ఆవేశంతో యమునపై కత్తితో దాడి చేశాడని ఎస్సై ఇంద్రాసేనారెడ్డి తెలిపారు. కత్తిపోట్లకు గురైన యమునను స్థానిక ఆస్పత్రికి తరలించి, ఆపై మెరుగైన వైద్యంకోసం ఖమ్మం తరలించినట్లు వివరించారు.



బస్ భవన్ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఆర్టీసీని సర్కారులో విలీనం చేయాలి

- బస్‌భవన్ వద్ద కార్మికుల నిరసన

హైదరాబాద్, ఫిబ్రవరి 22(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ)ను ప్రభుత్వంలో విలీనం చేయాలని, వేతన సవరణ, తదితర డిమాండ్లను నెరవేర్చాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్(టీజేఎంయూ) గురువారం చలో బస్‌భవన్ కార్యక్రమాన్ని చేపట్టింది. వందలాది మంది కార్మికులు టీజేఎంయూ కార్యాలయం నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని బస్‌భవన్ వరకు ర్యాలీ తీశారు. బస్‌భవన్ ప్రధాన ద్వారం వద్ద బైఠాయించి తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా టీజేఎంయూ నాయకులు హనుమంతు ముదిరాజ్ మాట్లాడుతూ.. వెంటనే వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. లక్షలాది మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తున్న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కాపాడాలన్నారు. అనంతరం ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

ఒక్క ఎకరం పొలం కూడా ఎండిపోనివ్వం

- రైతులే మా మొదటి ప్రాధాన్యం: ఈటల

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (మనం ప్రతినిధి):సీఎం కేసీఆర్ రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని, రైతాంగానికి నాణ్యమైన కరెంటు, పొలాలకు నీళ్లు, పండిన పంటకు గిట్టుబాటు ధర అందించడం కోసం అనుక్షణం ఆరాటపడుతున్నారని మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. గురువారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. యాసంగికి నీళ్వివ్వాలని విజ్ఞప్తి చేస్తే సింగూరు నుంచి ఎస్సారెస్పీ కి నీళ్లు ఇచ్చారని, ఆ నీటితో లోయర్ మానేరు డ్యాం ద్వారా 4లక్షల ఎకరాలు, సరస్వతి కాలువ ద్వారా ఆదిలాబాద్ కి, ఎత్తిపోతల ద్వారా నిజామాబాదుకి, కరీంనగర్ లో 2 లక్షల ఎకరాల పంటను కాపాడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే గురువారం ఎస్సారెస్పీ సీఈ, పెద్దపల్లి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, కలెక్టర్ దేవసేన, జడ్పీ చైర్మన్ తుల ఉమతో సమావేశం అయ్యామని, ఎగువ మానేరు డ్యాముకి 5,6,7,8 తడులు, దిగువ మానేరుకి మరో 3 తడులు నీళ్లు ఇచ్చే అంశం పై చర్చించినామని తెలిపారు. ప్రస్తుతం ఎస్సారెస్పీలో 27 టీఎంసీ, ఎల్ఎండీలో 10 టీఎంసీ నీళ్లు ఉన్నాయన్నారు. తాగునీటి అవసరాలను కాపాడుకుంటూనే రైతుకు సాగు నీరు అందించేందుకు ప్రణాళికలు చేసినట్టు పేర్కొన్నారు. ఎగువ మానేరులో 5,6 తడులకు ఒక్కో తడికి 7 రోజులు, 7,8తడులకు ఒక్కో దానికి 6 రోజుల పాటు నీళ్లు ఇవ్వాలని, దిగువ మానేరుకి 4వ తడికి 7 రోజులు, 5, 6వ తడులకు నీళ్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

2 లక్షల పంట రుణాల మాఫీ

రైతులకు ఉచితంగా బోరు బావులు.. ధరల స్థిరీకరణకు రూ.5 వేల కోట్లు

- అధికారంలోకి రాగానే అమలు చేస్తాం
- రైతుల ఆత్మహత్యలు నివారించడంలో టీఆర్ఎస్ సర్కారు ఘోర వైఫల్యం
- గిట్టుబాటు ధర వచ్చేవరకు పోరాటం
- తెలంగాణకోసం అమరుల త్యాగాలు
- రాజభోగాలు అనుభవిస్తున్న ద్రోహులు
- 'రైతు పోరు'సభలో బీజేపీ లక్ష్మణ్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (మనం ప్రతినిధి): తెలంగాణలో తాము అధికారంలోకి వస్తే రైతులకు రెండు లక్షల రూపాయల వరకు పంట రుణాలు మాఫీ చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ప్రకటించారు. పంటరుణాలపై బ్యాంకులకు చెల్లించే వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తుందని, రైతులకు ఉచితంగా బోరు బావులు వేయిస్తామని వెల్లడించారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడిపోతున్నారని, కష్టాల సుడిగుండంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని, అన్నదాతలను ఆదుకునేందుకే బీజేపీ పోరుబాట పట్టిందన్నారు. నిద్ర మత్తులో ఉన్న ఈ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చేస్తామన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లిలో 'రైతుపోరు సభ'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. అర్ధరాత్రి, అపరాత్రి కాకుండా పగటి పూటనే 9 గంటల నిరంతర విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టాన్ని పూరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారానే ధరల స్థిరీకరణ కోసం కనీసం 5 వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో కేటాయిస్తామని హామీ ఇచ్చారు. రైతు పెట్టిన పెట్టుబడికి 50 శాతం అదనంగా లాభం చేకూరేలా, ప్రత్యేకంగా 5 వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయిస్తామని, ప్రభుత్వమే మద్ధతు ధర ప్రకటించి అన్నదాతలను ఆదుకునేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ ఏ పంటలు వేశారో, కమిటీలు వేసి వివరాలు సేకరిస్తామని, అన్ని పంటలను లాభసాటిగా మారుస్తామన్నారు. చదువుకున్న యువత కూడా వ్యవసాయంపై మక్కువ చూపేలా చర్యలు చేపడతామన్నారు.

పోరాటం ఆగదు..


రైతన్నలకు రుణాల మాఫీ ఆశ చూపి, వారి ఓట్లను కొల్లగొట్టారని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత రుణమాఫీల సంగతి దేవుడెరుగు, కనీసం బ్యాంకుల్లో పంటరుణాలు ఇవ్వడం లేదన్నారు. మద్ధతు ధర అడిగిన రైతన్నలకు బేడీలు వేసి జైలుకు పంపిన ఘనత ఈ టీఆర్ఎస్ సర్కార్‌కే చెల్లుతుందని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలను నివారించడంలో సర్కార్ తీవ్రంగా విఫలమైందన్నారు. రైతన్నలకు మేలు జరిగే వరకు, వారికి గిట్టుబాటు ధర వచ్చే వరకు పోరాడతామన్నారు. ప్రాణహిత, చేవెళ్ల కోసం కేంద్రం వేల కోట్లు ఖర్చు పెట్టిందని, కానీ కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ మార్చుతూ, వేల కోట్లు కాంట్రాక్టుల జేబులు నింపేలా చేస్తోందని ఆయన మండిపడ్డారు.

మేం అధికారంలోకి తప్పకవస్తాం..

టీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క వర్గం ప్రజలు సంతృప్తిగా లేరని లక్ష్మణ్ ఆరోపించారు. తీవ్ర అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయిన కాంగ్రెస్, వారసత్వ పాలనతో దేశాన్ని దోచుకుందని, అదే తరహాలో తెలంగాణలో టీఆర్ఎస్ కూడా ప్రజావ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని లూటీ చేస్తుందని దుయ్యబట్టారు. రెండు పార్టీలు మజ్లిస్ పార్టీని పెంచి పోషించాయని విమర్శించారు. మోదీ అవినీతి రహిత పాలనతో, అభివృద్ధి కార్యక్రమాలతో దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు బీజేపీ వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. 19 రాష్ట్రాల్లో నేడు బీజేపీ అధికారంలో ఉందని, కర్ణాటక, తెలంగాణల్లోనూ పార్టీ అధికారం కైవసం చేసుకునే దిశగా అడుగులు వేస్తోందని అన్నారు. అమాయకులైన తెలంగాణ ప్రజలు తాడనుకుని, పాములాంటి టీఆర్ఎస్ పార్టీని మెడలో వేసు కున్నారని, వారి పాలన నుంచి విముక్తి కావాలని కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

ఉద్యోగాలు ఎక్కడ..

అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా, ఉద్యోగాల భర్తీపై శ్రద్ధ చూపడం లేదని ఆయన ప్రశ్నించారు. టీచర్ల నుంచి అధ్యాపకుల వరకు ఎక్కడి ఖాళీలు అక్కడే ఉన్నాయని, ఉన్నత విద్య తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. నిరుద్యోగులు, విద్యార్థుల త్యాగాల పునాదులపై ఏర్పడ్డ టీఆర్ఎస్ ప్రభుత్వం, నిరుద్యోగుల వెతలను అర్థం చేసుకోకపోవడం అమానుషమన్నారు. అమరులు త్యాగాలు చేస్తే.. ద్రోహులు భోగాలు అనుభవిస్తున్నారన్నారు. ముస్లింలను బీసీ జాబితాలో చేర్చి బీసీలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, ఇది ముమ్మాటికీ బీసీ వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు.



టీఆర్ఎస్‌లో తెలంగాణ ద్రోహుల పెత్తనం

- పార్టీ ఫిరాయింపులన ప్రోత్సహించడం సిగ్గు చేటు
- కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కు లేదు
- ఓబీసీ మహాగర్జనలో బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (మనం ప్రతినిధి): టీఆర్ఎస్ పార్టీలో తెలంగాణ ద్రోహుల పెత్తనం సాగోతుందని, పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించడం సిగ్గు చేటని బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి అన్నారు. బంజారాహిల్స్‌లోని బంజారా ఫంక్షన్ హాల్‌లో గురువారం జరిగిన ఓబీసీ మహాగర్జన సభకు కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులను అవహేళన చేసిన వారు నేడు టీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్నారన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అంసతృప్తితో ఉన్నారన్నారు. 1200 మంది బలిదానానికి కారణమైన కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ఎమ్మెల్యే రాంచంద్ రావు మాట్లాడుతూ బలహీన వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు బీజేపీలోనే అధికంగా ఉన్నారన్నారు. రోస్టర్ విధానంలో అవకతవకల వల్ల బీసీలకు దక్కాల్సిన ఉద్యోగాలు వారికి దక్కడం లేదన్నారు. బీసీ కమిషన్‌కు రిటైర్డ్ జడ్జిని చైర్మన్‌గా నియమించాల్సి ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ దురుద్దేశంతో నాన్ జ్యుడిషియల్ వ్యక్తిని నియమించిందన్నారు. ఓబీసీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహ యాదవ్ బీసీ సబ్‌ప్లాన్‌కు రూ.20 వేల కోట్లు ఇస్తానన్నా కేసీఆర్ ఏమీ ఇవ్వకుండా బీసీలను మోసం చేశారన్నారు. అత్యధికంగా బీసీలు ఉన్న ఏకైక పార్టీ బీజేపీ అని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు అన్నారు. బీజేపీ భవిష్యత్ బీసీ మోర్చపైనే ఆధారపడి ఉందని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పేరాల శేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు సదానంద్, చారి, నీలకంఠం, ఓబీసీ మోర్చ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, వెంకట్ రాములు, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శులు నర్సింగరావు, సత్యనారాయణ గౌడ్, మల్లేష్ యాదవ్, అధికార ప్రతినిధి సుభాష్ చంద్రబోస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి

మిర్చి మార్కెట్‌లో మళ్లీ రగడ


- 'గిట్టుబాటు'కోసం అన్నదాతల ఆందోళన
- పేరుకే రూ.9700 మార్కెట్ ధర
- కొనుగోలు ధర 7 వేలలోపేనని ఆరోపణ
- రైతుల తిరుగుబాటుతో వ్యాపారులు పరార్
- ఖమ్మం మార్కెట్ సెక్రటరీని నిలదీసిన రైతులు
- రైతన్నకు మద్దతు తెలిపిన సీపీఎం, సీపీఐ, టీడీపీ
- అందోళనతో దిగివచ్చిన మార్కెట్ యంత్రాంగం



ఖమ్మం మార్కెట్‌లో మిర్చి రైతుల ఆందోళన

ఖమ్మం, ఫిబ్రవరి 22(మనం న్యూస్): సీజన్ మొదలైన నాటి నుంచి మిర్చికి మంచి ధర పలుకుతుండడంతో రైతుల ముఖాలు ఆనందంతో వెలిగిపోయాయి. ఈసారి పంటకు తగిన ధర వస్తుందని భరోసాతో నిశ్చింతగా ఉన్నారు. అయితే, ఈ ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. వ్యాపారులు దోపిడీకి దిగడంతో గిట్టుబాటు ధర దొరకడంలేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులంతా కలిసి మార్కెట్ రేటును ఒక్కసారిగా తగ్గించి ఇష్టం వచ్చినట్లుగా కోనుగోళ్ళు జరపడంతో గురువారం నాడు మార్కెట్‌లో రైతులు అందోళనకు దిగారు. గిట్టుబాటు ధర కల్పించడంలో అధికారులు వ్యాపారులు కుమ్మక్కై అన్నదాతలకు అన్యాయం చేస్తున్నారని మండి పడ్డారు. జెండా పాటను సాకుగా చూపి వ్యాపారులను అందినకాడికి దోచుకుంటున్నారని వారు విమర్శించారు. పేరుకు మాత్రం రూ.9700 ధర చూపిస్తూ తమ మిర్చికి కనీస మద్దతు ధర చెల్లించకుండా కేవలం రూ.6000 నుంచి రూ.7000 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. మరికొంతమంది వ్యాపారులు మిర్చి బాగా ఎండలేదని, కాయ నలుపు వచ్చిందని సాకులు చూపుతూ తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారంటూ మార్కెట్ గేట్‌లను మూసివేసి అందోళనకు దిగారు. మార్కెట్ అధికారులను బయటకు పోనీయకుండా అడుకున్నారు. రైతులపై ఆగ్రహం వ్యక్తంచేసిన అధికారులకు తగిన బుద్ధి చెప్పి అందోళనను ఉధృతం చేశారు. సమాచారం అందుకున్న అడిషనల్ డీసీపీ కొల్లు సురేష్ కుమార్ ఆందోళననునిరోధించేందుకు రూరల్ ఏసీపీ నరేష్ రెడ్డిని పురమాయించారు. దీంతో నరేష్‌రెడ్డి తన సిబ్బందితో మార్కెట్‌కు చేరుకొని రైతులను బుజ్జగించే ప్రయత్నంచేశారు. మార్కెట్ అందోళనపై స్పందించిన వామపక్ష పార్టీలైనా సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పోతినేని సుదర్శన్, రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాగం హేమంత రావు రైతు సంఘ నాయకులు కలసి మిర్చి రైతుల అందోళనకు మద్దతు తెలిపారు. మార్కెట్ అధికారులను నిలదీసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఒక్కరోజులోనే మార్కెట్ ధరను సుమారు రూ.3000 లకు తగ్గించడాన్ని వారు తప్పు పట్టారు. మార్కెట్‌కు వచ్చిన మిర్చి రైతులకు అన్యాయం జరుగకుండా రూ.9800 కోనుగోళ్ళు చేయాలని సిపియం,సిపిఐ,టిడిపి పార్టీలు డిమాండ్ చేశాయి. మార్కెట్ అధికారులు వ్యాపారులతో చర్చలు జరపాలని మార్కెట్‌కు వచ్చిన మిర్చి పంట మొత్తాన్ని రూ.9800కి కోనుగోళ్ళు చేయాలని డిమాండ్ చేశారు. అప్పటికి రైతులు అందోళన తగ్గించకపోవడంతో తహశీల్దార్ శ్రీలత సంఘటన స్థలానికి చేరుకొని రైతులను బుజ్జగించే ప్రయత్నం చేశారు. తమకు మార్కెట్ ధర రూ.9800 చెల్లిస్తేనే అందోళన అపుతామని తేల్చిచెప్పడంతో స్పందించిన అధికారులు వెంటనే వ్యాపారులతో చర్చలు జరిపారు. రూ.8900 లోపు కొనుగోలు చేసిన మిర్చి మొత్తానికి అదనంగా రూ.200 పెంచి వ్యాపారులు కొనుగోలు చేయాలని ఖమ్మం ఆర్డీవో పూర్ణచందర్ రావు తెలపడంతో వ్యాపారులు అంగీకరించారు. దీంతో అందోళన సర్దుమనిగింది. మళ్ళీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని జేసి మార్కెట్ అధికారులను అదేశించారు.

హౌజింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి: హైకోర్టు



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (మనం లీగల్ న్యూస్): తెలుగు రాష్ట్రాల్లోని హౌజింగ్ బోర్డుల్లో పనిచేసిన విశ్రాంత ఉద్యోగులకు సవరించిన పేస్కేల్స్ మేరకు పింఛన్, కరవు భృతి చెల్లించాలనే విజ్ఞాపన పత్రాలను నెలరోజుల్లో పరిష్కరించాలని ఉమ్మడి హైకోర్టు గురువారం రెండు రాష్ట్రాలను ఆదేశించింది. 2013లో వేతన సవరణ చేసినా తమకు అందుకు అనుగుణంగా పింఛన్, కరవు భృతి ఇవ్వడం లేదని హైదరాబాద్‌కు చెందిన కుమారస్వామి వేసిన రిట్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి నేత త్వంలోని బెంచ్ విచారించింది. హౌసింగ్ బోర్డుల మధ్య వివాదాల కారణంగా విశ్రాంతి ఉద్యోగులకు బకాయిలు చెల్లించకపోవడం సబబుకాదని బెంచ్ పేర్కొంది.

డిస్కంలకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (మనం లీగల్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ నుంచి కొనుగోలు రేసిన విద్యుత్‌కు బకాయిలు రూ.27.54 కోట్లు చెల్లించడం లేదని ముంబైలోని విద్యుత్ కంపెనీ శారద మెటల్స్ అండ్ అలాయ్స్ లిమిటెడ్ ట్రైబ్యునల్‌ను ఆశ్రయించింది. దీనిని గురువారం విచారించిన నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్.. తెలంగాణ విద్యుత్ డిస్కంలకు నోటీసులు ఇచ్చింది. నోటీసులు ఇచ్చినా బకాయిలు ఇవ్వడం లేదని కంపెనీ వాదన. డిస్కంలకు నోటీసులు ఇచ్చిన ట్రిబ్యునల్ విచారణ మార్చి 7కి వాయిదా వేసింది.

'నాయిని' ఆత్మహత్య చేస్కుంటే..
రూ.60 లక్షలు ఇస్తా !

- తీవ్ర నష్టాల్లో తెలంగాణ రైతాంగం
- విశ్రాంత న్యాయమూర్తి బి.చంద్ర కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 22(మనం ప్రతినిధి): హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి ఆత్మహత్య చేసుకుంటే ఆస్తులను అమ్మి రూ.60 లక్షలు ఇస్తానని తెలంగాణ రైతు సంక్షేమ సమితి అధ్యక్షుడు, రిటైర్డ్ జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణాలో రైతాంగం తీవ్రమైన నష్టాల్లో కురుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. అందుకు బాధ్యత వహించాల్సిన హోంమంత్రి రైతులు డబ్బులకోసం ఆత్మహత్యలకు పాల్పడు తున్నారనడం సరికాదన్నారు. రైతు ఆత్మహత్యలకు ప్రధాన కారణం గిట్టుబాటు ధర కల్పించకపోవడమేనని చంద్రకుమార్ పేర్కొన్నారు. పత్తి సాగు చేయొద్దన్న ప్రభుత్వ ప్రచారంతోనే రైతులు కంది సాగుచేశారని, తీరా కొనుగోలు సమయానికి ప్రభుత్వం స్పందించడంలేదని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలో రవాణ ఖర్చులు పోనూ క్వింటాకు రైతుకు రూ.4 వేలు కూడా మిగలడంలేదని తెలిపారు. కంది రైతుల పరిస్థితి దారుణంగా తయారైందని, రెవెన్యూ అధికారులు ధ్రువీకరించినా.. మార్కెట్లలో కొనుగోలు చేయడంలేదన్నారు. నారాయణఖేడ్‌లో వారం రోజులుగా మార్కెట్లలో రైతులు పడిగాపులు పడుతున్నారని వివరించారు. రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారని, దళారులదే ఇష్టారాజ్యంగా మారిందని చెప్పారు. కేంద్రంతో సంబంధంలేకుండా రాష్ట్ర ప్రభుత్వమే కంది రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే కార్యాచరణ, నిరాహార దీక్ష, పాదయాత్రల తేదీలను ప్రకటిస్తానని పేర్కొన్నారు.



రిటైర్డ్ జస్టిస్ బి.చంద్రకుమార్

సీఎం కేసీఆర్‌కు గవర్నర్ దంపతుల పరామర్శ



హైదరాబాద్, ఫిబ్రవరి 22(మనం ప్రతినిధి): సోదరి మృతిచెందిన బాధలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావును గవర్నర్ దంపతులు ఇఎస్ఎల్ నరసింహన్, విమలా నరసింహన్‌లు పరామర్శించారు. గురువారం ప్రగతి భవన్‌కు వెళ్లిన గవర్నర్, కేసీఆర్‌కు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తన సోదరితో అనుబంధాన్ని సీఎం గుర్తుచేసుకున్నారని సమాచారం. ముఖ్యమంత్రిని గవర్నర్ నరసింహన్ కలిసిన సమయంలో మంత్రి కేటీఆర్‌కూడా అక్కడే ఉన్నారు.


మరో ఐదు కొనుగోలు కేంద్రాలు

- వాటిలో రేపటి నుంచే కొనుగోళ్లు: పోచారం



హైదరాబాద్, ఫిబ్రవరి 22(మనం ప్రతినిధి): రైతుల సౌలభ్యంకోసం కొత్తగా మరో ఐదు ఎర్రజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆర్మూర్ ఎమ్మెల్యే ఎ.జీవన్‌రెడ్డి విజ్ఞప్తి మేరకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈమేరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్‌లోని డొంకేశ్వర్, ఆలూర్, ఖుద్వాన్‌పూర్, పిప్రి, గోవిందపేటలో కొత్తగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మార్క్‌ఫెడ్‌ను మంత్రి ఆదేశించారు. నూతన కేంద్రాల్లో రేపటి నుంచే కొనుగోళ్లు చేపట్టాలని మార్క్ ఫెడ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త కేంద్రాలతో కలిపి మొత్తంగా పది కేంద్రాల్లో ఎర్రజొన్నలను కొనుగోలు చేయనున్నారు.

నాగం వస్తే గ్రూపు రాజకీయాలే




- ఆయనను పార్టీలోకి తీసుకోవద్దు
- ఏ పార్టీ నుంచి పోటీచేసినా ఆయన గెలవరు
- రాహుల్ గాంధీకి పరిస్థితిని వివరించాం
- కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 22(మనం ప్రతినిధి): నాగం జనార్ధనరెడ్డిని పార్టీలోకి తీసుకుంటే గ్రూపు రాజకీయాలు పెరుగుతాయని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి అన్నారు. దామోదర్‌రెడ్డి గురువారం విలేకరులతో మాట్లాడారు. నాగం జనార్ధన్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి తీసుకొవద్దని, ఆయనకు జైపాల్‌రెడ్డికి సఖ్యత ఉందని దామోదర్‌రెడ్డి అన్నారు. నాగం పార్టీలోకి వస్తే గ్రూపు రాజకీయాలు పెరుగుతాయని, నాగం కుమారుడికి గత ఎన్నికల్లో డిపాజిట్ కూడా రాలేదని గుర్తు చేశారు. ఎన్నికలు దగ్గర్లో ఉన్న సమయంలో పార్టీలోకి తీసుకుంటే వర్గ రాజకీయాలు పెరుగుతాయని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో నాగం ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఓడిపోతారని, ఆయన పార్టీలోకి వస్తే తాను స్తబ్ధుగా ఉంటానని పేర్కొన్నారు. డీకే అరుణ వల్లే మహబూబ్‌నగర్‌లో పార్టీ పటిష్టంగా ఉందని, నాగం కాంగ్రెస్‌లోకి వస్తానంటే.. మహబూబ్‌నగర్ నేతలందరూ వ్యతిరేకిస్తారని తెలిపారు. నాగం జనార్ధన్‌రెడ్డిని పార్టీలోకి తీసుకొవద్దని డీకే అరుణ, ఎంపీ నంది యల్లయ్య కలిసి ఢిల్లీ వెళ్లి రాహుల్ గాంధీకి విన్నవించామని పేర్కొన్నారు. నాగం తనతో వ్యక్తిగతంగా మాట్లాడారని, ఒకవేళ ముందే పార్టీలోకి వస్తే స్వాగతించేవాడినని, ప్రస్తుతం పార్టీ క్యాడర్ అంత నాగంకు వ్యతిరేకంగా ఉందని దామోదర్‌రెడ్డి చెప్పారు.

ఏఆర్ కానిస్టేబుల్‌కు రేవంత్ పరామర్శ

- అండగా ఉంటామని హామీ, ఆర్థిక సాయం అందజేత



హైదరాబాద్, ఫిబ్రవరి 22(మనం ప్రతినిధి): ఓ మంత్రి వాహనం కారణంగా ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏఆర్ కానిస్టేబుల్ గురునంద్‌గౌడ్‌ను కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి గురువారం పరామర్శించారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇటీవల రాష్ట్ర మంత్రుల పర్యటన సందర్భంగా ఓ మంత్రికి చెందిన వాహనం అక్కడ విధులు నిర్వర్తిస్తున్న గురునంద్‌గౌడ్ కాలిపై నుంచి వెళ్లింది. గాయపడిన గురునంద్ సికింద్రాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గాయపడిన కానిస్టేబుల్‌కు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలన్నారు. ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కానిస్టేబుల్‌కు అండగా ఉంటామని హామీ ఇవ్వడంతో పాటు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే సోదరుడు తిరుపతిరెడ్డి ఉన్నారు.

మాంసాహార ప్రియుల్లో
తెలంగాణ టాప్

- డెయిరీ ఉత్పత్తులతో రెట్టింపు ఆదాయం
- జాతీయ మాంస పరిశోధనా కేంద్రం వార్షికోత్సవంలో.. కేవీఏఎఫ్ఎస్ వర్సిటీ డైరెక్టర్ నదీమ్ ఫిరోజ్ సూచన
- మాంసాహార ఉత్పత్తులు పెంచాలి: వైద్యనాథన్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (మనం ప్రతినిధి): మాంసాహారం తినే వాళ్లలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని కర్ణాటక వెటర్నరీ, యానిమల్ అండ్ ఫిషరీస్ సైన్సెస్ యూనివర్సిటీ(కేవీఏఎఫ్ఎస్) డైరెక్టర్ నదీమ్ ఫిరోజ్ అన్నారు. హైదరాబాద్‌లోని జాతీయ మాంస పరిశోధనా కేంద్రం(ఎన్ఆర్‌సీ ఆన్ మీట్) 11వ వార్షికోత్సవానికి ఫిరోజ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగు, నెయ్యి, పన్నీరు వంటి పాల ఉత్పత్తుల ద్వారా ఆదాయం పెరుగుతుందని, పాడి రైతులు వీటిపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. గతంతో పోలిస్తే మాంసాహారం తినే వాళ్ల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. శరీరానికి ప్రొటీన్స్ కావాలంటే మాంసాహారం, గుడ్లు, పాలు, చేపలు తినాలన్నారు. ఐసీఏఆర్ - ఎన్ఆర్‌సీ ఆన్ మీట్ డైరెక్టర్ వైద్యనాథన్ మాట్లాడుతూ అవసరాలకు తగిన విధంగా మాంసాహార ఉత్పత్తులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోనే మాంసాహార జీవజాతులను గుర్తించే ఏకైక సంస్థ తమదేనని అన్నారు. ఆర్గానిక్ మాంసాహారాన్ని ఉత్పత్తి చేసే విధానంపై దాదాపు 250 మంది రైతులకు, 250 మంది మీట్ ప్రాసెసర్స్‌కు శిక్షణ అందించామని తెలిపారు. డాక్టర్ నవీన మాట్లాడుతూ తెలంగాణలో మటన్ అవసరాలకు ప్రతి ఏడాది దాదాపు 90 లక్షల జీవాలు అవసరం కాగా అందులో కేవలం మూడో వంతు(30 లక్షలు) మాత్రమే రాష్ట్రంలో లభ్యమవుతున్నాయన్నారు. తెలంగాణలో జీవాల పెంపకాన్ని వాణిజ్యపరంగా చేపట్టడానికి విస్తృతమైన అవకాశాలున్నాయని, రైతులను ఆదిశగా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్ డైరెక్టర్ ఛటర్జీ , ప్రిన్సిపల్ సైంటిస్ట్ బర్‌బుద్దే, డాక్టర్ నదీమ్, డా.జార్జ్ నీలన్, డా.రాజేందర్ రెడ్డి, బయెటెక్నాలజీ, వెటర్నరీ విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి వంటేరు ప్రతాప్‌రెడ్డి?

- అదేదారిలో అన్నపూర్ణమ్మ, మరో సీనియర్ నేత!

హైదరాబాద్, ఫిబ్రవరి 22(మనం ప్రతినిధి): తెలంగాణ తెలుగుదేశం పార్టీకి దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేల్లో ఇద్దరు మినహా మిగతవారందరూ ఇప్పటికే పార్టీని వీడగా, ఉన్న ఇద్దరిలో బీసీ సంఘం నేత ఆర్ కృష్ణయ్య పార్టీని పట్టించుకోవడంలేదు. ఉన్న కొందరు నేతలు కారులో సీటు కోసం, ఆపన్న'హస్తం' కోసం దిక్కులు చూస్తున్నారు. మొన్నటిదాకా జైల్లో ఉండి బెయిల్‌పై విడుదలైన టీటీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వంటేరు ప్రతాప్‌రెడ్డి పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. 2014 ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌పై గజ్వేల్‌లో పోటీ చేసి వంటేరు ఓటమి పాలయ్యారు. ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసిన నర్సారెడ్డి అధికార పార్టీలో చేరిపోయారు. దీంతో అక్కడ సీటు వంటేరుకు ఇచ్చేందుకు కాంగ్రెస్ అధిష్టానం సూచనప్రాయ అంగీకారం తెలిపినట్టు సమాచారం. అది ఖరారు కాగానే ఈ ఉగాదికి హస్తం పార్టీలో వంటేరు చేరనున్నారు. ఇప్పటికే ఆయన ఢిల్లీ వెళ్లి రాహుల్‌ను కూడా కలిసినట్టు ప్రచారం జరుగుతోంది. ఇదిలాఉండగా, టీడీపీ సీనియర్ నేత, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ కూడా పార్టీని వీడుతారని రాజకీయ వర్గాల్లో కొంతకాలంగా చర్చ జరుగుతోంది.

ఇది ఆరెస్సెస్ పాలన

- వచ్చే ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం
- ఒక్క కుటుంబం కోసమే 'తెలంగాణ': ఆర్‌సీ కుంతియా విమర్శ
- ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపేందుకే బస్సుయాత్ర: ఉత్తమ్



కాంగ్రెస్ సేవాదళ్ కన్వెన్షన్‌లో మాట్లాడుతున్న ఆర్‌సీ కుంతియాచ వీహెచ్ తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 22(మనం ప్రతినిధి): దేశాన్ని ఆర్ఎస్ఎస్ పరిపాలిస్తోందని, దేశంలో అది ఏం చేయాలనుకుంటే అదే జరుగుతోందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియా అన్నారు. గురువారం ఇందిరా భవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సేవాదళ్ కన్వెన్షన్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటంలో సేవాదళ్ కృషి మరువలేనిదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవెర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా చేస్తానని చెప్పిన సీఎం కేసీఆర్.. తన కుటుంబాన్ని బంగారంగా మార్చుకున్నాడని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇచ్చేందుకు రాహుల్ ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. పార్టీలో పనిచేసేవారికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాహుల్ సూచించినట్టు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సేవాదళ్‌కి గొప్ప చరిత్ర ఉందని, దాన్ని బలపరిచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. 26న మొదలుపెట్టే కాంగ్రెస్ ప్రజా బస్సు యాత్రను సేవాదళ్ కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోనియాగాంధీ తెలంగాణ ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే.. ఒక్క కుటుంబంలోని నలుగురు వ్యక్తుల కోసమే ఇచ్చినట్టు కేసీఆర్ కుటుంబం ప్రవర్తిస్తుందని తెలిపారు. నెరేళ్లలో దళితులపై పోలీసులు థర్డ్ డిగ్రీని ప్రయోగించారని, నాలుగేండ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపేందుకే కాంగ్రెస్ ప్రజాచైతన్య బస్సు యాత్రను చేపట్టిందని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ కువైట్‌లోని ప్రవాస భారతీయులకు సాయం అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. చిన్నచిన్న కారణాలతో జైళ్లలో మగ్గుతున్న వారిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనన్నారు. అక్కడికి వెళ్లిన కార్మికులు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి వారికి ప్రభుత్వమే ఫ్రీగా ఎయిర్ టికెట్ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తరపున 20 మంది ప్రవాసీలకు ఉచిత విమాన ప్రయాణ టికెట్లు అందించినట్టు పేర్కొన్నారు. ఇప్పటివరకు శంషాబాద్ విమానాశ్రయానికి 600 శవపేటికలు వచ్చాయని, ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సేవాదళ్ చైర్మన్ కనుకుల జనార్ధన్‌రెడ్డి, సేవాదళ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ సేవాదళ్ కన్వెన్షన్‌లో కుంతియా, ఉత్తమ్, వీహెచ్,జనార్ధన్‌రెడ్డి తదితరులు



ఐరిస్ పరికరాలను విడుదల చేస్తున్న సీవీ ఆనంద్, తదితరులు

1 నుంచి రేషన్ షాపుల్లో 'ఈ-పోస్'

- పైలట్ ప్రాజెక్ట్ విజయవంతం
- రేషన్ బియ్యంపై 578 కోట్లు ఆదా: సీవీ ఆనంద్

హైదరాబాద్, ఫిబ్రవరి 22(మనం ప్రతినిధి): రేషన్ దుకాణాల్లో అక్రమాలను అడ్డుకునేందుకు ఈ-పోస్ యంత్రాలను అమర్చనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. పైలట్ ప్రాజెక్టుగా కొన్ని రేషన్ షాపులను ఎంపిక చేసి ఈ యంత్రాలను ఇప్పటికే విజయవంతంగా పరీక్షించామని ఆయన తెలిపారు. ఇందులో సానుకూల ఫలితాలు రావడంతో వచ్చే మార్చి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రేషన్ దుకాణాల్లోనూ ఈ పోస్‌ను అమర్చాలని నిర్ణయించినట్లు ఆనంద్ పేర్కొన్నారు. సాంకేతికత వినియోగంలో పౌరసరఫరా శాఖ ముందుంటుందని చెబుతూ.. జీపీఎస్ విధానం ద్వారా అక్రమ రవాణాను అరికట్టగలిగామని వివరించారు. ఇప్పటికి రాష్ట్రంలో 17వేల రేషన్ దుకాణాల్లో ఈ పోస్ యంత్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మార్చి 1 నుంచి పోర్టబులిటీని అందుబాటులోకి తెస్తున్నట్లు కమీషనర్ చెప్పారు. ప్రతి నెల 1 నుంచి 15 వరకు మాత్రమే సరుకులు ఇస్తారని ఆయన తెలియజేశారు. గురువారం సోమాజీగూడలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో కమిషనర్ సీవీ ఆనంద్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పౌరసరఫరాల శాఖ ఐటీ ప్రాజెక్టులో భాగంగా కఠినమైన ఈ-పోస్ విధానాన్ని 17000 రేషన్ షాపుల్లో విజయవంతంగా అమలు చేశామన్నారు. ఈ పోస్ మిషన్ల ఏర్పాటుతో రేషన్ షాపుల్లో జరిగే అక్రమాలకు అడ్డుకట్ట పడిందని, పెద్ద మొత్తంలో బియ్యం ఆదా అవుతున్నాయని కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ప్రతి నెల సగటున 20 వేల మెట్రిక్ టన్నుల బియ్యం మిగుల్తున్నాయని చెప్పారు. 1 రూ. కిలో బియ్యాన్ని ఇవ్వాలంటే రూ.27 వరకు ఖర్చవుతుందని, ఇందులో రూ.26 రాయితీని ప్రభుత్వమే భరిస్తోందన్నారు.

వేగంగా పాలమూరు ప్రాజెక్టులు

- యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి
- లేదంటే ఏజెన్సీలను తొలగించండి: హరీశ్
- నేడు, రేపు జిల్లాలో మంత్రి పర్యటన




ప్రాజెక్టుల పురోగతిపై జలసౌధలో మంత్రి హరీశ్ రావు సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 22(మనం ప్రతినిధి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నాలుగు ఆన్ గోయింగ్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి చేసి నాలుగు ప్రాజెక్టుల కింద నిర్ణీత ఆయకట్టుకు నీరివ్వాలని ఆయన కోరారు. శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు పాలమూరు జిల్లాలో తాను పర్యటించనున్నట్టు మంత్రి ప్రకటించారు. పాలమూరులోని నాలుగు ప్రాజెక్టుల పురోగతిని గురువారం నాడిక్కడ జలసౌధలో ప్యాకేజీల వారీగా సూక్ష్మ స్థాయిలో సమీక్షించారు. శుక్రవారం రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లాకలెక్టరేట్ లో పాలమూరు ప్రాజెక్టులపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్టు ఆయన చెప్పారు.ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల పనులకు చెందిన పెండింగ్ భూసేకరణ, ఇసుక రీచ్‌ల సమస్య, తదితర సమస్యలను సమావేశంలో చర్చించనున్నారు.కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ ప్రక్రియ ఇంకా పెండింగ్ లో ఉండడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే భూసేకరణ పనులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని మహబూబ్ నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల పనులను షెడ్యూల్ ప్రకారం చేయకుండా జాప్యం చేస్తున్న ఏజెన్సీల పై చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నత్త నడకన పనిచేస్తున్న ఏజెన్సీలను గుర్తించి ఆయా ఏజెన్సీలను 60 సీ నిబంధన కింద టెర్మినేట్ చేసి వేరే ఏజెన్సీలకు పనులు అప్పగించాలని కోరారు. కల్వకుర్తి నుంచి నీటి విడుదల కొనసాగుతున్నందున గత మూడు నెలలుగా నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడిందని ఇరిగేషన్ ఇంజనీర్లు మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ నెలాఖరులో నీటి విడుదలను నిలిపి పనులను వేగవంతం చేయాలని మంత్రి కోరారు. కల్వకుర్తి లిఫ్ట్-3లో నాలుగు పంపులు పనిచేస్తున్నాయని, 5వ పంపు బిగింపు పనులను వేగవంతం చేసి మార్చి చివరికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. లిఫ్టు 2 నుంచి లిఫ్టు 3 వరకు తవ్విన టన్నెల్ లో 1.2 కిలోమీటర్ల లైనింగ్ పనులను జూలై వరకు పూర్తి చేయాలని కోరారు. జూలై తర్వాత ఏజన్సీలకు గడువు పెంచేది లేదని మంత్రి స్పష్టం చేశారు. కాలువల కట్ట 2 మీటర్ల ఎత్తునకు పెంచే చర్యలు చేపట్టాలని కోరారు. కాలువలలో పూడిక తొలగింపు, ఇతర శిథిలాలను తొలగించడం వాటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అన్నారు.డి- 82 కాలువ తవ్వకం పనులన్నీ జూలై వరకు పూర్తి చేయాలని కోరారు. కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో పూర్తిఆయకట్టుకు సాగునీరివ్వాలని సూచించారు. కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల కింద ఇప్పటికే 5 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తున్నట్టు మంత్రి చెప్పారు. అచ్చంపేట అసెంబ్లీ నియోజక వర్గంలో 15 వేల ఎకరాలకు సాగునీరందించే ఉద్దేశంతో తలపెట్టనున్న చంద్రసాగర్ ఎక్స్టెన్షన్ కెనాల్ నిరాన పనుల ఆమోదానికి ప్రభుత్వానికి వెంటనే ప్రతిపాదనలు పంపించాలని హరీశ్‌రావు ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ ఈఎన్సీ మురళీధరరావు, మహబూబ్ నగర్ ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ ఖగేందర్‌రావు, ఎస్ఈలు భద్రయ్య, రఘునాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐతో ఉద్యోగుల బాధ్యత పెరిగింది

- దక్షిణ మధ్య రైల్వే అదనపు జీఎం థామస్



హైదరాబాద్, ఫిబ్రవరి 22 (మనం ప్రతినిధి): సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చిన దగ్గరి నుంచి ప్రభుత్వ ఉద్యోగుల బాధ్యత పెరిగిందని దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్ అన్నారు. 'న్యాయశాస్త్ర దృక్కోణంలో సమాచార హక్కు' అనే అంశంపై దక్షిణ మధ్యరైల్వే ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాచార హక్కు చట్టంలో సమయ పరిమితిని పాటించడానికి కట్టుబడి ఉండాలనే ప్రధాన నియమాన్ని థామస్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన న్యాయశాస్త్ర ప్రొఫెసర్ బీబీ రెడ్డి మాట్లాడుతూ పారదర్శక ప్రజాస్వామ్యాన్ని సాధించడానికి సమాచార హక్కు చట్టం ఉపయోగపడిందని, ప్రజా జీవనంలోని అవినీతిని నిర్మూలనకు ఆర్టీఐ ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్‌వి.రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కారులో దక్కని 'సీటు'


అయోమయంలో మోత్కుపల్లి.. నల్లగొండ ఎమ్మెల్యే టికెట్‌కు గురి..

- రాజ్యసభతో సర్దుకో.. టీఆర్ఎస్!
- వేచి చూసే ధోరణిలో చంద్రబాబు

హైదరాబాద్, ఫిబ్రవరి 22(మనం ప్రతినిధి): టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు భవితవ్యం అయోమయంలో పడింది. గవర్నర్ పదవి కోసం టీడీపీలో చాలా కాలం వేచి చూసిన మోత్కుపల్లికి పలుమార్లు ఆశాభంగం ఎదురైంది. పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ సమాధి సాక్షిగా పార్టీని టీఆర్ఎస్‌లో విలీనంచేస్తే మంచిదంటూ మోత్కుపల్లి వ్యాఖ్యానించారు. ఆయన వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లో కలకలం రేపాయి. గవర్నర్ పదవి దక్కలేదన్న అసంతృప్తి, విసుగుతో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని కొందరంటే, టీఆర్ఎస్‌తో జరిగిన ఒప్పందం మేరకే ఈ వ్యాఖ్యలు చేశాడని మరి కొంత మంది విమర్శించారు. నల్లగొండ జిల్లాలోని ఓ అసెం బ్లీ స్థానం నుంచి టీఆర్ఎస్ తరపున మోత్కుపల్లి బరి లోకి దిగుతారని, ఈ మేరకు మోత్కుపల్లికి టీఆర్ఎస్ అధిష్టానం హామీ ఇచ్చిందనీ రాజకీయ వర్గాల్లో చర్చ జరిగింది. టీటీడీపీని టీఆర్ఎస్‌లో విలీనం చేయాలన్న ఆయన వ్యాఖ్యలు ఈ వాదనకు బలం చేకూర్చాయి కూడా.

కాచుక్కూర్చున్న టీఆర్ఎస్.. పొగబెడుతున్న టీడీపీ

ఇదంతా జరిగి నెలరోజులకు పైగా అవుతున్నా.. టీఆర్ఎస్‌లో చేరికపై స్పష్టతరాలేదు. పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించకుండా టీటీడీపీ నేతలు ఆయన్ను దూరం పెట్టడంతో పాటు ఆయనపై చర్యలకు సిఫారసు చేస్తూ చంద్రబాబుకు నివేదిక కూడా పంపించారు. మోత్కుపల్లి పార్టీలో సీనియర్ నేత, పొలిట్‌బ్యూరో సభ్యుడు పైగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన ముఖ్య నేతల్లో ఒకరు. దీంతో ఆయనపై చర్యలు తీసుకునే విషయంలో చంద్రబాబు వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నారు. కనీసం ఆయన వ్యాఖ్యలపై అధికారికంగా వివరణకూడా అడగక పోవడం గమనార్హం. మరోవైపు మోత్కుపల్లిని ప్రమోటు చేయడం ద్వారా మంద కృష్ణమా దిగను ఎదుర్కోవాలని టీఆర్ఎస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే నల్లగొండ నుంచి నర్సిం హులుకు టికెట్ ఇచ్చేందుకు కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రచారం జరిగింది. ఈ సమ యంలో మోత్కు పల్లిని టీడీపీ నుంచి సస్పెండ్ చేస్తే, టీఆర్ఎస్ దాన్ని విపరీతంగా ప్రచారంచేసి లబ్ధి పొందుతుందని బాబు యోచన. అందుకే మోత్కుపల్లి తనంతట తానే పార్టీని వీడే వరకూ వేచిచూడాలని టీటీడీపీ నేతలకు బాబు సూచించినట్టు సమాచారం.



ఆశించిన టికెట్ డౌటే!

నల్లగొండ జిల్లాలో ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన తుంగతుర్తి టికెట్‌ను మోత్కుపల్లి ఆశిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన యువనేత గాదరి కిషోర్ అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. కిషోర్‌కు వ్యతిరేకంగా ఆ నియోజకవర్గంలోని ఓ నేత టికెట్ కోసం ఇప్పటికే పావులు కదుపుతున్నారు. అటు ఆయన్ను, ఇటు కిషోర్‌ను కాదని మోత్కుపల్లికి టికెట్ ఇస్తే, ఇద్దరూ కలిసి మోత్కుపల్లిని ఓడిస్తారని నియోజకవర్గంలో ప్రచారం సాగుతోంది. ఆలేరు నుంచి టికెట్ ఆశించినా.. అక్కడ అధికార పార్టీకి చెందిన విప్ గొంగిడి సునీత సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆమెను కాదని మోత్కుపల్లికి టికెట్ ఇచ్చే అవకాశాలు కనిపించడంలేదు. దీంతో మోత్కుపల్లిని రాజ్యసభకు పంపించాలన్న యోచనలో టీఆర్ఎస్ అధిష్టానం ఉన్నట్టుంది. ఇందుకు మోత్కుపల్లి సుముఖంగా లేకపోవడంతో ఆయన చేరిక ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఓవర్ లోడ్ అయిన కారులో, ఆశించిన టికెట్ ఇచ్చి మోత్కుపల్లిని ఎక్కించుకోవడం కష్టంగానే కనిపిస్తోంది.


మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
శుక్రవారం, ఫిబ్రవరి 23

పెనం నుంచి పొయ్యిలోకి...

మోదీ ప్రభుత్వం సంస్కరణల విషయంలో మరో పెద్ద తప్పటడుగు వేసింది. వాణిజ్యపరమైన బొగ్గు మైనింగ్ రంగంలో ప్రైవేట్‌రంగాన్ని అనుమతిస్తున్నట్టు కేంద్రం ప్రకటించింది. 1973లో బొగ్గుగనుల జాతీయకరణ తర్వాత నాలుగున్నర దశాబ్దాలుగా ప్రభుత్వరంగ సంస్థ 'కోల్ ఇండియా లిమిటెడ్' ఆధ్వర్యంలో లైసెన్స్‌ల రాజ్యం నడిచింది. విద్యుత్, ఉక్కు, సిమెంట్, అల్యూమినియం వంటి భారీ పరిశ్రమలకు ప్రధాన ఇంధనమైన బొగ్గు సరఫరా అవసరాలకు తగ్గట్టుగా ఉండకపోవడంతో బొగ్గురంగాన్ని ప్రైవేటీకరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. కార్పొరేట్‌రంగం ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించింది. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు నిరసన తెలిపాయి.

గత ఐదేళ్ళలో పదికోట్ల టన్నులకు పైగా బొగ్గు ఉత్పత్తి చేసినప్పటికీ ప్రభుత్వం పెట్టుకున్న 40.65 కోట్ల టన్నుల ఉత్పత్తి సాధించడంలో కోల్ ఇండియా విఫలమైంది. అత్యధిక బొగ్గు నిల్వలున్న జాబితాలో భారత్ ఐదవస్థానంలో ఉన్నప్పటికీ, బొగ్గు దిగుమతుల్లో రెండవ స్థానంలో ఉండడం కోల్ ఇండియాను నడిపించడంలో పాలకుల చిత్తశుద్ధికి అద్దంపడుతోంది. సహజవనరులను ప్రైవేట్‌రంగానికి వదిలితే విచక్షణారహితమైన వ్యాపారపోటీ కారణంగా ఖనిజనిల్వలు త్వరగా అంతరించిపోయే ప్రమాదం ఉన్నందున జాతీయకరణను చేపట్టారు. అయితే పెరుగుతున్న వ్యాపార, వాణిజ్య అవసరాల నేపథ్యంలో ఇతోధిక పెట్టుబడులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉత్పాదకత పెంచుకోవడంలో సీఐఎల్ విఫలమైనందున కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ప్రైవేటు సంస్థలు క్యాపిటివ్ మైనింగ్ విధానంలో సొంత సిమెంటు, ఉక్కు, అల్యూమినియం ఫ్యాక్టరీల ముడిసరకు అవసరాలకు మాత్రమే బొగ్గు నిక్షేపాల్ని తవ్వుకోవడానికి అనుమతిస్తున్నారు. అనుమతులకు మించి తవ్విన బొగ్గును తిరిగి కోల్ ఇండియాకే విక్రయించాలన్న నిబంధన ఉండేది. తమ ప్లాంట్లలో బొగ్గు కొరతపై ఆందోళన వ్యక్తంచేస్తూ గత నవంబర్‌లో సీఐఎల్ సంస్థకు ఇండియన్ కేపిటివ్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోషియేషన్ వివరణాత్మక లేఖ రాసింది. సీఐఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న బొగ్గు పరిమాణాల్లో కేవలం సగం మాత్రమే సరఫరా చేస్తుండడంతో, ఖరీదైన విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని ఆ లేఖలో పేర్కొంది. అదేవిధంగా 'అల్యూమినియం అసోసియేషన్ ఆఫ్ ఇండియా' బొగ్గు కొరత సమస్యను తక్షణం పరిష్కరించాలని అభ్యర్థిస్తూ ప్రధానికి లేఖ రాసింది. గత డిసెంబర్‌లో సీఐఎల్ బొగ్గు సరఫరా ఒప్పందాలను ఘోరంగా అతిక్రమిస్తోందని 'కాంపెటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా' సంస్థ తప్పుపట్టింది. అదే సమయంలో విదేశాలతో పోలిస్తే భారతీయ బొగ్గులో 45 శాతం బూడిద ఉండి నాసిరకం కావడంతో పోటీని తట్టుకోలేకపోతోంది. బొగ్గు మైనింగ్ నాణ్యతను, పరిమాణాన్ని పెంచుకోవడంలో కోల్ ఇండియా వెనకబడిపోయింది. ఈ నేపథ్యంలో దేశవిదేశీ కంపెనీలు బొగ్గుక్షేత్రాల్ని వేలంపాటలో సొంతం చేసుకొని స్వేచ్ఛగా వ్యాపార, వాణిజ్యాలను నిర్వహించేందుకు వీలుగా కేంద్రం తీసుకున్న నిర్ణయం సంచలనాత్మకమైంది. ఈ నిర్ణయం వల్ల బొగ్గు కొరతను ఎదుర్కొంటున్న భారీ పరిశ్రమల నిర్వహణకు ఇంధన భద్రతతోపాటు, లక్షలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించగలదని కేంద్రం భావిస్తోంది. బొగ్గుగనుల కేటాయింపుల్లో లక్షా 86 వేల కోట్ల స్కాం నేపథ్యంలో ప్రైవేటీకరణ ద్వారా పారదర్శకత సాధించవచ్చని కేంద్రం అభిప్రాయం.

నిరుడు నీతి ఆయోగ్ వెలువరించిన జాతీయ ఇంధన విధానం ముసాయిదాలో అందుబాటులో ఇంధన ధరలు, బొగ్గు–సహజవాయువు వంటి ఇంధనాల దిగుమతులపై కోత, పునరుత్పాదక ఇంధన వనరుల ఆధారంగా అభివృద్ధికి కృషి చేయాలని సూచించింది. 2040లో విద్యుత్ గిరాకీ దేశీయంగా నాలుగున్నర రెట్లు అదనంగా పెరుగుతున్న బొగ్గుగనుల ప్రైవేటీకరణతో పోటీ పెరిగి ఉత్పాదక వేగంపుంజుకుంటుందని నిపుణుల అంచనా. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వరంగ బొగ్గుగనుల్లో ఉత్పాదకతను పెంచేందుకవసరమైన సంస్కరణలను, ఆధునికీకరణను తీసుకురావలసిన బాధ్యతను పక్కనబెట్టి క్యాప్టివ్ మైనింగ్ అనుమతుల కుంభకోణానికి పాల్పడింది ఈ ప్రభుత్వాలే. కోల్ ఇండియాను క్రమంగా నిర్వీర్య పరచి దేశ ఆర్థిక వ్యవస్థ బొగ్గు కొరత కారణంగా నష్టాల్లో కూరుకుపోవడానికి కారణం ఈ పాలకులే. తప్పు విధానకర్తల ఆశ్రిత కార్పొరేట్ వర్గాల పక్షపాతంలో ఉంది గానీ, కోల్ ఇండియా గుత్తాధిపత్యంతో వైఫల్యాలు సంభవించాయన్న అంచనాలు తప్పు. దేశ, విదేశీ కార్పొరేట్ సంస్థలిచ్చే కమీషన్లకు ఆశపడి పాడి ఆవులాంటి ప్రభుత్వ బొగ్గు మైనింగ్ రంగాన్ని ప్రైవేటైజేషన్‌కు గురిచేయడం మోదీ ప్రభుత్వం అందిస్తానన్న గరిష్ట పాలనకు అద్దం పడుతుంది. ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరించడం, మూలధన షేర్లను తెగనమ్మడం ద్వారా ఆదాయం సమకూర్చుకుంటూ, ప్రజాకర్షక సంక్షేమ పథకాలకు మళ్లించడం గరిష్ట పాలనకు సంకేతమా? 'సొంత సంస్థల్లో అత్యంత పథకం ప్రకారం వ్యవహరిస్తూ, సామాజిక విషయాల్లో అత్యంత బాధ్యతారహితంగా, అరాచకంగా వ్యవహరించే' దేశ, విదేశీ కార్పొరేట్లకు మైనింగ్‌రంగాన్ని అప్పగిస్తే, భారీలాభాల కోసం పునరుద్ధరణకు వీలుకాని సహజవనరులన్నిటినీ భవిష్యత్ తరాలకు మిగల్చకుండా ఖాళీ చేసేస్తారు. ఆ క్రమంలో ఓపెన్ క్యాస్ట్ మైనింగ్ కార్యకలాపాల ద్వారా విస్తారమైన భూసారాన్ని ధ్వంసం చేయడమేకాక, మైనింగ్ వ్యర్థాల కారణంగా జనావాసాలన్నీ కలుషితమై ప్రజారోగ్యం సంక్షోభంలో పడుతుంది. మైనింగ్ నియంత్రణ మండలి ఏర్పాటు ద్వారా కార్పొరేట్ సంస్థల మితిమీరిన మైనింగ్ నియంత్రించవచ్చని సర్దిచెప్పుకున్నా, ఆచరణలో బళ్ళారి మైనింగ్ అనుభవం మళ్ళీ పునరావృతమయ్యే అవకాశం ఉంది. మైనింగ్ ప్రైవేటీకరణ వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ 'డచ్ రోగం' అనే ఆర్థిక రుగ్మతకు గురై సంక్షోభంలోకి జారిపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వరంగ మైనింగ్ సంస్థను సమర్థంగా పనిచేయించలేని ప్రభుత్వాలు, ప్రైవేటురంగ అక్రమాలను అరికట్టగలవనుకోవడం అత్యాశే అవుతుంది.



మంచిమాట



ఎదుటివారిని చూసి ప్రేమగా నవ్వగలిగితే అదే వారికి నువ్విచ్చే అందమైన బహుమతి

- మదర్ థెరిస్సా

అయోమయంలో పవన్ పయనం!

ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా ఎటువంటి కేటాయింపులు లేకపోవడం, విభజన హామీల అమలుకు, గతంలో ప్రత్యేక హోదా స్థానంలో ప్రకటించిన ప్రత్యేక ప్యాకేజీ అమలు విషయమై ప్రస్తావన కూడా లేకపోవడంతో ఆ పరిస్థితిని ఇక్కడ అధికారంలో ఉన్న తెలుగుదేశం ఒక రాజకీయ అస్త్రంగా మార్చుకొనే ప్రయత్నం చేసింది. గత నాలుగేళ్లుగా అందమైన కలలను ప్రజల ముందుంచడం మినహా అమలు చేసే ప్రయత్నం చేయకపోవడంతో ప్రజలలో తెలుగుదేశం పాలన పట్ల కొంతమేరకు నిరాశ నెలకొనడం ప్రారంభమైనది. ఈ పరిస్థితులు సహజంగానే ప్రతి పక్ష నేత జగన్మోహన్‌రెడ్డికి కలిసివస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఆయన జరుపుతున్న పాదయాత్రకు గ్రామాల్లో మంచి స్పందన లభించడం అధికారపార్టీకి ఆందోళన కలిగిస్తున్నది. ఈ నేపథ్యంలో జైట్లీ బడ్జెట్ తెలుగుదేశానికి సువర్ణావకాశంగా లభించింది. కేంద్రం నుంచి తగు సహకారం అందించక పోవడంతోనే తామేమీ చేయలేకపోతున్నామనే సందేశం ప్రజలకు ఇచ్చే ప్రయత్నం చేశారు. పాలకపక్షం ఎన్డీయేలో భాగస్వామిగా ఉన్నప్పటికీ బడ్జెట్ సమావేశాల్లో టీడీపీ ఎంపీలు రభస సృష్టించారు. తాము వెనుకబడిలేమని చెప్పుకోవడం కోసం వైసీపీ ఎంపీలు కూడా పార్లమెంట్‌లో నిరసనకు పాల్పడ్డారు. మోదీ మంత్రివర్గంలో సభ్యుడిగా ఉండి కూడా రాజ్యసభలో సుజనా చౌదరి ప్రభుత్వాన్ని నిలదీశారు. టీడీపీ ఎంపీల నిరసన దేశం దృష్టిని ఆకర్షిస్తున్నప్పటికీ పట్టిం చు కోకుండా, బడ్జెట్‌పై ఎలాంటి వ్యాఖ్య చేయకుండా జన సేన అధినేత పవన్ కల్యాణ్ హఠాత్తుగా కార్యాచరణకు నడుం బిగించారు. ముందుగా రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి ఉద్యమించాడానికి జేఏసీ ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ నారాయణ్, ఉండవల్లి అరుణ కుమార్ వంటి మీడియా దృష్టిని ఆకట్టుకునే పేర్లు ప్రకటించారు. వారిని పవన్ కలిసినప్పుడు ఎంతో ప్రచారం లభించింది.

హైదరాబాద్‌లో రెండురోజుల సదస్సు నిర్వహించి, నిజనిర్ధారణ కమిటీ వేసి, ఉద్యమానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు హడావుడి చేశారు. అయితే ఈ సదస్సులో పాల్గొన్నవారిని చూస్తే వారంతా రాజకీయంగా ఉనికి కోసం ఎదురు చూస్తున్న నూరుశాతం రాజకీయ నిరుద్యోగులే ఎక్కువగా ఉండడంతో చాలామందికి నిరాశే మిగిలింది. జయప్రకాశ్ నారాయణ్ రాజకీయ పార్టీని ఏర్పరచి, ఎమ్మెల్యేగా ఐదేళ్లు పనిచేసి, తిరిగి పోటీచేయడానికి వెనుకాడారు. గత ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేయడం కోసం బీజేపీ, టీడీపీ మద్దతు పొందడానికి విఫలయత్నం చేసి, చివరకు రాజకీయ పార్టీ కార్యకలాపాలనే రద్దు చేసుకున్న నేత. రెండుసార్లు ఎంపీగా ఉండి, వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కీలకవ్యక్తిగా మెలిగి, గత ఎన్నికల్లో పోటీకి కూడా సాహసించలేని, ప్రస్తుతం ఏ పార్టీ దగ్గర చేరలేని నిస్సహాయ స్థితిలో ఉండవల్లి ఉన్నారు. ఇక ఉభయ కమ్యూనిస్టుపార్టీలు మూడు దశాబ్దాల పాటు ఏదో ఒక ప్రధాన పార్టీతో పొత్తు ఏర్పాటు చేసుకొని రాష్ట్ర రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర వహిస్తూ వచ్చాయి. కానీ కొంతకాలంగా ఆ పార్టీలను దగ్గరకు చేర్చుకోవడానికి ఎవరూ ఆసక్తి చూపడం లేదు. సీపీఎం వైసీపీతో పొత్తు కోసం రంగం సిద్ధంచేసుకొని, తీరా జగన్ 'జై మోదీ' అనేసరికి నాలిక కరుచుకొంది. పవన్‌ను పట్టుకుని నాలుగుసీట్లు పొందాలని కాచుకూర్చున్న సీపీఐ పవన్–చంద్రబాబు పట్ల సానుకూల అభిప్రాయం వ్యక్తంచేసినప్పుడల్లా ఉలిక్కిపడుతూ ఉంటుంది. ఈ రెండు వామపక్షాలు ప్రస్తుతం తామే కలసి పనిచేయలేక పోతున్నాయి. మిగిలిన నాయకులంతా మీడియా ద్వారా ప్రచారంలోకి వస్తున్నవారే. ఈ సదస్సులో పాల్గొన్న వారెవ్వరూ సొంతంగా ప్రజలను సమీకరించి, కదిలించే ఉద్యమాలు చేయగల సామర్థ్యం, బలమున్న వారెవరూ లేరు. ఇప్పటికే విభజన హామీల అమలు గురించి ఒకవంక ఏపీ ప్రభుత్వం అందిస్తున్న వివరాలు, మరో వంక బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు విడుదల చేసిన వివరాలు అందుబాటులో ఉండగా, వాటిపై 'దర్యాప్తు' కోసం నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయడం హాస్యాస్పదంగా ఉంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ ప్రజల్లో ఎటువంటి విశ్వాసాన్ని చూరగొనలేదు. ఈ కమిటీలో ముగ్గురు ఉద్యోగ విరమణ చేసిన ఐఏఎస్ అధికారులే ఉన్నారు. ఇద్దరైతే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో జగన్‌తో సంబంధమున్న ప్రతినిధులుగా పేరొందుతున్నారు. మరొకరికైతే రాష్ట్ర వ్యవహారాల్లో ముఖ్యంగా ఏపీ పరిపాలనతో ప్రత్యక్ష సంబంధం లేనివారు. వాస్తవానికి నేడు రాష్ట్రంలో ప్రజలను పెద్దయెత్తున కదిలించగల ముగ్గురు నాయకుల్లో ఒకరు పవన్ అని చెప్పవచ్చు. చంద్రబాబు, జగన్ వలే ఆయన ఎక్కడకు వెళ్లినా పెద్దయెత్తున జనం గుమికూడతారు. రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేస్తోందని ఆయన రాష్ట్ర పర్యటన చేబడితే రాజకీయంగా పెనుసంచలనాలు సృష్టించవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటినీ ఇరకాటంలో పడవేయవచ్చు. తనకు విశేష ప్రజాదరణ ఉండగా ప్రజల్లో పట్టులేని వ్యక్తులు, పార్టీలు, సంస్థలతో పనేమిటనే ప్రశ్నలకు పవన్ సమాధానం చెప్పాలి. తానే ప్రజల మధ్యకు వెళ్లి, వారిని కదిలించే ప్రయత్నం చేయకుండా, 'పేపర్ టైగర్'లుగా పేరొందిన వారితో హైదరాబాద్‌లో స్టార్‌హోటల్‌లో సమావేశం ఏర్పాటు చేయడం గమనిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పట్ల ప్రజల్లో చెలరేగుతున్న అసంతృప్తిని, ఆగ్రహాన్ని చల్లార్చడం కోసం పవన్ ప్రయత్నం చేస్తున్నారా అనే అనుమానాలు కొందరికి కలుగుతున్నాయి.



నేడు రాజకీయాలన్నా, ఎన్నికలలో పోటీచేయడమన్నా భారీ వ్యయంతో కూడుకున్న వ్యవహారం. అందుకు అవసరమైన వనరులను సమకూర్చుకోవడం అత్యవసరం. ఇంకా రాజకీయ పార్టీ స్వరూపాన్ని జనసేనకి ఏర్పర్చక పోవడంతో అభ్యర్థుల ఎంపిక, పోలింగ్ బూత్‌స్థాయిలో పార్టీ యంత్రాంగం ఏర్పరచుకోవడం, కనీసం మండల స్థాయిలో పార్టీ కార్యాలయాలు ఏర్పరచుకోవడం వంటి వ్యవహారాలకోసం సంవత్సర కాలం కూడా సరిగ్గా సరిపోదు.

ఏదేమైనా విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి తగున్యాయం జరగడం లేదని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ విషయమై చంద్రబాబు, జగన్, హరిబాబు మాట్లాడుతున్న మాటలను తమ తమ రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మాట్లాడినట్లే ప్రజలు భావిస్తున్నారు. అదే పవన్ ప్రజల మధ్యకు వెడితే రాష్ట్రప్రజల తరపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గట్టి హెచ్చరిక పంపినట్లు కాగలదు. ఒకవిధంగా రాష్ట్ర రాజకీయాల్లో బలమైనశక్తిగా అవతరించగల బంగారు అవకాశాన్ని పవన్ కోల్పోయిన్నట్లు స్పష్టమవుతున్నది. సినీ అభిమానులే కాకుండా, ఇంకా స్వరూపం ఏర్పడని జనసేన పట్ల ప్రజల్లో ఎన్నో అంచనాలు ఏర్పడ్డాయి. గత అక్టోబర్ నుంచి రాష్ట్రమంతా విస్తృతంగా పర్యటిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఇప్పటివరకు ఒక్క జిల్లాలో పట్టుమని రెండురోజులు పర్యటించిన దాఖలాలు లేవు. ఈ మధ్యనే తొలిసారిగా అనంతపురం జిల్లాలో మూడురోజులు పర్యటించారు. రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ఒకసారి, కాదు బస్సుయాత్ర అని మరోసారి సంకేతాలు ఇచ్చారు. కానీ నిర్దిష్టమైన రాజకీయ కార్యక్రమం ప్రకటించడం లేదు. రాజకీయ పార్టీ వలే కాకుండా స్వచ్ఛంద సంస్థ వలే జనసేనను నడుపుతున్నారా అనే అనుమానం కూడా కలుగుతోంది. ఎన్నికలలో పోటీచేసే విషయంలో కూడా అస్పష్టంగా వ్యవహరిస్తున్నారు. అన్నిసీట్లలో పోటీ చేసే బలం, వనరులు లేవంటారు. రాష్ట్రమంతా పర్యటించిన తర్వాత ఉన్న బలాన్ని అంచనా వేసుకొని, ఎన్నికలకు రెండునెలల ముందు పోటీచేయగల నియోజకవర్గాల సంఖ్య గురించి చెబుతానన్నారు. తనను తెలుగుదేశం ఆడించడం లేదని చెప్పుకోవడం కోసమే నిజనిర్ధారణ కమిటీని ఆ పార్టీకి వ్యతిరేకులుగా పేరొందిన వారితో వేసినట్లు కనిపిస్తున్నది. నేడు రాజకీయాలన్నా, ఎన్నికలలో పోటీచేయడమన్నా భారీ వ్యయంతో కూడుకున్న వ్యవహారం. అందుకు అవసరమైన వనరులను సమ కూర్చుకోవడం అత్యవసరం. ఇంకా రాజకీయ పార్టీ స్వరూపాన్ని జనసేనకి ఏర్పర్చక పోవడంతో అభ్యర్థుల ఎంపిక, పోలింగ్ బూత్‌స్థాయిలో పార్టీ యంత్రాంగం ఏర్పరచుకోవడం, కనీసం మండల స్థాయిలో పార్టీ కార్యాలయాలు ఏర్పరచుకోవడం వంటి వ్యవహారాలకోసం సంవత్సర కాలం కూడా సరిగ్గా సరిపోదు. అయితే ఎన్నికలు సమీపిస్తున్నా పవన్ కళ్యాణ్‌లో తొందరపాటు కనబడటం లేదు. ఆయన రాజకీయ ఎత్తుగడలు ఏమిటో ఆయన మద్దతు దారులకే అంతుబట్టడం లేదు.

చలసాని నరేంద్ర
9849569050

'స్వచ్ఛభారత్' స్ఫూర్తి ప్రధాత గాడ్గే బాబా

బాపూజీ కలను సాకారం చేయడానికి ప్రధాని నరేంద్రమోదీ 2014, అక్టోబర్ 2న ప్రారంభించిన స్వచ్ఛభారత్ మిషన్‌ను జాతిపిత 150వ జయంతి నాటికి అంటే అక్టోబర్ 02, 2019లోగా సాధించాలని సంకల్పించారు. ఈ స్వచ్ఛభారత్‌ను వందేళ్ళ క్రితమే (1907) కలగన్న అసా మాన్యుడు గాడ్గే మహరాజ్/గాడ్గే బాబా. దేశంలోనే గర్వించదగ్గ 19వ శతాబ్దపు గొప్ప సంఘ సంస్కర్త ఈ బాబా. మహా రాష్ట్రలో అమరావతి జిల్లాలోని షేన్‌గావ్‌లో 1876, ఫిబ్రవరి 23న సక్కుబాయి, జింగ్రాజీలకు జన్మించిన గాడ్గేబాబా పూర్తిపేరు దేవూజీ జింగ్రాజి జనార్కర్.

దేవూజీ అంటే మరాఠీలో మట్టి చిప్ప. చేతిలో చీపురు, తలపై మట్టి చిప్ప, ఒంటిపై రంగురంగుల గుడ్డపేలికలతో కూడిన దుస్తులు ధరించడం ఇతని ఆహార్యం. చీపురుపట్టి చిద్విలాసంగా ఫోటోలకు ఫోజులివ్వడం తెలి యదు. కాని చీపురుతో వీధులను శుభ్రం చేయడంలో భాగంగా చీపురును తన ఆహార్యంలో భాగంచేసుకుని దానితోనే సహవాసం చేశాడు. రాజ్యాం గ నిర్మాత డా॥బి.ఆర్ అంబేడ్కర్ – గాడ్గేబాబాను తన గురువుగా ప్రకటించుకున్నారు. జ్యోతిరావు పూలే అతని సంఘసేవను చూసి అభినందించారు. తన 30వ ఏట భార్యపిల్లలను వదిలి దేశాటనకు బయలుదేరి గాడ్గే బాబా సంచార సాధువుగా మారాడు. ఏ ఊరికెళ్ళినా మొదటగా చేసేది వీధులు ఊడ్చటం, దేవాలయ ప్రాంగణాన్ని శుభ్ర పరచడం. మూఢనమ్మకాలు పాటించ వద్దనీ, సాటి మనిషిని కులం పేరిట చిన్నచూపు చూడవద్దని బోధించాడు. కుల, మతభేదం లేకుండా మను షులందరూ సమానమన్న ఆయన మాటలు, చేతల్లోని నిజాయితీ జనా లను కట్టిపడేసింది. అనాథాశ్రమాలు, పాఠశాలలు, వసతి గృహాలు, ధర్మ శాలలు– మొత్తం 150 నిర్మాణాలను ప్రజల సహకారంతో పూర్తిచేశాడు. మహా రాష్ట్రను సోషలిస్టు భావాల వేదికగా చేసింది గాడ్గే బాబాయే అని ప్రముఖ మరాఠా రచయిత ఆత్రే ప్రశంసించారు. ఆ రోజుల్లో మట్టిపనో, కుమ్మరి పనో చేసి రెండురొట్టెలు సంపాదించి ఆరగించేవాడు. పాడుబడ్డ గోడల మాటునో, దేవాలయంలోనో తలదాచుకునేవాడు. రోడ్డుమీద తిని, రోడ్ల పక్కనే జీవించి, చివరికి రోడ్డు పక్కనే 1956, డిసెంబర్ 20న గాడ్గే బాబా తనువు చాలించాడు. ఆనాడే కులరహిత సమాజాన్ని నిర్మించి, స్వచ్ఛ భా రత్‌ను కలగన్న మహనీయుడు ఆయన. గాడ్గేబాబాకు జ్ఞాపికగా మహా రాష్ట్రలోని అమరావతిలో 'సెయింట్ గాడ్గే బాబా యూనివర్సిటీని' 1983 లో స్థాపించారు.

గుమ్మడి లక్ష్మీనారాయణ
9491318409

(నేడు గాడ్గే బాబా జయంతి)

మన వేదిక

కోల్ ఇండియా ప్రైవేటీకరణ తగదు

మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం జాతీయ సంపదైన బొగ్గు గనులను ప్రైవేటీకరించాలని నిర్ణయించడాన్ని ఎఐటియుసి రాష్ట్ర ఆఫీసుబేరర్ తీవ్రంగా ఖండించింది. బొగ్గుగనుల జాతీయకరణ కోసం అనేక ఉద్యమాలు చేపట్టిన ఫలితంగా 1973లో జాతీయకరణ చేయటం జరిగింది. గత 45 సంవత్సరాలలో లక్షల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చిన బొగ్గు గనులను ప్రైవేటీకరించడాన్ని విదేశీ, స్వదేశీ కార్పొరేటు పెట్టుబడిదారులకు మరిన్ని లాభాలు చేకూర్చే విధంగా ఉంది. జాతీయ ప్రయోజనాలకి వ్యతిరేకమని తక్షణమే ఉపసంహరించుకోవాలని సమావేశం డిమాండ్ చేసింది.

- ఉజ్జిని రత్నాకర్‌రావు
ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి

అస్తిత్వ ద్వైతాద్వైతం - 2



వెన్నెలకంటి రామారావు
9550367536

ప్రతిఫలనం

కులవ్యవస్థ పునాదిగా 'ఏకీకృత హిందూ అస్తిత్వ' (యునిఫైడ్ హిందూ ఐడెంటటీ) అమానవీయతకు నిస్సాయంగా తమలో తాము ఉసూరుమంటూ బతుకులీడుస్తున్న అణగారిన కుల, మైనారిటీ తదితర అస్తిత్వ సమూహాలు చరిత్రలో వివిధ సందర్భాల్లో అనేక రూపాల్లో ప్రతిఘటించాయి. తొలిదశలో 'తమలో తామొక వర్గం'గా ఉన్న అణగారిన అస్తిత్వాలు 'తమ కోసం తామొక వర్గం'గా సంఘటితం కావడం మంచి పరిణామమే. కానీ, ఇతర అస్తిత్వాలతో సంబంధం లేకుండా 'తమకు తాము మాత్రమే ఒక వర్గం'గా గిడసబారిపోయి, స్వయం నిరోధకాన్ని (ఇమ్యూనిటీ) సంతరించుకోవడంతో అలాంటి అస్తిత్వ సంస్థలు మౌలిక సామాజిక మార్పుకు అవరోధంగా మారాయి. కుల, మత తదితర అస్తిత్వ ఉద్యమాలన్నీ అవి ప్రాతినిధ్యం వహించే అస్తిత్వ ప్రజానీకంలోని నిర్దిష్ట శ్రమ విభజనకు (చేతివృత్తులు) ప్రాతినిధ్యం వహించే అట్టడుగు వర్గాల (నిజ అస్తిత్వాల– రియల్ ఐడెంటిటీ) సమస్యలను పట్టించుకోవడం మానివేశాయి. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, రాజకీయ పార్టీ అధికార స్థానాలలో వాటాలు, ప్రభుత్వంలో కీలక స్థానాల్లో వాటాల కోసం పోటీపడడమే ధ్యేయంగా పనిచేస్తున్నాయి. ప్రతి అస్తిత్వ ఉద్యమమూ అది ప్రాతినిధ్యం వహించే అస్తిత్వం నుంచి (అగ్ర/అణగారిన కులాలు, మెజారిటీ/మైనారిటీ మతాలు వగైరా) దూరమై ఇతరత్రా మానసిక, శారీరక శ్రమ విభజనలో పనులు చేసుకుంటున్నవారు లేదా మధ్యతరగతి, సంపన్నవర్గాల (అవశేష అస్తిత్వాలు– రెసిడ్యువల్ ఐడెంటిటీ) ఆకాంక్షలకు ప్రతిరూపంగా మారిపోయింది. అస్తిత్వ ఉద్యమ నాయకత్వాన్ని విమర్శిస్తే మొత్తం ఆ అస్తిత్వ ప్రజానీకాన్నంతా విమర్శించినట్లుగా వివాదాస్పదం చేస్తున్నారు. ఆరెస్సెస్‌నుగానీ, మోహన్ భగవత్‌నుగానీ విమర్శిస్తే హిందువులనందర్నీ విమర్శించినట్లు కాదు, అదే విధంగా ఒవైసీ వివాదాస్పద వ్యాఖ్యానాలను ప్రశ్నిస్తే, మైనారిటీ ముస్లింలందర్నీ అవమానించినట్లూ కాదు. దీనికి తోడు వామపక్ష, హేతువాద, ప్రజాస్వామిక సంస్థల్లో దళిత, బహుజన, మైనారిటీ వాదాలను విమర్శనారహితంగా సమర్థించే ధోరణి కూడా సమర్థనీయం కాదు. ఆత్మగౌరవ పోరాటాలు, కుల వివక్ష వ్యతిరేక ఉద్యమాలు, కులాంతర వివాహాల ఉద్యమం, మనుస్మృతి వ్యతిరేక పోరాటం వంటి కుల అస్తిత్వ ఉద్యమాలు అవసరం లేదని, అవి ప్రతీఘాతుకమైనవి, నిరర్థకమైనవని చెబుతున్నట్లుగా సంకుచిత ధోరణిలో అర్థం చేసుకోరాదు. నిజ అస్తిత్వ ప్రజాదృక్పథం కొరవడి, అవశేష అస్తిత్వాల ఆకాంక్షలకు మాత్రమే పరిమితమైన అస్తిత్వ ఉద్యమాలు తప్పుదారి పట్టే అవకాశాలుండడంపై హెచ్చరికగా అర్థం చేసుకోవాలి.

అణగారిన అస్తిత్వాలపై జరుగుతున్న దాష్టీకానికి, విధ్వంసకాండకు వ్యతిరేకంగా ఉద్యమించడం సబబే కానీ, ఆ పేరుతో ప్రపంచవ్యాప్తంగా కొన్ని అస్తిత్వ సమూహాలు సాగిస్తున్న విధ్వంసకర, టెర్రరిస్టు కార్యక్రమాలు సమర్థనీయం కాదు. పాలకవర్గాల ఓటు బ్యాంకులుగా మారి లాబీయింగ్ ద్వారా ఏవో కొద్దిపాటి డిమాండ్లను సాధించి, అధికారంలో వాటా పొందాలని కొందరు అస్తిత్వవాద నాయకులు చేస్తున్న ప్రయత్నాలు ఆ అస్తిత్వ ప్రజానీకానికంతటికీ ఏ మాత్రం ఉపయోగపడవు. కాగా, ఆ నాయకులు ''ఆధిపత్య అస్తిత్వాల తరపున పనిచేసే 'అణగారిన అస్తిత్వాల' దండనాయకు''లుగా (అప్రెస్స్‌డ్ రెప్రజెంటేటివ్స్ ఆఫ్ రూలింగ్ ఐడెంటిటీస్) ప్రతీఘాతుక పాత్ర పోషిస్తారు. ఈ విషయాన్ని అభివృద్ధికర శక్తులు తగిన విధంగా గుర్తించకపోవడంతో శుద్ధ అస్తిత్వవాద నాయకుల ఉద్వేగభరిత ప్రచార ప్రభావంలో కొట్టుకుపోతున్న సాధారణ నిజ అస్తిత్వ ప్రజానీకాన్ని ఆకట్టుకోలేక పోతున్నాయి. హిందూ/ముస్లిం తదితర మైనారిటీ మతతత్వ రాజకీయాలు; అగ్ర/అణగారిన కుల అస్తిత్వవాదాలూ భిన్న సామాజిక సందర్భాల్లో భిన్నమైన స్వభావాన్ని కలిగి ఉన్నట్లు కనిపించినా అంతస్సారంలో రెండూ చారిత్రకంగా అభివృద్ధి నిరోధక పాత్రనే పోషిస్తాయి. మతం, దానికి భారతీయ అనుబంధంగా కొనసాగే కులం పునాదిగా సాగే అస్తిత్వవాదాలు (ఆధిపత్య/అణగారిన) ఏవైనా అంతిమంగా అభివృద్ధినిరోధక పాత్ర పోషించే దిశగా పరిణమిస్తున్నాయి. అణగారిన అస్తిత్వవాదమైనంత మాత్రాన దానికదే అభివృద్ధికరమైనదిగా ఎల్లకాలం కొనసాగదు. అణగారిన అస్తిత్వాల్లోని నిజ లేక అట్టడుగు మెజారిటీ ప్రజల జీవన సమస్యలను, ఆకాంక్షలను పరిష్కరించే ఎజెండాతో సాగే అస్తిత్వవాదం మాత్రమే చారిత్రకంగా సవ్యమైన పాత్ర పోషిస్తుంది. నిజ అస్తిత్వాల ఆకాంక్ష కేంద్రంగా సాగే అస్తిత్వ ఉద్యమం, శ్రమ సంబంధాల ప్రాతిపదికన, ఇతర అస్తిత్వాల్లోని నిజ/అణగారిన/శ్రమ చేసే ప్రజానీకంతో ఐక్యం అవడానికి ప్రాతిపదిక ఏర్పడుతుంది. అలాకాకుండా శుద్ధ అస్తిత్వవాదంగా సాగే ఉద్యమాలు క్రమంగా దురహంకారానికి, ఉన్మాదానికి, సామాజిక–చారిత్రక ఏకాకితనానికి, అంతిమంగా పాలకవర్గాలలో ఏదో ఒకదాని కొమ్ముకాసేవిగా మారిపోతాయి. ఒక అస్తిత్వ ప్రజానీకంలోని నిజ, అణగారిన ప్రజానీకం మౌలిక సమస్యలకు శాస్త్రీయ పరిష్కారంతో కూడిన కార్యాచరణ ప్రణాళిక లేని శుద్ధ అస్తిత్వ ఉద్యమాలు అంతిమంగా ఆ అణగారిన ప్రజానీకాన్ని ఓటు బ్యాంకులుగా మారుస్తాయి. అవశేష అస్తిత్వ ప్రజానీకపు ఆకాంక్షలకు, అధికారంలో వాటా కోసం చేసే పాకులాటకు, చారిత్రక ప్రతీఘాతక మత దురహంకార స్వభావానికి నిజ అస్తిత్వ ప్రజానీకం బలైపోతుంది. ఇప్పటిదాకా వివిధ రాజకీయ పక్షాలు మాత్రమే కుల సంఘాలతో వ్యవహరిస్తుండేవి. ఇప్పుడు సంఘపరివార్ శక్తులు దళిత, వెనకబడిన కులాల ప్రజానీకాన్ని మత ప్రాతపదికన సులభంగా సంఘటితం చేస్తున్నాయి. శుద్ధ కుల వాదం కూడా ఒకరకంగా శకల మత వాదమే. అందువల్ల సంఘపరివార్ 'ఏకీకృత హిందూ అస్తిత్వ' ఎజెండాలో శకల మతవాదమైన కుల అస్తిత్వవాదం సులభంగా అంతర్భాగం కాగలదు. శుద్ధ కుల అస్తిత్వవాదులకు సామాజిక, రాజకీయ సంస్థల్లోనూ, ప్రభుత్వంలోనూ, విద్య, ఉద్యోగం తదితర రంగాల్లో తమకు లాభదాయకమైన వాటా లభిస్తే మత/లౌకిక భావజాలాలలో దేనితోనైనా సులభంగా కలసి పోయి, తమ నిజ అస్తిత్వ ప్రజానీకం ఆశలు, ఆకాంక్షలను పాలకవర్గాల పాదాల ముందుంచుతారు. ప్రపంచ మానవాళి విముక్తి ప్రస్థానంలో తన అస్తిత్వ ప్రజానీకం స్థితి గురించి, పాత్ర గురించి గూగీ తపన పడ్డాడు, భౌతిక, భావజాల అధికార కేంద్రాలను ధిక్కరించాడు, తనదైన శైలిలో పోరాడాడు కానీ, ప్రపంచాధిపత్య శక్తుల, పాలకుల పాలనాధికారంలో, దాష్టీకంలో, ఆధిపత్య స్థానంలో, దోపిడీ కార్యకలాపాలలో సాధికారిత, సమన్యాయం, న్యాయమైన వాటా రూపంలో భాగస్వామ్యం కావాలని ఎన్నడూ కాంక్షించలేదన్న విషయాన్ని అందరూ గుర్తించాలి. ప్రపంచ అణగారిన అస్తిత్వాలు ఏకతాటిపై వచ్చి, ప్రపంచ పాలకుల్ని ధిక్కరించేందుకు ఏకీకృతమయ్యే పీడిత ప్రజల అస్తిత్వ పోరాటమే గూగీ ఆకాంక్ష అనే సూక్ష్మాన్ని అర్థం చేసుకోగలగాలి. సమాజాన్ని ఫాసిజంగా ఆవరిస్తున్న కులవ్యవస్థ పునాదిపై 'ఏకీకృత హిందూ అస్తిత్వ' ప్రమాదాన్ని నిరోధించాలంటే శ్రమ సంబంధాల ప్రాతిపదికన దళిత, మైనారిటీ తదితర సమూహాలలోని నిజ అస్తిత్వ ప్రజానీకంతో సంఘటితమైన 'ఏకీకృత నిజ అస్తిత్వ' ఉద్యమ నిర్మాణమే తక్షణ కర్తవ్యం. నిజ అస్తిత్వ దృక్పథం పునాదిపై సాగే ఆత్మగౌరవ, కుల వివక్ష వ్యతిరేక, కుల నిర్మూలనా ఉద్యమాలు 'ఏకీకృత అస్తిత్వ' ఉద్యమంగా అవతరిస్తేనే చారిత్రకంగా సవ్యమైన పాత్రను పోషించ గలదు. 'ఒక ఉద్యమం అభివృద్ధికి గల కారణాన్ని ప్రజల పాత్రలో వెతకాలి, ఆ ఉద్యమం పక్కదారి పట్టడం లేదా దెబ్బతినిపోవడానికి గల కారణాన్ని దాని నాయకత్వంలో వెతకాలి' అన్న ఒక పాశ్చాత్య మేధావి మాటల్ని ఇక్కడ గుర్తుచేసుకోవాలి.

అవనిలో టాప్ గన్

అవని చతుర్వేది మొట్టమొదటి ఇండియన్ వుమెన్ టాప్ గన్‌గా రికార్డు సృష్టించారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఫ్లైయింగ్ ఆఫీసర్ అవని యుద్ధ విమానం మిగ్-21ను నడిపి సార్థక నామధేయురాలిగా నిలిచారు. ఇప్పటివరకూ మనదేశంలో పురుషులు మాత్రమే యుద్ధ విమానాలను నడుపుతుండగా ఫస్ట్ బ్యాచ్‌లో భాగంగా ముగ్గురు వుమెన్ పైలట్లు మిగ్ నడిపేందుకు ఎంపికయ్యారు. వారిలో అవని కూడా ఒకరు.



మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాకు చెందిన అవని, సైనికుడైన తన సోదరుడిని చూసి రక్షణరంగంలోకి కాలుమోపాలని చిన్నప్పటినుంచీ కలలు కన్నారు. ఇప్పటికే పిలాటస్ పీసీ-7 టర్బోప్రాప్స్, కిరణ్, హాక్ జెట్‌లను కూడా సోలోగా నడిపి తన సత్తా చాటుకున్నారు. మిగ్ సూపర్ సోనిక్‌ను సోలోగా నడపడంతో భారతదేశాన్ని బ్రిటన్, అమెరికా, ఇజ్రాయిల్, పాకిస్థాన్ సరసన నిలిపిన ఘనత కూడా అవనికే దక్కుతుంది. ఈమెతోపాటే ట్రైనింగ్ పూర్తి చేసుకున్న మరో ఇద్దరు వుమెన్ ఫ్లైయింగ్ ఆఫీసర్స్ భావనా కాంత్, మోహనా సింగ్‌కూడా త్వరలో వుమెన్ టాప్ గన్స్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. రష్యాలో తయారైన ఈ సూపర్ సోనిక్ ఎయిర్ క్రాఫ్ట్‌లు తరచూ ప్రమాదాలకు గురవుతుండగా వీటిని ఎగిరే 'శవపేటికలు' అని పిలుస్తున్నారు. ఇలాంటి మిగ్‌లను నడిపేందుకు మన మహిళా పైలట్లు ఆసక్తి చూపుతుండడం విశేషం.

ఎగిరే శవపేటికలో తొలి మహిళ







టచ్ ద స్కై

ప్రస్తుతం నెట్‌లో మోస్ట్ ట్రెండింగ్ పర్సనాలిటీగా అవని చతుర్వేది ట్రెండింగ్ అవుతున్నారు. అసలు అవని ఎవరు, ఆమె హాబీలు ఏమిటి? ఇలాంటి బోలెడు విషయాలను అత్యధిక నెటిజెన్లు సర్చ్ చేస్తున్నారు. కామన్ మ్యాన్ మొదలు సెలబ్రిటీలు మంత్రులు అందరూ అవనిపై ప్రశంసల వర్షం కురిపిస్తూ అభినందిస్తున్నారు. టచింగ్ ద స్కై అన్న హ్యాష్ ట్యాగ్‌తో అవనిని నెటిజెన్లు ప్రశంసిస్తున్నారు. ఆకాశం నుంచి అవనిని చూస్తున్న టాప్ గన్ అంటూ సోషల్ నెట్వర్క్ సైట్లు హోరెత్తిస్తున్నాయి. 'మహిళలకు ఆకాశం కూడా హద్దు కాద ం'టూ ట్వీట్లు సందడి చేస్తున్నాయి. ఓవైపు రక్షణ శాఖా మంత్రిగా మొట్టమొదటి సారి ఓ మహిళకు అవకాశం దక్కింది. మరోవైపు వుమెన్ ఫ్లైయింగ్ ఆఫీసర్లు టాప్ గన్స్‌గా బాధ్యతలు మోసేందుకు నేటి తరం అమ్మాయిలు సాహసం ప్రదర్శించడం విశేషం. యుద్ధ భూమిలో బాంబుల మోత మోగించేందుకు సన్నద్ధమైన అవని హాబీలు పెయింటింగ్, వయోలిన్ వాయించడం.



సినీ నటి శ్రద్ధ దాస్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న చొపార్డ్ జువెలరీ వాచ్ కంపెనీ సరికొత్త లగ్జరీ వాచ్‌లను లాంచ్ చేసింది. 2.6 కోట్ల రూపాయల విలువైన ఈ డైమండ్ వాచ్‌లు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని షోరూంలో లభిస్తాయి.







అన్నం విషమా?

మనం అన్నంలో ఆర్సెనిక్ విషముందన్న విషయం మీకు తెలుసా? అదేంటి అన్నం కూడా విషమైతే ఇంకేం తినాలి అనుకుంటున్నారా? మీ అనుమానం సరైందే, అన్నం కూడా తినకుండా మన దక్షిణాదివారు ఎలా బ్రతుకగలరు? నేషనల్ కెమికల్ ల్యాబరెటరీ మాజీ సైంటిస్టు డాక్టర్ ఓజీబీ నంబియార్ చెబుతున్న విషయాలు వింటే మీరు షాక్‌కు గురికాక తప్పదు మరి.



మనదేశంలో 20 శాతం కంటే ఎక్కువ మంది డయాబెటిక్, కేన్సర్ వంటి వ్యాధులతో సతమతవుతుండడం వెనుక ఉన్న ప్రధాన కారణం ఆహారపు అలవాట్లేనని నంబియార్ చెబుతున్నారు. మనమంతా ఎంతో ఇష్టంగా తినే అన్నంలో ఆర్సెనిక్ ఉండడంతో పలు జబ్బులు వస్తున్నాయని ఆయన వివరిస్తున్నారు. మెటబాలిజం సక్రమంగా ఉండాలంటే థయామిన్ అవసరం. ఆర్సెనిక్ ఎక్కువగా ఉంటే థయామిన్ లోపిస్తుంది. దీంతో చక్కెర స్థాయి పెరిగి, డయాబెటిక్‌కు దారితీస్తోందని ఈయన అంటున్నారు. బంగాళాదుంపల్లో కూడా ఇది ఎక్కువగా ఉంటుంది,



అందుకే బాగా కడిగి వండాలి. ఇక చిప్స్‌లో మరింత ఎక్కువగా ఆర్సెనిక్ ఉంటుంది. కోళ్ల ఫారంల్లో కోళ్లు త్వరగా బరువెక్కేందుకు ఇచ్చే ఆహారంలోనూ ఆర్సెనిక్ ఎక్కువ మోతాదులో ఉంటుంది. ఇలాంటి కోళ్ల మాంసం తింటే ఆర్సెనిక్ మన శరీరంలోకి ప్రవేశించడం ఖాయం. ఇక కుక్కర్లు, రైస్ కుక్కర్లలో అన్నం వండితే గంజి వార్చం కనుక ఇందులో ఆర్సెనిక్ పాళ్లు మరింత పెరుగుతుంది. ఇడ్లీ రవ్వలోనూ ఈ రసాయనం ఎక్కువగా ఉంటుంది కనుక కొర్ర రవ్వను ఉపయోగించాలని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. బ్రౌన్ రైస్, పాలిష్డ్ రైస్ కంటే కొర్ర అన్నం అత్యుత్తమం అన్నది నంబియార్ వాదన. ఎందుకంటే థయామిన్ అత్యధికంగా ఉండే కొర్రలు డయాబెటిక్‌కు దివ్యౌషధంగా పనిచేస్తుంది. ఇక చిన్నారులకు కూడా తృణ ధాన్యాలు, మొలకెత్తిన ధాన్యాలు బాల్యం నుంచి తినే అలవాటు చేయడం అత్యుత్తమం.

సహజమైనవే వాడండి

సంప్రదాయ పద్ధతులైన గానుగ వంటి విధానంలో తీసిన వంటనూనె ఆరోగ్యానికి చాలా మంచిది. ఇక సహజసిద్ధమైన ఆహారం తీసుకోవడంతో యాంటీ ఆక్సిడెంట్లు పెరిగి, ఇమ్యూనిటీ కూడా పెరుగుతుంది. సమతులమైన ఇలాంటి ఆహారంతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని యాడ్ లైఫ్ ఆయుర్వేదిక్ ట్రీట్‌మెంట్ సెంటర్ మేనేజర్ ఆదిత్యా కిరణ్ సలహా ఇస్తున్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే యోగా, వ్యాయామం వంటివి తప్పనిసరి అని గుర్తెరగాలని, కంటినిండా నిద్ర పోవడం చాలా ముఖ్యమని కూడా కిరణ్ వివరిస్తున్నారు. రాత్రిళ్లు ఎక్కువ సమయం మేలుకోవడంతో జీవక్రియలు దెబ్బతింటాయి.

50 శాతం పచ్చివే తినండి

రోజూ మీరు తీసుకునే ఆహారంలో 30 శాతం నుంచి 50 శాతం పచ్చి కూరగాయలు, పళ్లు, మొలకలు వంటివి ఉండేలా చూసుకుంటే చాలా మంచిదని నేషన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేచురోపతి డైరెక్టర్ కే సత్యలక్ష్మి సూచిస్తున్నారు. పాలు, మాంసాహారం కూడా లిమిట్‌లో తీసుకుంటే పర్యావరణానికి కూడా హాని కలగదని, తద్వారా మన తరువాతి తరాలు కూడా పచ్చగా ఉంటారని సత్యలక్ష్మి చెబుతున్నారు. ప్రాసెస్డ్ ఫుడ్, జంక్ ఫుడ్, ఇన్‌స్టంట్ ఫుడ్ వంటివాటి జోలికి పోకపోతే కొత్త రోగాలకు చెక్ పెట్టినట్టేనని ఆమె సలహా ఇస్తున్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి ప్రధాన అస్త్రం ప్రకృతి ఆహారమేనని మనం ప్రకృతి బాట పట్టడమే మిగిలిన ఏకైక మార్గమని నిపుణులంతా మానవాళిని హెచ్చరిస్తున్నారు.



దశ తిరిగింది

(మొదటి పేజీ తరువాయి)

విభజనతో అది ఏపీలోకి వెళ్లి పోయిందన్నారు. ఫలితంగా తెలంగాణకు మహిళా విశ్వవిద్యాలయం లేకుండా పోయిందని, అందులో భాగంగానే కేంద్ర మానవ వనరుల మంత్రి ప్రకాశ్ జావడేకర్‌ను కలిసి మహిళా విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరినట్టు చెప్పారు. ఉమెన్స్ కాలేజీని విశ్వవిద్యాలయంగా మార్చేందుకు అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు. సీఎం కేసీఆర్ అనుమతితో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. మహానగరం నడిబొడ్డున 40 ఎకరాల్లో ఉమెన్స్ కాలేజీ ఉందని, భవనాలు సైతం యూనివర్సిటీ పాలనకు అనుకూలంగా ఉన్నాయని వివరించారు. ఈ మేరకు నెల రోజుల్లో ఉమెన్స్ కాలేజీని విశ్వవిద్యాలయంగా మార్చేందుకు ఉన్న వసతులపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ఉమెన్స్ కాలేజీల్లో 42 యూజీ, పీజీ కోర్సులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఒక్క పరిశోధన విభాగం మాత్రమే లేదని, విశ్వవిద్యాలయంగా మారితే.. అదీ కూడా ప్రారంభమవుతుందని చెప్పారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవాల సందర్భంగా ఓయూకు సీఎం కేసీఆర్ రూ.200 కోట్లు కేటాయించారని, దీనికి అనుబంధంగా ఉన్న కోఠి ఉమెన్స్ కాలేజీకి రూ.37 కోట్లు కేటాయించారని తెలిపారు. ఈ నిధులతో ఆయా భవనాల మరమ్మతులు కొనసాగుతున్నాయన్నారు. తనిఖీల్లో ఆయన వెంట ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ రామచంద్రం, రిజిస్ట్రార్ గోపాల్‌రెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ ప్రశాంత్ ఆత్మ, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

హవాలా రాకెట్ గుట్టురట్టు

(మొదటి పేజీ తరువాయి)

సహా ఉంటున్నాడు. అంతకుముందు అతడికి గౌలిగూడ చమన్‌లో గాజుల వ్యాపారం ఉండేది. అందులో నష్టాలు రావడంతో మానేశాడు. ఆ సమయంలో దేశవ్యాప్తంగా పలువురు హవాలా వ్యాపారులతో అతడికి పరిచయాలు ఏర్పడ్డాయి. ఢిల్లీకి చెందిన కమల్, విక్రమ్‌లతో పాటు ముంబైకి చెందిన శంకర్ కూడా పరిచయమయ్యారు. అప్పటినుంచి హవాలా వ్యాపారం లాభదాయకంగా ఉందని.. గౌలిగూడ అశోక్‌బజార్, కోఠిలోని గుజరాతీ గల్లీలలో కొంతమంది మనుషులను పెట్టుకుని ఆ వ్యాపారం మొదలుపెట్టాడు. అప్పటినుంచి కమీషన్లు తీసుకుంటూ డబ్బులు ఇవ్వసాగాడు. బల్వంత్ సింగ్.. పలు నగరాల్లోని హవాలా వ్యాపారులతో పరిచయాలు పెంచుకుని 50, 100 రూపాయల సీరియల్ నంబర్లను వాట్సాప్‌లో పంపుతూ వ్యాపారం కొనసాగించాడు.

పట్టుకున్నది ఇలా...

హవాలా వ్యాపారం గురించి పోలీసులకు విశ్వసనీయ సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు కొన్నాళ్లుగా నిఘా పెట్టి గురువారం ఒక్కసారిగా దాడి చేశారు. హవాలా కలెక్షన్ ఏజెంట్లను గుర్తించి గుజరాతీ గల్లీలోని కృష్ణా మొబైల్స్ షాపుపై దాడి చేశారు. అక్కడ డి. మధుసూదన్ ప్రసాద్, కిశోర్‌కుమార్, సోహన్‌లాల్ అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ. 27.90 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఆ డబ్బును తాను ఢిల్లీ పంపడానికి సిద్ధంగా ఉంచుకున్నట్లు మధుసూదన్ విచారణలో వెల్లడించాడు. అతడు తరచు బల్వంత్ సింగ్ ద్వారా భారీ మొత్తాలను హవాలా పద్ధతిలో వివిధ నగరాలకు పంపేవాడు. అందుకు బల్వంత్‌కు ఉన్న పరిచయాలు ఉపయోగపడేవి. ఈ డబ్బుతోపాటు.. కరెన్సీ కౌంటింగ్ మిషన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు.

అవినీతి కట్టడిలో వెనక్కి!

(మొదటి పేజీ తరువాయి)

అధికారులపై దాడులు, ఆఖరికి హత్యల వరకూ వెళ్తున్నాయి. అవినీతి అక్రమాల నియంత్రణ, పత్రికా స్వేచ్ఛ విషయంలో భారత్ 2016తో పోలిస్తే 2017లో రెండు స్థానాలు దిగజారింది. ప్రపంచ వ్యాప్తంగా 180 దేశాల్లో ప్రభుత్వ రంగంలో అవినీతి నియంత్రణపై 2017కు సంబంధించి ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ వెల్లడించిన నివేదికలోని విషయాలివి. గడిచిన ఆరేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా అవినీతిపై సర్వే చేస్తున్న ఈ సంస్థ ఆయా దేశాలకు 0 నుంచి 100 వరకు మార్కుల వరకు కేటాయించింది. తక్కువ మార్కులు వచ్చిన దేశం అత్యంత అవినీతిమయం (ర్యాంకు 180) అని, టాప్ మార్కులు వచ్చిన దేశం స్వచ్ఛమైనది (ర్యాంకు-1)గా పేర్కొంది. ఈ మేరకు అవినీతి నియంత్రణలో మెరుగుగా పనిచేస్తూ 'స్వచ్ఛ'మైన దేశాల్లో న్యూజిలాండ్ తొలిస్థానంలో ఉందని వెల్లడించింది. ఈ దేశం 89 మార్కులతో మొదటి ర్యాంకు సాధించింది. ఆ తర్వాతి స్థానాల్లో డెన్మార్క్, ఫిన్లాండ్, నార్వే, స్విట్జర్లాండ్, సింగపూర్, స్వీడెన్, కెనడా, లక్జెంబర్గ్, నెథర్లాండ్స్, యూకే ఉన్నాయి. అవినీతిలో సోమాలియా టాప్‌లో నిలిచింది. కేవలం 9 మార్కులతో అక్రమాల నియంత్రణలో అట్టడుగున 180వ ర్యాంకును సొంతం చేసుకుంది. దక్షిణ సూడాన్, సిరియా, ఆఫ్ఘనిస్థాన్‌లు దీని కంటే కొంచెం మెరుగ్గా ఉన్నాయి. ఇక అవినీతి నియంత్రణలో భారత్ రెండు స్థానాలు దిగజారి 81 స్థానానికి పడిపోయింది. 2016లో 176 దేశాలకు గాను అవినీతి కట్టడిలో భారత్ 79వ స్థానంలో ఉండేది. అయితే ఈ రెండు సంవత్సరాల్లో మన స్కోరులో (40) ఏ మాత్రం మార్పు లేదు. ఈ విషయంలో చైనా మన కన్నా మెరుగ్గానే ఉంది. ముందటేడాది కన్నా ఒక మార్కును పెంచుకుని 77వ ర్యాంకును పొందింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో పోల్చుకుంటే అవినీతి నియంత్రణలో భారత్ ముందంజలో ఉంది. పాక్ 32 మార్కులతో 117వ స్థానంలో, బంగ్లా 28 మార్కులతో 143వ ర్యాంకులో ఉన్నాయి. మరోవైపు అవినీతి జరుగుతున్న దేశాల్లో దాన్ని ప్రశ్నించే సంస్థలకు రక్షణ కూడా కరువైంది. జర్నలిస్టులు, ఎన్జీవోలు, ప్రతిపక్ష నాయకులు, న్యాయ, దర్యాప్తు సంస్థల అధికారులపై దాడులు పెరుగుతున్నాయి. అవినితిపరులకు లోబడి ఉండకపోతే చంపడానికీ వెనుకాడడం లేదు. ట్రాన్స్‌పరెన్సీ ఇండెక్స్‌లో మార్కులు 45 అంతకన్నా తక్కువ వచ్చిన దేశాల్లో గత ఆరేళ్లలో కనీసం 9-10 మంది పాత్రికేయుల హత్యలు జరిగాయని నివేదిక వెల్లడించింది. ప్రత్యేకించి ఆసియా ఫసిఫిక్ ప్రాంతానికి వస్తే పత్రికా స్వేచ్ఛ విషయంలో ఫిలిప్పీన్స్, భారత్, మాల్దీవ్స్ అట్టడుగున ఉన్నాయని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ పేర్కొంది. ఈ దేశాల్లో అవినీతిపై ప్రశ్నించే జర్నలిస్టులతో పాటు ఎన్జీవో ప్రతినిధులపైనా దాడులు ఎక్కువగా జరుగుతున్నట్లు వివరించింది.

కార్పొరేటర్లు ఏమైనా దేవుళ్లా?

- **కేసులు పెట్టండి బాంబే హైకోర్టు**

ముంబై, ఫిబ్రవరి 22: రాజకీయ నాయకులు దేవుళ్లు కాదని, చట్టం ముందు అందరూ సమానమేనని ముంబై హైకోర్టు వ్యాఖ్యానించింది. చెట్లు నరికించిన ఇద్దరు స్థానిక మునిసిపల్ కార్పొరేటర్లపై కేసు నమోదు చేయాలని మీరారోడ్ పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ ఎస్సీ ధర్మాధికారి, జస్టిస్ భారతి డోంగ్రేతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. బీజేపీ కార్పొరేటర్ పరుశరామ్ మహత్రే, శివసేన కార్పొరేటర్ అనితా పటేల్ పలు చెట్లు నరికించారని, వారిపై పర్యావరణ పరిరక్షణ చట్టం కింద కేసు నమోదు చేయాలని డీఎస్ మైస్కర్ అనే అడ్వకేట్ ప్రజాహిత వాజ్యం దాఖలు చేశారు. స్థానిక తహసీల్దార్ చెట్లు నరికిన ప్రదేశాన్ని సందర్శించి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని, పోలీసులు ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని మైస్కర్ పిటిషన్‌లో పేర్కొన్నాడు.

నిరసన బాటలో కార్మిక సంఘాలు

(మొదటి పేజీ తరువాయి)

కొట్టుమిట్టాడుతోంది. బొగ్గు గనుల ప్రైవేటీకరణ, బొగ్గు అమ్మకాలను తమ ఇష్టానుసా రంగా ఆయా ప్రయివేటు సంస్థలు అమ్ముకునేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయంతో సింగరేణి కష్టాల కడలిలో కొట్టుమిట్టాడనుంది. కేంద్ర ప్రభుత్వం గనుల తవ్వకాన్ని ప్రైవేటు పరం చేసి వాణిజ్యపరంగా బహిరంగ మార్కెట్లో ఇష్టానుసారం విక్రయించుకోవడానికి వెసులుబాటు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం సింగరేణిపై తీవ్ర ప్రభావం చూపనుంది. దేశంలో ఎక్కడ బొగ్గు ఉత్పత్తి చేసినా దాన్ని ఎక్కడైనా విక్రయించుకునే అవకాశం ఉండటంతో బొగ్గు మార్కెట్లో తీవ్రమైన పోటీ నెలకొనే అవకాశాలున్నాయి. దీంతో ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉన్న సింగరేణి లాంటి సంస్థల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని కార్మిక సంఘాల నేతలు వాపోతున్నారు. సింగరేణితో పాటు కోల్‌ఇండియాలోని కొన్ని సంస్థల భవిష్యత్తు ఆందోళనకరంగా మారే అవకాశం ఉందని నాయకులు పేర్కొంటున్నారు. బొగ్గును బహిరంగ మార్కెట్లో తనకు నచ్చిన ధరకు, ఎక్కడైనా విక్రయించే అవకాశం బొగ్గు గనులను వేలంలో దక్కించుకున్న సంస్థలకు ఉండటంతో ప్రైవేటు సంస్థలు ప్రభుత్వరంగంలోని బొగ్గు పరిశ్రమను దెబ్బతీయడానికి ముందుగా ధరలను తగ్గించే అవకాశం ఉంది. గతంలో సింగరేణి సంస్థనే ఎక్కువగా దక్షిణాది రాష్ట్రాలకు బొగ్గు సరఫరా చేసేది. ఇటీవలి కాలంలో కోల్ ఇండియాతో పాటు విదేశీసంస్థలు బొగ్గును దక్షిణాదికి సరఫరా చేస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని దెబ్బతీసేందుకు ప్రైవేటు రంగ సంస్థలు తక్కువ ధరకే బొగ్గును దేశవ్యాప్తంగా అమ్మితే దాని ప్రభావం సింగరేణిపై పడుతుంది. భూగర్భ గనుల్లో ఒక టన్ను బొగ్గు ఉత్పత్తి చేయడానికి సింగరేణి కాలరీస్ కంపెనీలో రూ. 4000కు పైగా ఖర్చు అవుతోంది. ఉపరితల గనుల్లో సగటున రూ. 1200 నుంచి రూ. 1400 వరకు వ్యయం అవుతోంది. సగటు విక్రయం ధర రూ. 2,500 మాత్రమే ఉండటంతో ఉపరితల గనుల్లో ఉత్పత్తి చేసే బొగ్గు ద్వారా వచ్చే లాభాలతో సింగరేణి మనుగడ సాగిస్తుంది.

కేంద్రం గుప్పిట్లో..

కేంద్రం బొగ్గు ధరల్ని నియంత్రించడంతో ఉత్పత్తి ధర అధికంగా ఉన్నా, ప్రభుత్వ రంగంలోని పరిశ్రమలు తక్కువ ధరకు బొగ్గును విద్యుత్తు కేంద్రాలకు సరఫరా చేస్తున్నాయి. ఇప్పటికీ సింగరేణి విక్రయించే బొగ్గులో 70శాతానికి పైగా తక్కువ ధరకు విద్యుత్తు ఆధారిత పరిశ్రమలకు సరఫరా చేస్తుండగా, మిగతా 30 శాతం ఇతర పరిశ్రమలకు విక్రయించే బొగ్గు ద్వారా వచ్చే ఆదాయంతో, బొటాబొటి లాభాలతో నడుస్తున్నాయి. ఈ లాభాలు కూడా పాక్షిక ప్రైవేటీకరణ వల్లనే సాధ్యం అవుతున్నాయి. 1996 నాటికి దేశంలో దాదాపు ఎనిమిది లక్షల మంది కార్మికులు ఉండగా, ఇప్పుడా సంఖ్య మూడున్నర లక్షలకు పడిపోయింది. శాశ్వత కార్మికుల స్థానంలో పొరుగు సేవల ఉద్యోగులు రంగ ప్రవేశం చేశారు. వారికి కాంట్రాక్ట్ సంస్థలు తక్కువ వేతనాలు చెల్లించి, ఎలాంటి హక్కులు కల్పించకుండా శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయని కార్మిక సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయి. సింగరేణి, కోల్ ఇండియా ఉత్పత్తి చేసే బొగ్గుకు రాయల్టీ, జీఎస్టీ, ఇతర పన్నులు చెల్లిస్తూనే ఉత్పత్తి చేసే ప్రతీ టన్ను బొగ్గుకు రూ. 400 చొప్పున స్వచ్ఛ ఇంధన పన్ను చెల్లిస్తున్నాయి. కార్మికులకు గృహ వసతి, విద్యుత్తు, మంచినీరు, వైద్యం ఉచితంగా అందిస్తున్నాయి. వేతన రక్షణ, ఉద్యోగ భద్రత ఉంది. ప్రైవేటు రంగం వాణిజ్యపరంగా బొగ్గు ఉత్పత్తి మొదలు పెడితే ముందుగా ఉద్యోగులకు అతి తక్కువ వేతనాలిచ్చి, అధునాతన యంత్రాలతో అధికోత్పత్తి చేస్తాయి. మొదటి దశలో కోల్ ఇండియా, తర్వాత సింగరేణిని మార్కెట్ పోటీ నుంచి తప్పించడానికి లాభాలను పూర్తిగా తగ్గించుకుని తక్కువ ధరలకు ప్రయివేటు సంస్థలు బొగ్గును విక్రయించే అవకాశాలున్నాయి. దీంతో భవిష్యత్తులో సింగరేణి ప్రస్తుతం కేంద్రం తీసుకున్న నిర్ణయం పెనుముప్పుగా పరిగణించే అవకాశం ఉందని కార్మికులు వాపోతున్నారు. వేజ్‌బోర్డు వేతనాలుండని దుస్థితి. సంక్షేమం, పర్యావరణం విషయంలో ప్రయివేటు సంస్థలు తూతూ మంత్రంగానే వ్యవహరిస్తాయి. ప్రభుత్వంలోని పెద్దల అండదండలతో నిబంధలను తుంగలో తొక్కి ప్రభుత్వరంగంలోని పరిశ్రమలు మూతపడేలా చేసిన తర్వాత, బొగ్గు ధరలు పెంచి ఆర్థిక సంక్షోభానికి పూనుకుంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేటీకరణ అన్యాయం : ఏఐటీయూసీ

హైదరాబాద్/ హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 22 (మనం న్యూస్): కేంద్ర ప్రభుత్వం జాతీయ సంపదైన బొగ్గు గనులను ప్రైవేటీకరించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్ రావు అన్నారు. గురువారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర పదాధికారుల సమావేశం టి. నరసింహన్ అధ్యతన నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నాకర్ రావు మాట్లాడుతూ.. 45 ఏండ్లుగా లక్షల కోట్ల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చిన బొగ్గు గనులను ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం అన్యాయమన్నారు. విదేశీ, స్వదేశీ, కార్పొరేట్ పెట్టుబడులకు మరిన్ని లాభాలు చేకూర్చే విధంగా కేంద్రం వ్యవహరిస్తుందన్నారు. బొగ్గు గనుల ప్రయివేటీకరణపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్‌పై ఇస్తున్న వడ్డీని 8.65 శాతం నుంచి 8.55కి తగ్గించడాన్ని ఖండిస్తున్నామన్నారు. దీన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ 1995 ముందు విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కాలపరిమితి దాటిన కనీస వేతనాల జీఓలను తక్షణమే రివైజ్ చేసి కనీస వేతనం రూ. 18వేలుగా నిర్ణయించి అమలు చేయాలన్నారు. వివిధ శాఖల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్. బాలరాజ్, కె. గంగాధర్ రావు, సామల మల్లేషం, పి. ప్రేమ్‌పావని, యండి. యూసుఫ్, బి. చంద్రయ్య, విఎస్. బోస్, ఎస్. విలాస్, బి. వెంకటేశం, సింగు నర్సింగారావు, ఎన్. నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నేడు సింగరేణి బోర్డు డైరెక్టర్ల సమావేశం

- **నల్ల సూరీళ్లు సొంతింటి కల నెరవేరేనా..!**
- **కార్మికుల గృహరుణానికి ఆమోదం లభించేనా ?**
- **మెడికల్ బోర్డు పునరుద్ధరణపై కార్మికుల ఆశలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (మనం ప్రతినిధి) : ప్రకృతికి విరుద్ధంగా భూగర్భంలో నిత్యం ప్రమాదాల అంచున పనిచేస్తున్న నల్లసూర్యుళ్ల సొంతింటి కల నెరవెరనుందా...ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మెడికల్ బోర్డు పునరుద్ధరణకు నోచుకోనుందా అని కార్మికులు ఆశగా ఎదురుచూస్తున్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం సింగరేణి కాలరీస్ కంపెనీ మెడికల్ బోర్డు డైరెక్టర్ల సమావేశం జరుగనుంది. బోర్డు సమావేశంపై కార్మికులు గంపెడాశను పెట్టుకున్నారు. కార్మికులకు సొంతింటి కలను నెరవేరుస్తామని సీఎం కేసీఆర్ గుర్తింపుసంఘం ఎన్నికలకు ముందు అనంతరం పేర్కొన్న దాఖలాలున్నాయి. ఈ క్రమంలో జరుగనున్న సింగరేణి బోర్డు డైరెక్టర్ల సమావేశంలో తీసుకునే నిర్ణయంపై కార్మికులు ఎదరు చూస్తున్నారు. గృహ నిర్మాణానికి బ్యాంకు ద్వారా రూ. పది లక్షల రుణాన్ని అందిస్తామని కేసీఆర్ పేర్కొన్నారు. ఇందుకు సంబందించి వడ్డీని యాజమాన్యమే భరించేలా సీఎం అభయమిచ్చిన దాఖలాలున్నాయి. వడ్డీనే దాదాపుగా రూ. 6 నుంచి 8 లక్షల వరకు ఉండే అవకాశం ఉంది. ఈ మొత్తాని యాజమాన్యమే భరించి కార్మికులకు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన రూ. 10లక్షలను బ్యాంకుల ద్వారా ఇప్పించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని గతంలో సీఎం సూచించారు. సొంతింటి కల కార్మికుల్లో ఎన్నాళ్లుగానో ఉంది. శుక్రవారం జరుగనున్న బోర్డు డైరెక్టర్ల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంటారో లేదో అనే కార్మికులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అనారోగ్యంతో బాధపడ్తూ విధులు నిర్వహించలేని కార్మికులు మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నారు. దాదాపు 3 వేల మందికి పైగా వివిధ అనారోగ్యాలతో మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్నా ఏడాదికి వారి దరఖాస్తులను పట్టించుకున్న దాఖలాలు లేవు. అటు విధులు నిర్వహించలేక, ఇటు వారసులకు ఉద్యోగాలు రాక కార్మికులు జీవచ్ఛవాలుగా జీవిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి కనీసం ఫిట్, అన్‌ఫిట్ కూడా చెప్పటం లేదని కార్మికులు వాపోతున్నారు. మెడికల్ బోర్డును పునరుద్దరించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. సింగరేణిలో జరిగిన గుర్తింపుసంఘం ఎన్నికల్లో టీఆర్ఎస్ అనుబంధ సంఘమైన టీబీజీకేఎస్‌ను కార్మికులు గెలిపిస్తే కారుణ్య నియామకాల పేర వారసత్వ ఉద్యోగాలు ఇస్తామని సీఎం పేర్కొన్నారు. నెలలు గడుస్తున్నా ఈవిషయమై ఇప్పటి వరకు సరైన నిర్ణయం రాలేదు. కార్మికులకు ఎదురు చూపులే మిగిలాయి. సింగరేణిలో పేర్ల మార్పు విషయంలో వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించినా దానిపై ఇంత వరకు యాజమాన్యం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. బోర్డు డైరెక్టర్ల సమావేశంలో తీసుకునే నిర్ణయం కోసం కార్మికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

నిరసనలకు సిద్ధం.. : మిర్యాల రంగయ్య

వాణిజ్య ప్రాతిపదికన బొగ్గు ఉత్పత్తి చేయడానికి కేంద్రం ఆమోదం తెలుపడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా కలిసివచ్చే సంఘాలతో ఆందోళనలు చేపడతామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య మనం ప్రతినిధికి తెలిపారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల 23న సింగరేణిలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపనున్నట్టు తెలిపారు. మోడీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు సంపదను దోచిపెట్టే కుట్రను తిప్పికొట్టాల్సిన అవసరం ఉంది. కోల్ ఇండియా, సింగరేణి సంస్థలకు కొత్త గనుల తవ్వకానికి అనుమతులు ఇవ్వకుండా బొగ్గు ఉత్పత్తి ఆశించిన మేరకు లేదని చెప్పడం అన్యాయమన్నారు. దేశవ్యాప్తంగా, సింగరేణిలో నిరసనలను తెలుపనున్నట్టు సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహరావ్ తెలిపారు.

రైతు సమన్వయ సమితి కార్పొరేషన్

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయించారు. వ్యవసాయాభివృద్ధి- రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను క్షేత్రస్థాయికి తీసుకుపోవడంలో ఈ కార్పొరేషన్ కృషి చేస్తుందని ప్రకటించారు. లాభాపేక్ష లేని సంస్థ (నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్)వలె ఈ కార్పొరేషన్ పనిచేస్తుందని, ఈ సంస్థకు సమకూరిన నిధులను ఈ సంస్థ ఏర్పాటు చేసిన లక్ష్యాల సాధన కోసమే వినియోగిస్తారని స్పష్టం చేశారు. గ్రామ, మండల రైతు సమన్వయ సమితుల మాదిరిగానే త్వరలోనే జిల్లా, రాష్ట్రస్థాయి రైతు సమన్వయ సమితులు ఏర్పాటవుతాయని వెల్లడించారు. రైతు సమన్వయ సమితుల నిర్మాణం, విధులు, బాధ్యతలను నిర్ణయించడంతో పాటు, ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించే ప్రాంతీయ సదస్సులపై గురువారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనం వేసిన దగ్గర నుంచి పంటకు మద్దతు ధర వచ్చే వరకు ప్రతీ దశలోనూ రైతు సమన్వయ సమితులు చురుకైన పాత్ర పోషించేలా వారికి విధులు, బాధ్యతలుం టాయని స్పష్టం చేశారు. రైతు సమన్వయ సమితుల్లో కనీసం 51 శాతం మంది బలహీన వర్గాలు, మహిళలు ఉండేలా నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ఈ నెల 25, 26 తేదీల్లో సదస్సుల్లో మండల రైతు సమన్వయ సమితి సభ్యులతో పాటు ఆయా జిల్లాలకు చెందిన మంత్రు లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు హాజరు కావాలని సీం సూచిం చారు. రైతులు పరస్పరం



తమ అభిప్రా యాలు పంచుకోవడం కోసం, నిరంతర అవగాహన సదస్సులు నిర్వహించడం కోసం ప్రతీ ఐదు వేల ఎకరాలకు ఒకటి చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 2,630 రైతు వేదికలు నిర్మించనున్నట్లు సీఎం తెలిపారు. ఈ రైతు వేదికలను వీలైనంత త్వరగా నిర్మించాలని అధికారులను ఆదేశించారు. రైతు వేదికల నిర్వహణ బాధ్యతలను మండల రైతు సమన్వయ సమితులు తీసుకోవాలని కోరారు. రైతు వేదికల నిర్మాణం కోసం అవసరమైన స్థలాలను ఎంపిక చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ భూముల నుంచి గానీ, దాతల నుంచి గానీ, కొనుగోలు ద్వారా గానీ రైతు వేదికల కోసం స్థలం సేకరించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు పోచారం శ్రీనివాస రెడ్డి, ఈటల రాజెందర్, ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మిషన్ భగీరథ వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీలు బి.వినోద్ కుమార్, గుత్తా సుఖేందర్ రెడ్డి, బాల్క సుమన్, అడ్వకేట్ జనరల్ ప్రకాశ్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్యకార్యదర్శులు ఎస్.నర్సింగ్ రావు, వ్యవసాయ శాఖ కమిషనర్ జగన్‌మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

రైళ్లన్నీ ఇక పేపర్‌లెస్!

(మొదటి పేజీ తరువాయి)


ఇలా దేశవ్యాప్తంగా రైలుబోగీలపై రిజర్వేషన్ చార్టులు తీసేయనున్నారు. కాగిత రహిత సమాచార వ్యవస్థను అమలుచేయాలన్న రైల్వే బోర్డు నిర్ణయంలో భాగంగానే ఈ చర్య తీసుకుంటున్నారు. తమ రిజర్వేషన్ పరిస్థితి ఏంటో.. కేటాయించిన బెర్త్ నంబరు ఎంతో తెలుసుకోవాలంటే ప్రయాణికులు ఇంతకుముందులా రైలు బోగీల వెంట పరుగులు తీయాల్సిన అవసరం లేదు. స్టేషన్లలో ఉండే టికెట్ చెకింగ్ కియోస్క్ వద్దకు వెళ్లి అక్కడ ఉన్న టచ్‌స్క్రీన్ మానిటర్‌పై పీఎన్ఆర్ నంబరు ఎంటర్ చేస్తే చాలు.. వెంటనే అక్కడ మానిటర్ మీద ప్రయాణికుల వారీగా బోగీ నంబరు, బెర్తు నెంబరు వివరాలన్నీ ప్రత్యక్షమవుతాయి. అంతే కాదు.. టికెట్ కన్ఫర్మ్ కాగానే ప్రయాణికుల సెల్‌ఫోన్‌కు ఎస్ఎంఎస్ కూడా పంపుతున్నందువల్ల చార్టు లేనంత మాత్రాన వారికి ఎలాంటి ఇబ్బంది ఎదురుకాదని అధికారులు చెబుతున్నారు. టికెట్ బుక్ చేయగానే సంబంధిత సెల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ వస్తుంది. టికెట్ వెయిటింగ్ లిస్టులో ఉంటే అది ఖరారు కాగానే మరో ఎస్ఎంఎస్ వస్తుంది.

ఇంకా రాని డిజిటల్ డిస్‌ప్లే బోర్డులు

చార్టుల స్థానంలో రిజర్వేషన్ వివరాలను తెలియజేసే డిజిట ల్ డిస్‌ప్లే బోర్డులు విశాఖ డివిజన్‌లో ఇంకా ఏర్పాటు కాలేదు. ఇవి త్వరలోనే రానున్నాయని విశాఖ డివిజినల్ రైల్వే మేనేజర్ ఎంఎస్ మాథుర్ చెప్పారు. రైళ్లలో విధులు నిర్వర్తించే టీటీఇల వద్ద కూడా డిజిటల్ సమాచార పరికరాలు అందుబాటులో ఉండటంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఉండవన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు.

పది లక్షల పేపర్లు ఆదా..

ఈ కొత్త విధానం అమలులోకి వస్తే ఒక్క విశాఖ డివిజన్‌లోనే ఏటా 3.75 టన్నుల బరువైన 10.5 లక్షల పేపర్లు ఆదా అవుతాయి. ప్రతిరోజూ బోగిల మీద కాగితాలకు మైదాపూసి వాటిని అతికించడం ప్రయాసతో కూడుకొన్న పని. ఇక ఈ వ్యవస్థ కనుమరుగైపోనుంది. వర్షాకాలంలో ఈ చార్టులు తడిసిపోవడం వల్ల పలు ఇబ్బందుల తలెత్తేవి. ఇక కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో వివరాలు డిస్‌ప్లే కానున్నాయి. ఒకవేళ ఏమైనా ఇబ్బంది ఎదురైనా, 139 హెల్ప్‌లైన్ నెంబర్ ద్వారా రిజర్వేషన్ వివరాలు తెలుసుకొనే అవకాశం ఎల్లవేళలా అందుబాటులోనే ఉండటంతో సమస్యలు తలెత్తవని అధికారులు భావిస్తున్నారు.



దీర్ఘకాలిక పరిష్కారం కావాలి

- **అమెరికాలో పెచ్చరిల్లుతున్న హింసపై ట్రంప్**
- **ఫ్లోరిడా స్కూలు బాధితులు, తల్లిదండ్రులతో భేటీ**




వాషింగ్టన్, ఫిబ్రవరి 22: అమెరికాలో పెరిగిపోతున్న హింసకు దీర్ఘకాలిక పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని ఆదేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా నిపుణులు, ఉన్నతాధికారులు పరిష్కారమార్గాలు చూపాలని కోరారు. ఇటీవల ఫ్లోరిడా పాఠశాలలో జరిగిన కాల్పుల ఘటన నుంచి ప్రాణాలతో బయటపడిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ట్రంప్ సమావేశమయ్యారు. తుపాకుల యజమానులకు నిబంధనలు మరింత కఠినతరం చేస్తామని, తుపాకుల జారీకి పక్కాగా నిబంధనలను అమలుచేస్తామని ట్రంప్ హామీ ఇచ్చారు. వారి మానసిక పరిస్థితిని కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు. పాఠశాలల్లో తరచూ ఇలాంటి కాల్పులు జరగకుండా ట్రంప్‌కు ఓ వ్యక్తి సూచన ఇచ్చారు. స్కూల్లో టీచర్ల వద్ద కూడా తుపాకులు ఉండాలని ఆయన సూచించారు. కొందరు ఉపాధ్యాయులకు తుపాకుల వినియోగంలో మంచి శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. అయితే అది రహస్యంగా ఉండాలని చెప్పారు. ఈ ఆలోచన బాగుందన్న ట్రంప్.. కొందరు ఉపాధ్యాయులకు తగిన శిక్షణ ఇచ్చి వారి దగ్గర రహస్యంగా తుపాకులు ఉంచితే.. పరిస్థితిలో కొంత మేర మార్పు వస్తుందని అభిప్రాయపడ్డారు.

తుపాకీ పెట్టి బెదిరించి
బిట్‌కాయిన్ చోరీ

- తైవాన్‌లో నలుగురి అరెస్ట్

తైపీ, ఫిబ్రవరి 22: జేబులో డబ్బులుంటే దొంగలు కొట్టేస్తారని భయపడతాం! కానీ కంటికి కనిపించని ఆన్‌లైన్ కరెన్సీనీ వదలడం లేదు కేటుగాళ్లు. ఇటీవల సంచలనంగా మారిన క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ చోరీకి పాల్పడిన తొలి ఘటన వెలుగులోకి వచ్చింది. తుపాకీ పెట్టి బెదిరించి మరీ క్రిప్టో కరెన్సీని నలుగురు దుండగులు తమకు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. ఈ సంఘటన తైవాన్‌లో ఈ నెల మొదట్లో జరిగింది. ఈ దాడికి పాల్పడిన దుండగులను బుధవారం ఆ దేశ పోలీసులు అరెస్టు చేశారు. ఇక్కడి తైచుంగ్ నగరంలో తై అనే బిట్‌కాయిన్ ట్రేడర్ వద్ద బిట్‌కాయిన్లు కొనుగోలు చేస్తామని నమ్మించి.. వాటికి సంబంధించిన ఆధారాలు చూపాలని నలుగురు వ్యక్తులు కోరారు. తాము ఉండే చోటుకి అతడిని పిలిపించుకుని పూటుగా మద్యం తాగించారు. అతడి ఫోన్‌లో ఉన్న బిట్‌కాయిన్ ఖాతాకు సంబంధించిన వివరాలను తీసుకునేందుకు గొడవకు దిగారు. తుపాకీ గురిపెట్టి.. 50 లక్షల తైవవానీస్ డాలర్ల (సుమారు రూ.1.10 కోట్లు) విలువచేసే బిట్‌కాయిన్లను ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో తక్షణం అక్కడి చేరుకోగా తై తీవ్ర గాయాలతో కిందపడి ఉన్నాడు. దీనిపై దర్యాప్తు మొదలు పెట్టిన పోలీసులు నలుగురు నిందితులనూ అరెస్టు చేశారు. ఈ తరహాలో క్రిప్టో కరెన్సీ చోరీ కేసు ఇదే మొదటిదని అక్కడి అధికారులు తెలిపారు.

భారీ డీల్.. రూ. 240 కోట్లతో ఫ్లాట్లు



ఒక్కో అంతస్థులో ఒక్కో ఫ్లాట్.. విస్తీర్ణం 4500 చదరపు అడుగులు

- **28 కార్ల పార్కింగుకు అవకాశం**
- **తాపడియా కుటుంబం రికార్డు**

ముంబై, ఫిబ్రవరి 22: ముంబై నగర చరిత్రలోనే ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత భారీ రియల్ ఎస్టేట్ డీల్ ఒకటి కుదిరింది. ఒక వ్యాపారవేత్తకు చెందిన కుటుంబం ఒకేసారి ఒక అపార్టుమెంటులోని నాలుగు ఫ్లాట్లను కొనుగోలు చేసింది. ఫ్లాట్ అంటే అది అల్లాటప్పా కాదు.. ఒక ఫ్లోర్ మొత్తం ఒకటే ఫ్లాట్ ఉంటుంది. ఒక్కో ఫ్లాట్ విస్తీర్ణం 4500 చదరపు అడుగులు. చదరపు అడుగుకు రూ. 1.20 లక్షల చొప్పున ఆ నాలుగు ఫ్లాట్లు కలిపి రూ. 240 కోట్లకు వాళ్లు కొనుగోలు చేశారు. ఇందులో 28 కార్లకు పార్కింగ్ స్లాట్లు కూడా ఉన్నాయి. తాపడియా కుటుంబం ఈ డీల్ కుదుర్చుకుందని తెలుస్తోంది. 'ద రెసిడెన్స్' అనే లగ్జరీ టవర్‌లో 28వ అంతస్థు నుంచి 31వ అంతస్థు వరకు వీళ్లు తీసుకున్నారు. అందులో మొత్తం 35 అంతస్థులున్నాయి. 1918లో తొలిసారిగా ఇక్కడ ఒక రెండు అంతస్థుల బంగ్లా కట్టారు. దాన్ని 2011లో రన్వాల్ గ్రూపు రూ. 350 కోట్లకు కొనుగోలు చేసింది. వాస్తవానికి భవన యజమానులు రూ. 270 కోట్లకే ఇచ్చేయడానికి అంగీకరించారు గానీ.. అందులో ఉంటున్నవాళ్లు దాన్ని ఖాళీ చేయడానికి రూ. 80 కోట్లు తీసుకున్నారు. ముంబైలోనే అత్యధికంగా ఆదాయపన్ను చెల్లించేవారిలో ఒకరైన తాపడియాలకు గతంలో 'ఫామీకేర్' అనే కండోమ్‌ల తయారీ కంపెనీ ఉండేది. దాన్ని వాళ్ల మూడేళ్ల క్రితం రూ. 4600 కోట్లకు అమ్మేశారు. రెండేళ్ల క్రితం బాంద్రా కుర్లా కాంప్లెక్సులోని ఒక నివాస ప్రాజెక్టులో తాపడియా కుటుంబం 11వేల చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన డూప్లెక్స్ అపార్టుమెంటును రూ. 60 కోట్లకు కొనుగోలు చేసింది. ముంబైలో ఇంతకు ముందు జరిగిన అతిపెద్ద డీల్.. 2015నాటిది. ఆల్టామోంట్ రోడ్డులోని లోధా ఆల్టామౌంట్ డూప్లెక్స్ భవనాన్ని రూ. 160 కోట్లకు అమ్మారు. దాన్ని జిందాల్ డ్రగ్స్ కంపెనీ యజమానులైన జిందాల్ కుటుంబం వాళ్లు కొనుగోలు చేశారు. 2015 సెప్టెంబరులో పారిశ్రామికవేత్త సైరస్ పూనావాలా బ్రీచ్‌కాండీలోని ఒక స్థలాన్ని రూ. 750 కోట్లకు కొనుగోలుచేశారు. ఒక ప్రైవేటు నివాసం కోసం ఇప్పటివరకు దేశంలో జరిగిన అత్యంత పెద్ద డీల్ అదే.

అసెంబ్లీలో గోవా ముఖ్యమంత్రి

- బడ్జెట్‌ను ప్రవేశ పెట్టిన పర్రీకర్
- ఆస్పత్రి నుంచి క్షేమంగా ఇంటికి..
- ఆపై అసెంబ్లీకి చేరుకున్న సీఎం



అసెంబ్లీ ఆవరణలో పర్రీకర్

పణజి, ఫిబ్రవరి 22: కొద్దిరోజులుగా అనారోగ్యంతో చికిత్స తీసుకుంటున్న గోవా ముఖ్యమంత్రి మనోహర్ పర్రీకర్ గురువారం శాసన సభకు హాజరై, బడ్జెట్ ప్రవేశ పెట్టారు. అసెంబ్లీలో సీఎం పర్రీకర్ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. దానికి కొన్ని గంటల ముందే ఆయన ముంబైలోని లీలావతి ఆస్పత్రి నుంచి డిశ్చార్చి కావడం గమనార్హం. ఆస్పత్రి నుంచి క్షేమంగా గోవాలోని తన ఇంటికి చేరుకున్న పర్రీకర్ కొంత విశ్రాంతి తీసుకున్న తర్వాత అసెంబ్లీకి హాజరయ్యారు. ఆపై సభలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. తన అనారోగ్యానికి సంబంధించి రకరకాల వార్తలు ప్రచారంలో ఉన్న నేపథ్యంలో సీఎం పర్రీకర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కాగా, సీఎం మనోహర్ పర్రీకర్ ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకున్నారని గోవా డిప్యూటీ స్పీకర్ మైఖెల్ లాబో మీడియాకు వెల్లడించారు. ఈ నెల 15 నుంచి పర్రీకర్ కాలేయ సంబంధిత సమస్యకు లీలావతి ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే! ఆయన ఆరోగ్యంపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం జరిగింది. ఈ వార్తల నేపథ్యంలో అసలు పర్రీకర్‌కు ఏమైందంటూ పెద్ద స్థాయిలో చర్చ జరిగింది. తాజాగా గోవా సీఎం ఆస్పత్రి నుంచి ఇంటికి, ఆపై అసెంబ్లీకి చేరుకోవడం.. బడ్జెట్ ప్రవేశపెట్టే విషయంపై నెలకొన్న సందేహాలను తొలగించడంతో రాజకీయ వర్గాల్లో స్పష్టత వచ్చింది. మరోవైపు, పర్రీకర్‌కున్న పట్టుదలతో పాటు సామర్థ్యమే ఆయనను కోలుకునేలా చేసిందనిమైఖెల్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ 'ట్విటర్'పై బిగ్ బీ ఆసక్తి!

- **ఆ పార్టీ నేతలను ఫాలో చేస్తున్న అమితాబ్**
- **సోషల్ మీడియాలో జోరందుకున్న ఊహాగానాలు**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్ బచ్చన్ కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారా? ప్రస్తుతం బీజేపీకి సన్నిహితంగా ఉన్న బిగ్ బీ రానున్న రోజుల్లో జెండా మార్చేస్తారా? ఇటీవల ఆయన ట్విటర్‌ను సునిశ్చితంగా గమనిస్తున్న రాజకీయ విశ్లేషకుల్లో ఈ తరహా చర్చే జరుగుతోంది. ఆయన అకస్మాత్తుగా కాంగ్రెస్ నాయకుల ట్విటర్ ఖాతాలను ఎక్కువ సంఖ్యలో ఫాలో చేస్తుండడమే ఇందుకు కారణం. రాజీవ్‌గాంధీ హయాంలో అమితాబ్ కాంగ్రెస్ పార్టీలో కొనసాగినప్పటికీ ఆ తర్వాత కొన్ని చేదు అనుభవాలతో ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. రాజకీయ వ్యాఖ్యలకు కూడా ఆయన దూరం పాటిస్తూ వచ్చారు. ప్రస్తుతం బీజేపీ నేతలకు కొంత సన్నిహితంగా ఉంటూ గుజరాత్ రాష్ట్ర బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ఆయన అకస్మాత్తుగా కాంగ్రెస్ పార్టీపై ఆసక్తి కనబరుస్తుండటంతో సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారితీసింది. మొదట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని ఫాలో కావడం మొదలుపెట్టిన అమితాబ్ ఈ నెలలో కాంగ్రెస్ పార్టీ అఫిషియల్ ఖాతాతోపాటు ఆ పార్టీ సీనియర్ నేతలు చిదంబరం, కపిల్ సిబల్, అహ్మద్ పటేల్, అశోక్ గెహ్లాట్, అజయ్ మాకెన్, జ్యోతిరాదిత్య సింధియా, సచిన్ పైలట్, సీపీ జోషి తదితరులను వరుసగా ఫాలో చేస్తున్నారు. వీరే కాదు కాంగ్రెస్ నేతలు మనీష్ తివారీ, షకీల్ అహ్మద్, సంజయ్ నిరుపమ్, రణ్‌దీప్ సుర్జేవాలా, ప్రియాంక చతుర్వేది, సంజయ్ ఝాలను కూడా ఆయన ఫాలో అవుతున్నారు. ఆయన మొత్తంగా 1689మంది ఫాలో అవుతుండగా.. ఇటీవల ఫాలో అవుతున్న వారిలో కాంగ్రెస్ నేతలే అధికంగా ఉండటం గమనార్హం. దీంతో ఆ పార్టీకి ఆయన దగ్గరవుతున్నారా అనే కోణంలో చర్చకు దారితీసింది. దీనివెనుక ఆంతర్యం ఏదైనా ఉందా? లేదా కాకతాళీయంగానే వారిని ఫాలో అవుతూ రాజకీయ పరిణామాలను గమనిస్తున్నారా అనేది తెలియాల్సి ఉంది.

300 అడుగుల లోయలో పడ్డ బస్సు

- **44 మంది మృతి, 24 మందికి గాయాలు**
- **దక్షిణ అమెరికాలోని పెరూలో దుర్ఘటన**



పెరూ, ఫిబ్రవరి 22: దక్షిణ అమెరికాలోని పెరూలో ఘోరం జరిగింది. దాదాపు 70 మంది ప్రయాణీకులతో ప్రయాణిస్తున్న ఓ బస్సు 300 అడుగుల లోతు లోయలో బోల్తా పడింది. పాన్ అమెరికా జాతీయ రహదారిలో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో 44 మంది అక్కడికక్కడే మరణించగా, 24 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారు. గాయపడిన వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. ప్రమాదం గురించి తెలుసుకున్న సహాయక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం దాటికి కొన్ని మృతదేహాలు లోయను ఆనుకొని ఉన్న నదిలో పడ్డాయి. వాటిని బయటకు తీసేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. గత నెల (జనవరి -2న) సెంట్రల్ కోస్టల్ ఏరియాలో జరిగిన బస్సు ప్రమాదంలో సుమారు 52 మంది ప్రాణాలు విడిచారని అక్కడి అధికారులు చెప్పారు.

నీరవ్ మోదీ కేసులో..
94 కోట్ల ఫండ్స్, షేర్లు స్తంభన

ఖరీదైన 9 కార్లు సీజ్ చేసిన ఈడీ



ముంబై, ఫిబ్రవరి 22: పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఓ అడుగు ముందుకేసింది. వజ్ర వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన వ్యాపార భాగస్వామి మెహుల్ ఛోక్సీ గ్రూపులకు చెందిన రూ.94.52 కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్స్, షేర్లను స్తంభింజేసినట్టు ఈడీ గురువారం వెల్లడించింది. అంతేగాకుండా నీరవ్ మోదీకి చెందిన 9 లగ్జరీ కార్లనూ సీజ్ చేసినట్టు తెలిపింది. మనీ లాండరింగ్ నివారణ చట్టం కింద ఆయనపై ఇప్పటికే కేసులు పెట్టిన ఈడీ తాజాగా ఈ చర్యలు తీసుకుంది. ఫ్రీజ్ చేసిన మ్యూచువల్ ఫండ్లు, షేర్లలో రూ.86.72 కోట్ల విలువైన ఫండ్లు, షేర్లు ఛోక్సీవేనని ఈడీ అధికారి ఒకరు చెప్పారు. కాగా, ఈడీ సీజ్ చేసిన నీరవ్ మోదీ కార్లలో.. రోల్స్ రాయ్స్ ఘోస్ట్, రెండు మెర్సిడిస్ బెంజ్ కార్లు, పోర్షె పనమెరా, మూడు హోండా కార్లు, టయోట ఫార్చ్యూనర్, ఇన్నోవా కార్లు ఉన్నాయి.

'పాస్‌వర్డ్' ఇక కొందరికే.. పీఎన్‌బీ కీలక నిర్ణయం

పీఎన్‌బీ కుంభకోణంలో బ్యాంక్ ఉద్యోగులు కొందరు నీరవ్ మోడీతో కుమ్మక్కు అయ్యి.. ఏకంగా బ్యాంక్ అకౌంట్ డీటెయిల్స్ (లాగిన్- స్విఫ్ట్)పాటు పాస్‌వర్డ్ కూడా చెప్పారని సీబీఐ విచారణలో వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. దాంతో నీరవ్ మోదీ దోపిడీ ఇష్టానుసారం కొనసాగింది. ఈ వ్యవహారంలో మాజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ గోకుల్‌నాథ్ శెట్టి, సింగిల్ విండో క్లర్క్ మనోజ్ కరత్ ప్రధాన నిందితులుగా ఉన్నారు. నీరవ్ ఇచ్చే కమీషన్ కోసం కక్కుర్తి పడి.. ఏకంగా బ్యాంక్ లాగిన్ ఐడీ, పాస్ వర్డ్ ఇచ్చేశారు. బ్యాంక్ అకౌంట్లకు మోడీ సిబ్బంది నేరుగా ఎంటర్ అయ్యి.. వారి ఫైల్స్‌ను వాళ్లే క్లియర్ చేసుకున్నట్లు ఒప్పుకున్నారు. 2017లో 63 రోజుల్లోనే 143 శాతం(లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్) జారీ చేశారు. దీంతో లక్షల డాలర్ల సొమ్మును.. వీరు వివిధ అంతర్జాతీయ బ్యాంకుల నుంచి తీసుకున్నారు. వీటి విలువ అక్షరాల రూ.9,500 కోట్లు. వాస్తవంగా ఎల్‌ఓయూ గడువు 90 రోజులు. ఈ గోకుల్ శెట్టి మాత్రం 365 రోజులకు ఇచ్చేశాడు. ఈ నేపథ్యంలో పాస్‌వర్డ్ విషయలో పీఎన్‌బీ యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పీఎన్‌బీ ఉన్నతాధికారులకు మాత్రమే ఈ రకమైన స్విఫ్ట్ మెస్సేజ్ (ట్రాన్సాక్షన్ మెస్సేజ్)లు దాఖలు చేసే అధికారం కల్పించారు. ఇకపై క్లర్కులకు ఈ అధికారం ఉండదు. ఒక మెస్సేజ్‌ను రూపొందిస్తే దానిని ముగ్గురు పై అధికారులు ధ్రువీకరిస్తేనే అది అమలులోకి వస్తుంది. ఈ పద్ధతి గురువారం నుంచే అమలులోకి వచ్చిందని పీఎన్‌బీ ఉన్నతాధికారులు తెలిపారు.


రుణాలు ఎలా చెల్లిస్తారో చెప్పండి

నీరవ్ మోదీకి పీఎన్‌బీ ప్రశ్న

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: పీఎన్‌బీ అత్యుత్సాహం వల్లే తాను రుణాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని కుంభకోణం సూత్రధారి నీరవ్ మోదీ లేఖ రాసిన నేపథ్యంలో బ్యాంకు యాజమాన్యం కూడా అదే స్థాయిలో స్పందించింది. అసలు మాకు చెల్లించాల్సిన రుణాలను ఏ విధంగా చెల్లిస్తారో ఒక ప్రణాళికను రూపొందించుకుని తమకు ఇవ్వాలని సూచించింది. ఈ ప్రణాళిక ఆషామాషీగా ఉండకూడదని కూడా సూచించింది. ఆ ప్రణాళికలను పక్కాగా అమలు చేయాలని కోరింది. ఎల్‌వోయూలతో తమ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లిందని, తక్షణమే ఆ నష్టాన్ని భర్తీ చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించింది.

కెనడా ప్రధాని డిన్నర్..
ఉగ్రవాదికి ఆహ్వానం

వెల్లువెత్తిన విమర్శలు.. ఆహ్వానం రద్దు





జస్పాల్‌తో ట్రూడో భార్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: కెనెడా ప్రధాని జస్టిన్ ట్రూడో పాల్గొనే విందు కోసం ఖలిస్తానీ ఉగ్రవాదికి ఆహ్వానం అందించటం చర్చనీయాంశంగా మారింది. తీవ్ర విమర్శల నేపథ్యంలో దానిని వెనక్కి తీసుకుంటున్నట్లు అధికారులు ప్రకటించారు. ట్రూడో కోసం ఢిల్లీలోని కెనడా హైకమిషర్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఓ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి ఖలిస్థాన్ ఉద్యమకారుడు జస్పాల్ అత్వాల్‌కు కెనడా రాయబార కార్యాలయం ఆహ్వానం పంపింది. మీడియాలో దీనిపై కథనాలు రావటంతో పంజాబ్ ప్రభుత్వం నుంచి విమర్శలు వెల్లువెత్తగా.. కెనడియన్ ఎంబసీ స్పందించింది. ఆయన ఆహ్వానాన్ని వెనక్కి తీసుకున్నట్లు ఆదేశ కెనడా మంత్రి కిస్టీ డుంకన్ ప్రకటించింది. 1986లో పంజాబ్ మంత్రి మల్కియాత్ సింగ్ సిద్ధూపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో జస్పాల్‌ను కోర్టు ఉగ్రవాదిగా తేల్చింది. ఈ కేసులో జస్పాల్ 20 ఏళ్ల జైలు శిక్ష అనుభవించారు. జస్పల్ సభ్యుడిగా ఉన్న ఇంటర్నేషనల్ సిక్క్ యూత్ ఫెడరేషన్‌పై నిషేధం కూడా విధించారు. జైలు నుంచి బయటికొచ్చాక కెనడా రాజకీయాల్లో జస్పాల్ క్రియాశీలకంగా వ్యవహరించటం ప్రారంభించారు. దీనిపై ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరం లేవనెత్తాయి. ఇక తాజాగా ట్రూడో హాజరయిన ముంబై ఈవెంట్‌లో సందడి చేసిన జస్పల్.. ట్రూడో భార్య సోఫీతో, కెనెడా మంత్రి అమర్‌జీత్ సోహితో ఫోటోలు కూడా దిగారు. కాగా, జస్పాల్‌కు ఆహ్వానం పంపడంపై తమ ఎంబసీ అధికారులపై ట్రూడో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సుస్థిర ప్రభుత్వంతోనే అభివృద్ధి

- **నాగాలాండ్‌కు ఎంతో అవసరం**
- **ఎన్నికల ప్రచార సభలో మోదీ**



కోహిమా, ఫిబ్రవరి 22: నాగాలాండ్ అభివృద్ధి చెందాలంటే బలమైన, సుస్థిర ప్రభుత్వం ఏర్పాటు కావాలని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. నాగాలాండ్‌లో ప్రస్తుత బీజేపీ-ఎన్‌డీపీపీ ప్రభుత్వం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయకుండా అభివృద్ధి దిశగా పనిచేస్తోందని అన్నారు. రాష్ట్రంలో రోడ్ల సదుపాయాల కల్పనకు కృషి చేస్తోందని చెప్పారు. గురువారం నాగాలాండ్‌లో ఎన్నికల ప్రచార సభలో మోదీ మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాలను పారదర్శకంగా అభివృద్ధి చేయాలన్నదే తన లక్ష్యమని అన్నారు. నాలుగేళ్లలో కేంద్రం నాగాలాండ్‌లో 500 కిలో మీటర్ల మేర హైవేలను విస్తరించిందని, రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి 10 వేల కోట్ల రూపాయలకు పైగా వ్యయం చేయాలని యోచిస్తోందని తెలిపారు. నిధుల ఫలాలు ప్రజలకు చేరాలంటే నాగాలాండ్‌లో బీజేపీ-ఎన్‌డీపీపీ కూటమికి ఓట్లు వేయాలని మోదీ కోరారు. కేంద్రం పంపిన నిధుల్లో రూపాయికి 15 పైసలు మాత్రమే గ్రామాలకు చేరుతున్నాయని గతంలో మాజీ ప్రధాని చెప్పారంటూ పేరు ప్రస్తావించకుండా మోదీ ఉటంకించారు. ఇలాంటి పరిస్థితిలో మార్పు తీసుకురావడానికి అంకితభావంతో పనిచేస్తున్నామని చెప్పారు. నాగాలాండ్ రాజధాని కోహిమాను స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడానికి కేంద్రం దాదాపు 1800 కోట్లు ఇస్తుందని హామీ ఇచ్చారు. ఈ నెల 27న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 60 సీట్లున్న నాగాలాండ్ అసెంబ్లీకి బీజేపీ 20 స్థానాల్లో, ఎన్‌డీపీపీ 40 చోట్ల పోటీ చేస్తున్నాయి.

60 శాతం కోటీశ్వరులే

నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో 59 శాతం కోటీశ్వరులు ఉన్నారు. ధనికుల జాబితాలో జేడీయూ అభ్యర్థి రమోంగో లోథా మొత్తం 38.92 కోట్ల సంపదతో మొదటి స్థానంలో ఉన్నారు. అభ్యర్థులు దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్ల ఆధారంగా ఏడీఆర్ (అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) వివరాలను వెల్లడించింది. మొత్తం 196 మంది ఎన్నికల్లో పోటీ చేస్తుండగా, వీరిలో ముగ్గురి అఫిడవిట్లు ఎన్నికల వెబ్‌సైట్‌లో స్పష్టంగా లేవని, 114 మంది అభ్యర్థులు కోటీశ్వరులని ఏడీఆర్ పేర్కొంది. విశ్రాంత ఐఏఎస్ అధికారి అయిన లోథాకు 38.69 కోట్ల స్థిరాస్తులు, 22.81 లక్షల చరాస్తులు ఉన్నట్టు విశ్లేషించింది. నాగాలాండ్ ముఖ్యమంత్రి టీఆర్ జెలియంగ్‌కు మొత్తం 3.52 కోట్లు, మాజీ ముఖ్యమంత్రులు నీఫియు రియోకు 15.37 కోట్ల చరాస్తులు, కేఎల్ చిషికి మొత్తం 38.20 కోట్ల ఆస్తులు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారని తెలిపింది. అభ్యర్థుల్లో అత్యధికంగా చిషికి 89 లక్షల రుణం ఉన్నట్టు వెల్లడించింది.

మిలిటెంట్ల కాల్పులో
ఆర్మీ కమాండోకు గాయాలు

శ్రీనగర్, ఫిబ్రవరి 22: జమ్మ-కశ్మీర్‌లో బండిపొరా జిల్లాలో భద్రత దళాలు, మిలిటెంట్లకు మధ్య జరిగిన కాల్పుల్లో ఓ ఆర్మీ కమాండో గాయపడ్డాడు. కాగా మిలిటెంట్లు పారిపోయారు. బండిపొరా జిల్లాలోని హజిన్ ప్రాంతంలో నలుగురు మిలిటెంట్లు ఉన్నారన్న సమాచారం మేరకు భారత భద్రత దళాలు అప్రమత్తమయ్యాయి. మిలిటెంట్లు ఉన్న ప్రాంతంలో మాటు వేశాయి. అయితే మిలిటెంట్లు భద్రత బలగాలపై కాల్పులు జరిపారు. దీంతో భారత దళాలు ప్రతిదాడికి యత్నించాయి. ఈ ఘటనలో 31 రాష్ట్రీయ రైఫిల్స్‌కు చెందిన ఓ కమాండో గాయపడ్డాడు.

నేలపై పాకే రోబో పాము

హార్వర్డ్ పరిశోధకుల ఆవిష్కరణ

బోస్టన్, ఫిబ్రవరి 22: జపాన్ ప్రాచీన సంప్రదాయ పద్ధతిని ఉపయోగించి హార్వర్డ్ శాస్త్రవేత్తలు పాము లాంటి ఓ రోబోను తయారుచేశారు. పాములాంటి ఆకారమే కాదు దానిలాగే ఈ రోబో కూడా పాకుతుందట! ఈ ఆవిష్కరణ భవిష్యత్తులో వివిధ రంగాల్లో మరిన్ని నూతన ఆవిష్కరణలకు దారిచూపుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా తవ్వకాలలో, పర్యవేక్షణలో, అన్వేషణలో, రెస్క్యూ ఆపరేషన్లలో లాపరోస్కోపిక్ వంటి వైద్య విధానాలలో మార్పులకు దోహదపడుతుందని హార్వర్డ్‌కు చెందిన కటియా బెర్టోల్డి తెలిపారు. జపాన్ ప్రాచీన కళ కిరిగామి(పేపర్‌ను వివిధ ఆకృతులుగా మలిచే ఒరిగామి లాంటి మరో కళ) సాయంతో రోబోను రూపొందించడంతో నునుపుగా ఉన్న ప్రదేశాలపైనా ఇది పాకుతూ ముందుకెళుతుందని ఆయన వివరించారు.



గజరాజులకూ మానవ వ్యక్తిత్వం

ఏనుగులలో 3 రకాల స్వభావాల గుర్తింపు

లండన్, ఫిబ్రవరి 22: గజరాజులకూ మనుషులకు మల్లే వ్యక్తిత్వం ఉంటుందని తాజా పరిశోధనలో వెల్లడైంది. ప్రస్తుతానికి ఏనుగులలో మూడు రకాల మానవ స్వభావాలను గుర్తించినా.. మరిన్ని కూడా ఉండొచ్చని పరిశోధకులు చెబుతున్నారు. ఆకారంలో తేడాలున్నా అవి కూడా మనలానే కలుపుగోలుగా, జాగరూకతతో పాటు దుడుకు స్వభావాన్నీ కలిగి ఉంటాయని ఫిన్లాండ్ పరిశోధకులు పేర్కొన్నారు. ఈమేరకు టుర్కు యూనివర్సిటీ శాస్త్రవేత్తలు సుదీర్ఘకాలం పాటు పరిశోధించి ఈ విషయాన్ని కనుగొన్నారు. మనుషులకు ఉన్నట్లే ఏనుగులలోనూ జాగరూకత, సామాజికత, దుడుకు స్వభావం ఉంటాయని తమ అధ్యయనంలో వెల్లడైందన్నారు. ఈమేరకు టుర్కు యూనివర్సిటీ శాస్త్రవేత్తలు మయన్మార్‌లోని ఏనుగుల సమూహం(250కి పైగా) ప్రవర్తనను నిశితంగా అధ్యయనం చేసి ఈ విషయాన్ని కనుగొన్నారు. జాగ్రత్తగా నడుచుకోవడం, మిగతా వాటితో కలిసిపోవడం, దుడుకుగా వ్యవహరించడం.. ఈ మూడు రకాల స్వభావాలకు సంబంధించి ఏనుగులలో ఆడ, మగ తేడా లేదని వర్సిటీకి చెందిన సెల్ట్‌మాన్ వివరించారు. తమదంటూ సహజ వాతావరణంలో జీవిస్తున్న ఏనుగులను పరిశీలిస్తే దీనిని గుర్తించవచ్చని చెప్పారు.



క్రేజీ కాంబో.. క్రేజీ టైటిల్


• ఎన్టీఆర్

టాలీవుడ్‌లో క్రేజీ కాంబినేషన్‌గా తెరకెక్కబోతున్న ఎన్టీఆర్, త్రివిక్రమ్ చిత్రం మార్చి నుంచి సెట్స్ మీదకు వెళ్లనుంది. దీనికి సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు ఇప్పుడు వేగంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి సంబంధించిన ఓ తాజా వార్త టాలీవుడ్‌లో హల్ చల్ చేస్తోంది. అదేంటంటే ఈ మూవీ కోసం త్రివిక్రమ్ 'ఆన్ సైలెంట్ మోడ్' అనే టైటిల్‌ను పెట్టాలనుకుంటు న్నట్లు తెలుస్తోంది. ఈ మూవీలో ఎన్టీఆర్ సరసన పూజా హెగ్డే నటించనుంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కబోతున్న ఈ చిత్రాన్ని దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనుకుంటుంది చిత్ర యూనిట్.

21 ఏళ్ల తర్వాత...


• ప్రకాష్ రాజ్


• మోహన్ లాల్

మోహన్ లాల్, ప్రకాష్ రాజ్ కాంబినేషన్‌లో ప్రముఖ తమిళ దర్శకుడు మణిరత్నం రూపొందించిన చిత్రం 'ఇద్దరు'. ఈ సినిమా విడుదలై 21 ఏళ్ళు అవుతోంది. అయితే ఇప్పటివరకు లాల్, ప్రకాష్ రాజ్ కాంబోలో మరో సినిమా రాలేదు. త్వరలోనే ఈ ఇద్దరూ కలిసి మరోసారి నటించబోతున్నారు. మోహన్ లాల్ హీరోగా నటిస్తున్న మలయాళ చిత్రం 'ఒడియన్'లో ప్రకాష్ రాజ్ విలన్ పాత్రలో నటిస్తున్నారు. శ్రీ కుమార్ మీనన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో వీరిద్దరి పాత్రలు చాలా ఆసక్తికరంగా ఉంటాయని సమాచారం. అంతేగాకుండా, ఇద్దరూ కూడా పలు గెటప్స్‌లో సందడి చేయనున్నారని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలా ఉంటే.. ఈ సినిమాకి సంబంధించిన తాజా షెడ్యూల్ మార్చి 6 నుంచి జరుగనుంది. రెండు నెలల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో సినిమాకి సంబంధించిన మేజర్ పార్ట్ పూర్తవుతుందని సమాచారం. మంజు వారియర్ పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్న ఈ మూవీని ఆశీర్వాద్ సినిమాస్ పతాకంపై ఆంటోనీ పెరుంబవూర్ నిర్మిస్తున్నారు. ఎం.జయచంద్రన్ స్వరాలను అందిస్తున్న ఈ చిత్రం.. అక్టోబర్ 18న విడుదల కానుంది.

కుదిరిన సయోధ్య



ఏప్రిల్ 26నే 'భరత్ అనే నేను', 'నా పేరు సూర్య' చిత్రాలు విడుదలవుతున్నట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో తెలుగు సినీ రంగానికి చెందిన కొందరు ప్రముఖులు దిల్ రాజు, కె.ఎల్.నారాయణ, నాగబాబుగార్ల సమక్షంలో ఈ రెండు చిత్రాల నిర్మాతలు సమావేశం అయ్యారు. రెండు భారీ చిత్రాలు ఒక రోజు విడుదలవడం ఇండస్ట్రీకి శ్రేయస్కరం కాదని భావించి అందరూ ఓ సయోధ్యకు వచ్చారు. ఈ సందర్భంగా దిల్‌రాజు, డా.కె.ఎల్.నారాయణ, నాగబాబుగారు మాట్లాడుతూ ''రెండు భారీ చిత్రాల విడుదల మధ్య కనీసం రెండు వారాలు గ్యాప్ ఇవ్వడం పరిశ్రమకు చాలా మంచిది. సంక్రాంతి సీజన్‌ని మినహాయిస్తే మిగిలిన సందర్భాల్లో రెండు భారీ చిత్రాల మధ్య ఇలా రెండు వారాలు గ్యాప్ ఇచ్చి రిలీజ్ డేట్స్ ప్లాన్ చెయ్యడం వలన పరిశ్రమకు ఎంతో మేలు జరుగుతుంది. 'భరత్ అనే నేను', 'నా పేరు సూర్య' నిర్మాతల మధ్య మంచి అండర్ స్టాండింగ్ కుదరడం ఓ శుభ పరిణామంగా భావిస్తున్నాం'' అన్నారు. నిర్మాతలు డి.వి.వి.దానయ్య, లగడపాటి శ్రీధర్, బన్నీ వాసు మాట్లాడుతూ ''ఈ రెండు భారీ చిత్రాల మధ్య కనీసం రెండు వారాలు గ్యాప్ ఉండాలన్న ఉద్దేశంతో ఏప్రిల్ 20న 'భరత్ అనే నేను', మే 4న 'నా పేరు సూర్య.. నా ఇల్లు ఇండియా' చిత్రాల్ని విడుదల చెయ్యడానికి నిర్ణయించాం. ఇండస్ట్రీలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలని, సహకరించిన అందరికి కృతజ్ఞతలు'' అన్నారు.

మరోసారి జోడిగా...

అక్కినేని నాగ చైతన్య ఇప్పుడు వరుస సినిమాలతో బిజీ బిజీగా మారారు. ఇప్పుడు చైతు హీరోగా చందు మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'సవ్యసాచి' షూటింగ్ జరుగుతుంది. ఈ సినిమా తర్వాత మారుతి దర్శకత్వంలో 'శైలజా రెడ్డి అల్లుడు' అనే సినిమా చేయబోతున్నారు చైతన్య. ఈ నేపథ్యంలో ఓ లేడి డైరక్టర్‌తో సినిమా చేయడానికి చైతు ఓకే చెప్పినట్లు ఇండస్ట్రీలో వార్తలు వినపడుతున్నాయి. దర్శకుడు కృష్ణవంశీ వద్ద దర్శకత్వ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన సౌజన్య అనే దర్శకురాలు చైతన్యకు ఓ కథను చెప్పిందట. చైతుకి కథ బాగా నచ్చడంతో సానుకూలంగానే స్పందించారట. ఇందులో హీరోయిన్‌గా రకుల్ ప్రీత్‌ని నటింప చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. రకుల్ కూడా దాదాపు ఎస్..చెప్పినట్లేనని సమాచారం. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతుంది. అంతా ఓకే అయితే 'రారండోయ్ వేడుక చూద్దాం' తర్వాత చైతు, రకుల్ కాంబినేషన్‌ను మరోసారి తెరపై వీక్షించవచ్చు.


• నాగచైతన్య, రకుల్‌ప్రీత్ సింగ్

పెద్దమ్మ... కాజల్



తెలుగులో స్టార్ హీరోయిన్స్‌గా రాణిస్తున్న హీరోయిన్స్‌లో కాజల్ అగర్వాల్ ఒకరు. ఈమె సోదరి నిషా అగర్వాల్ కూడా గతంలో కొన్ని తెలుగు సినిమాల్లో నటించింది మెప్పించిన సంగతి తెలిసిందే. అయితే కాజల్ తరహాలో నిషా ఎక్కువ కాలం హీరోయిన్‌గా కొనసాగలేదు. 2013లో వ్యాపారవేత్త కరణ్ వలేచాను పెళ్లి చేసుకుని సినిమాలకు టాటా చెప్పేసిన సంగతి తెలిసిందే. ఐదేళ్ల తర్వాత నిషా అగర్వాల్ తల్లిగా ప్రమోషన్ అందుకుంది. పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తన సోదరి నిషాకు మగబిడ్డ పుట్టిన ఆనందాన్ని కాజల్ బుధవారం ట్విట్టర్ ద్వారా పంచుకున్నారు. నిషా తనకు పుట్టిన బిడ్డను ముద్దాడుతున్న ఫొటోను కాజల్ తన ట్విట్టర్ ఖాతాలో షేర్ చేసింది. ఈ ఫొటోకు.. 'నిషా ప్రసవించే సమయంలో పుట్టబోయే బిడ్డ కోసం రాత్రంతా మేల్కొని ఎదురుచూడాల్సి వచ్చింది. ఇదిగో మా చిన్నారి ఇషాన్‌ను చూశారా?' అని కాజల్ ట్వీట్ చేశారు. ఈ బాబుకు 'ఇషాన్ వలేచా' అని నామకరణం చేశారు.



రొమాంటిక్ థ్రిల్లర్‌గా...


• బెల్లంకొండ శ్రీనివాస్, వి.వి.వినాయక్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా వంశధార క్రియేషన్స్ బ్యానర్‌పై కొత్త చిత్రం గురువారం హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. శ్రీనివాస్ దర్శకత్వంలో నవీన్ శొంఠినేని (నాని) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి వి.వి.వినాయక్ క్లాప్ కొట్టగా.. తెలంగాణా ఎఫ్.డి.సి ఛైర్మన్ పి.రామ్మోహన్‌రావు గౌరవ దర్శకత్వం వహించారు. గురజాల ఎమ్మెల్యే యరపతనేని శ్రీనివాసరావు, దర్శకులు శ్రీవాస్ కలిసి కెమెరా స్విచ్చాన్ చేశారు. జీవన్ రెడ్డి (ఎమ్మెల్యే)–మహేందర్ రెడ్డిలు కలిసి స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత నవీన్ శొంఠినేని మాట్లాడుతూ ''మా బ్యానర్ నుంచి వస్తున్న మొదటి సినిమా ఇది. చాలా డిఫరెంట్ గా ఉంటుంది'' అన్నారు. చిత్ర కథానాయకుడు బెల్లంకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ ''నవీన్‌తో కలిసి సినిమా చేద్దామని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను. ఇప్పటికి కుదిరింది. అసలు తెలుగు చిత్రసీమలో ఎవ్వరూ చూడని సరికొత్త పాయింట్ తో ఈ సినిమా తెరకెక్కనుంది. తమన్ తో తొలిసారిగా వర్క్ చేయనున్నాను'' అన్నారు. చిత్ర దర్శకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ''రొమాంటిక్ థ్రిల్లర్ గా తెరకెక్కనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ మార్చి 2 నుండి ప్రారంభమవుతుంది. సినిమాలో శ్రీనివాస్‌కు జోడిగా ఇద్దరు స్టార్ హీరోయిన్స్ నటించనున్నారు. వాళ్లెవరన్నది త్వరలోనే తెలియజేస్తాం'' అన్నారు.

'వాడేనా' పాటలు విడుదల


• శివ్‌తాండేల్, నేహా దేశ్ పాండే

నిర్మాణి ఫిలిమ్స్ పతాకంపై శివ్ తాండేల్, నేహా దేశ్ పాండే హీరో హీరోయిన్స్‌గా నటిస్తున్న చిత్రం 'వాడేనా'. సాయిసునీల్ నిమ్మల దర్శకత్వంలో మణిలాల్ మచ్చి అండ్ సన్స్ నిర్మిస్తున్న సినిమా ఇది. ఈ సినిమా ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో జరిగింది. బిగ్ సీడీని ఎన్ శంకర్ విడుదల చేయగా, ఆడియో సీడీని మరియు చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. దర్శకుడు ఎన్. శంకర్ మాట్లాడుతూ ''ట్రైలర్, సాంగ్స్, రీ రికార్డింగ్ బావున్నాయి. టైటిల్ చాలా ఇంట్రెస్టింగ్‌గా, క్యాచీగా ఉంది. మంచి సర్‌ప్రైజ్ ఎలిమెంట్ సినిమాలో ఉందని భావిస్తున్నాను''అన్నారు. రాజ్ కందుకూరి మాట్లాడుతూ ''ట్రైలర్ చూస్తుంటే సినిమా కొత్తగా ఉంటుందని భావిస్తున్నాను. సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనిపిస్తుంది'' అని తెలిపారు. మ్యూజిక్ డైరెక్టర్ కిరణ్ మాట్లాడుతూ ''నేను సంగీతం అందించిన తొలి చిత్రమిది. నన్ను నమ్మి ఈ అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు నా కృతజ్ఞతలు'' అన్నారు. నిర్మాతల్లో ఒకరైన ధృవ్ మాట్లాడుతూ ''పాటలు బావున్నాయి. డైరెక్టర్‌గారు సినిమాను చాలా చక్కగా తెరకెక్కించారు. సినిమా చాలా బాగా వచ్చింది''అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ''ప్రేక్షకులు సినిమా సెకెండ్ ఆఫ్ చూసి చాలా ఎగ్జయిట్‌మెంట్‌గా ఫీల్ అవుతారు. ఈ సినిమాకు నేను దర్శకత్వం చేయడమే కాకుండా నాలుగు పాటలు రాశాను. కొరియోగ్రఫీ కూడా చేశాను. తప్పకుండా మంచి సినిమాగా నిలిచిపోతుందని నమ్మకంగా చెప్పగలను'' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ఊహించనే లేదు!


• డయానా

'విలక్షణమైన కాన్సెప్ట్‌లతో సినిమాలు చేసే దర్శకుల్లో మణిరత్నం ఒకరు. ఈయన దర్శకత్వంలో పనిచేయాలని చాలా మంది నటీనటులు కోరుకుంటారు. కానీ నాకు ఆ అవకాశం అనుకోకుండా వచ్చింది' అని అంటుంది డయనా ఎర్రప్ప. మణిరత్నం దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతోన్న చిత్రం 'నవాబ్' (చెక్క చివంద వానం). ఈ సినిమాలో ఆడిషన్ కోసం చిత్ర యూనిట్ డయానాకు కాల్ చేస్తే ... ముందు ఫేక్ కాల్ అని అనుకుందట. అయితే అది నిజమేనని తెలియడంతో వెంటనే యూనిట్ సంప్రదించింది. ఆడిషన్ పూర్తయిన కొన్ని రోజులు తర్వాత మణిరత్నం సినిమాలో ఉన్నట్లు యూనిట్ డయానాకు కన్‌ఫర్మ్ చేయడంతో థ్రిల్ అయ్యిందట. కారణం మణిరత్నం సినిమాలో నటిస్తానని ఊహించనే లేదు. అలాంటిది ఓ గొప్ప దర్శకుడి సినిమాతో తెరంగేట్రం చేయనుండటం కల నిజమైనట్లుగా డయానాకి అనిపించిందట. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన వర్క్ షాప్‌లో బిజీగా ఉందట డయానా ఎర్రప్ప.

హరీశ్ 'సీటీమార్'



'సీటీ మార్ సీటీ మార్..' సాంగ్ ఎంత పాపులర్ అయిందో మనకు తెలిసిందే. ఇప్పుడు 'సీటీమార్' అనే టైటిల్‌తో త్వరలోనే ఓ సినిమా తెరకెక్కనుండటం విశేషం. హరీశ్ శంకర్.. ప్రస్తుతం దిల్‌రాజు బ్యానర్‌లో 'దాగుడుమూతలు' అనే సినిమాను రూపొందించే పనిలో భాగంగా స్క్రిప్ట్ వర్క్‌తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తికాగానే 'జవాన్' చిత్రాన్ని నిర్మించిన అరుణాచల్ క్రియేషన్స్ పతాకంపై కొమ్మలపాటి కృష్ణ నిర్మాణంలో హరీశ్ శంకర్ 'సీటీమార్' సినిమాను డైరెక్ట్ చేస్తారు. ఈ సినిమాలో వరుస హిట్స్ సాధిస్తున్న యువ కథానాయకుడు హీరోగా నటించనున్నారు. త్వరలోనే చిత్ర యూనిట్ పూర్తి వివరాలను తెలియజేస్తుంది.

దాడులు చేయడం సరికాదు

- ఇదేం నియంతృత్వం కాదు.. ప్రజాస్వామ్యం
- విమర్శలను స్వీకరించాలి: పవన్ కల్యాణ్
- జనసేనానితో సీపీఐ రామకృష్ణ సమావేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (మనం ప్రతినిధి): ప్రజాస్వామ్యంలో అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించే హక్కును రాజ్యాంగం కల్పించిందని, దాడులు చేయడానికి ఇదేం నియంతృత్వం కాదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఇబ్బంది కలిగినా పార్టీలు, ప్రభుత్వాలు విమర్శలను స్వీకరించాలని పవన్ సూచించారు. వారు కూడా తమ అభిప్రాయాన్ని వ్యక్తీకరించాలని, దాడులు చేయడం సరికాదని అన్నారు. ఇటీవల మీడియా ప్రతినిధులపైన, ప్రముఖులపైన జరిగిన దాడిని ఖండించారు. దాడులకు పాల్పడినవారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్‌తో సీపీఐ ఏపీ కార్యదర్శి రామకృష్ణ సమావేశమయ్యారు. సంయుక్త నిజ నిర్ధారణ కమిటీ (జేఎఫ్‌సీ) తొలి భేటీ తర్వాత చోటు చేసుకుంటున్న పరిణామాలపై చర్చించారు. అనంతరం వారిద్దరూ మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన దాడులను ఖండించారు. విద్యుత్ కార్మికులకు, అగ్రిగోల్డ్ బాధితులకు ఏపీ ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. వారి సమస్యలను పరిష్కరించే దిశగా వెంటనే చర్యలు తీసుకోవాలని చంద్రబాబు నాయుడును కోరుతున్నానని పవన్ అన్నారు. ప్రత్యేక హోదా, ఏపీకి జరిగిన అన్యాయంపై చర్చించేందుకు మార్చి 1న గుంటూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశానికి రావాల్సిందిగా పవన్‌ను రామకృష్ణ ఆహ్వానించారు. టీడీపీ, బీజేపీ మినహా అన్ని పార్టీలు ఈ సమావేశంలో పాల్గొననున్నాయి. ముందుగా వేరే కార్యక్రమాలు ఖరారైనందున, ఈ భేటీకి హాజరయ్యేదీ లేనిదీ రెండ్రోజుల్లో వెల్లడిస్తానని పవన్ తెలిపారు.

ప్రత్యేక హోదా, హామీల సాధన కోసం పోరాడేందుకు విద్యార్థులను జనసేన సమాయత్తం చేయనుంది. ఇందులో భాగంగా ఏపీలోని యూనివర్సిటీలు, కాలేజీల విద్యార్థులకు 'ప్రత్యేక

విద్యార్థులకు హోదా టీ షర్టులు

హోదా-ఆంధ్రుల హక్కు, జనసేన' అని రాసి ఉన్న టీ షర్టులను పంపిణీ చేసేందుకు పార్టీ విద్యార్థి విభాగం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇటీవల కాలంలో ఉద్యమాల్లో కీలకపాత్ర పోషిస్తున్న సోషల్ మీడియాపై కూడా భగత్‌సింగ్ విద్యార్థి విభాగం దృష్టి పెట్టింది. హోదా సాధనపై సోషల్ మీడియాలో ప్రచారం చేసి, విద్యార్థులు, యువతను ఉత్తేజపరచనుంది.



హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్‌తో సమావేశమైన రామకృష్ణ



ధర లేకపోవడంతో రోడ్ల పడేసిన టమోటాను తింటున్న పశువులు

కిలో పావలా

- రైతుకు టమోటా రేటు ఇదీ!
- భారీగా పతనమైన సీమఆపిల్ ధర
- పొలాల్లోనే వదిలేసిన అన్నదాతలు
- దళారుల రాజ్యం.. అంతా భోజ్యం

కర్నూలు, ఫిబ్రవరి 22 (మనం న్యూస్‌బ్యూరో): టమోటా ధర మరోసారి భారీగా పతనమైపోయింది. వినియోగదారులు మార్కెట్‌కు వెళ్లి కొనాలంటే రూ. 5 నుంచి రూ. 10 మధ్యలో పలుకుతున్నా.. వాటిని పండించే రైతుకు దక్కుతున్నది మాత్రం.. కిలో కేవలం పావలా!! దాంతో కాయలు తెంపి మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు అవుతున్న ఖర్చులు కూడా రైతుకు గిట్టుబాటు కావడం లేదు. ఇక చేసేది లేక.. పంట మొత్తాన్ని పశువులకు మేతగా వదిలేస్తున్నారు. రాష్ట్రంలో మదనపల్లె తర్వాత అత్యధికంగా టమోటా సాగుచేసేది కర్నూలు జిల్లాలోనే. జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో ఈ పంటను ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో సుమారు 20 వేల హెక్టార్లకుపైగా టమోటా పంటను సాగు చేశారు. ఒక ఎకరాలో పంట సాగుకు సుమారు రూ. 15 వేలకు పైగా ఖర్చు చేస్తున్నారు.

అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి

ఆరుగాలం కష్టపడి పండించిన తర్వాత టమోటా పంటకు గిట్టుబాటు ధర కరువైంది. భారీగా పంట మార్కెట్‌కు వస్తే చాలు.. రేటు అమాంతం పడిపోతోంది. బహిరంగ మార్కెట్లో కిలో టమోటా రూ.10 వరకు పలుకుతున్నా.. పత్తికొండ మార్కెట్లో మాత్రం అడిగే నాథులు కరువయ్యారు. 20 కేజీల బాక్స్ కేవలం రూ. 5కు మించి కొనగడంలేదు. ఈ బాక్స్ మార్కెట్‌కు తీసుకురావడానికి రవాణా ఖర్చే రూ. 15 అవుతుంది. కూలీ ఖర్చు సరేసరి. కానీ మార్కెట్‌కు వస్తే.. దారుణంగా అడగడంతో రైతులు పంట కోసి రోడ్లపై పడేస్తున్నారు. కొంత మంది పశువులకు దాణాగా వేస్తున్నారు.

వ్యాపారుల మాయాజాలం

పత్తికొండ మార్కెట్‌కు ఆ ప్రాంతం నుంచే కాక నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో టమోటా పంట వస్తుంటుంది. అయితే పంట భారీగా వచ్చిన సారి టమోటా కొనుగోలు చేసే వ్యాపారులు రింగ్ అయ్యి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా టమోటా ఎక్కువ రోజులు నిల్వ ఉండదు. దీన్ని బలహీనతగా తీసుకున్న వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రైతుల దగ్గర నుంచి తక్కువ ధరకు కొని బహిరంగ మార్కెట్లో ఎక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ధర వచ్చినప్పుడు అమ్ముకుందామంటే కోల్డ్ స్టోరేజీలు కూడా లేవు. దీంతో చేసేది లేక రైతులు వ్యాపారులు అడిగిన ధరకే అమ్మి నష్టపోతున్నారు.

మూతపడ్డ మార్కెట్

టమోటా ధర భారీగా తగ్గిపోవడంతో రైతులు టమోటాను మార్కెట్‌కు తీసుకురావడం నిలిపివేశారు. దీంతో మార్కెట్ రెండు రోజుల నుంచి మూతపడింది. కొనుగోళ్లు, అమ్మకాలు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. కర్నూలు జిల్లాలో టమోటా పంట ఎక్కువగా పండిస్తుండడంతో పత్తికొండ ప్రాంతంలో జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మిస్తే.. రైతులకు అండగా ఉంటుందని పలువురు మేధావులు సూచించారు. ప్రభుత్వాలు కూడా ఫ్యాక్టరీ నిర్మిస్తామని హామీ ఇచ్చాయి. అయితే ఇప్పటి వరకు అది రాలేదు. కనీసం కోల్డ్ స్టోరేజీలైనా నిర్మిస్తారని భావిస్తే.. అది కూడా లేదు. దీంతో ప్రతి ఏటా టమోటా రైతులు నష్టపోతున్నారు.

ఇక ఉమ్మడి పరీక్ష

- సంక్షేమ, గురుకులాల్లో ప్రవేశానికి ఒకే పరీక్ష
- 2018-19 విద్యా సంవత్సరం నుంచి అమలు
- 5వ తరగతి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- ఏప్రిల్ 8న పరీక్ష: మంత్రి నక్కా ఆనందబాబు

అమరావతి, ఫిబ్రవరి 22 (మనం ప్రతినిధి): సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ విద్యాలయాలు, ఏపీ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి ప్రవేశాలకు ఇకపై ఉమ్మడిగా ఒకే పరీక్ష నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. 2018-19 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయనుంది. ఏప్రిల్ 8న ఉమ్మడి పరీక్ష నిర్వహించి, ఆయా విద్యాలయాల్లో సీట్లు భర్తీ చేయనున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు వెల్లడించారు. గురువారం సచివాలయంలో ఉమ్మడి పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్‌ను మంత్రి విడుదల చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంతవరకూ సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ, ఏపీ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి ఇంగ్లీష్ మాధ్యమంలో ప్రవేశాలకు వేర్వేరుగా ప్రవేశ పరీక్షలు నిర్వహించేవారని మంత్రి తెలిపారు. ఆయా విద్యా సంస్థల్లో చేరాలనుకున్న విద్యార్థులు నాలుగు ప్రవేశ పరీక్షలకు హాజరయ్యేవారని, దీనివల్ల ఎన్నో ఇబ్బందుల పాలయ్యేవారని మంత్రి తెలిపారు. విద్యార్థుల అవస్థలను గుర్తించిన సీఎం చంద్రబాబు నాయుడు.. సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతుల సంక్షేమ, ఏపీ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి ప్రవేశాలకు ఒకే పరీక్ష నిర్వహించాలని ఆదేశించారని తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు 2018-19 నుంచి ఒకే ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని మంత్రి నక్కా ఆనందబాబు వివరించారు. ఏప్రిల్ 8న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామన్నారు. జిల్లాను యూనిట్‌గా తీసుకుని, ఆ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఆయా విద్యా సంస్థల్లో



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న నక్కా ఆనందబాబు

సీట్లు భర్తీ చేస్తామని మంత్రి వెల్లడించారు. 4వ తరగతిలోని ఇంగ్లీష్, తెలుగు, గణితం, సైన్స్, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాల నుంచి 10 ప్రశ్నల చొప్పున మల్టిపుల్ ఛాయిస్‌లో ఉమ్మడి ప్రవేశ పరీక్ష జరపనున్నామన్నారు. 01.09.2018 నాటికి విద్యార్థుల వయసు 10 నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలని మంత్రి తెలిపారు. ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో ఈ ఉమ్మడి పరీక్ష జరగనుందన్నారు. నిరుడు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ విద్యాలయాల్లో 17 వేల సీట్లకు గానూ 54 వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రస్తుతం సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో 14,760 సీట్లు, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో 2,760, వెనుకబడిన తరగతులు సంక్షేమ పాఠశాలల్లో 3,400, ఏపీ గురుకుల విద్యాలయాల్లో 3,960 సీట్లు.. మొత్తం 24,820 సీట్లకు గానూలక్ష వరకూ దరఖాస్తులు రావొచ్చునని మంత్రి తెలిపారు. అర్హులైన అభ్యర్థులు మార్చి 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందజేయాలని మంత్రి సూచించారు. ఇందుకోసం రూపొందించిన వెబ్ సైట్ www.apgpcet.apcfss.in ను మంత్రి నక్కా ఆనందబాబు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కన్నల్ వి.రాములు, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి దేవర వాసు తదితరులు పాల్గొన్నారు.

2019 నాటికి 19 లక్షల ఇళ్లు: లోకేశ్

హనుమాన్ జంక్షన్, ఫిబ్రవరి 22 (మనం న్యూస్): రానున్న కాలంలో గ్రామ పంచాయతీలు 10 స్టార్లతో అగ్రస్థానంలో ఉంటాయని మంత్రి నారా లోకేశ్ అన్నారు. గురువారం కృష్ణా జిల్లా ఉంగుటూరులో 48 కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. 2019 నాటికి 19 లక్షల ఇళ్లు నిర్మించాలనేది ప్రభుత్వ ధ్యేయమని లోకేశ్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని అనేక పథకాలను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థంగా అమలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో 14 వేల కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్డు వేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. జిల్లాలో రూ. 860 కోట్లతో ప్రతి ఇంటికి ఉచితంగా మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లోకేశ్

టీడీపీలో రాజ్యసభ రగడ!

- తలనొప్పిగా అభ్యర్థుల ఎంపిక
- ఓపెన్ కేటగిరీకి వైసీపీతో పోటీ
- బీజేపీ ఓట్లు ఎటు పడతాయో?
- అభ్యర్థి కోసం చంద్రబాబు కసరత్తు
- రెండు రోజుల్లో అభ్యర్థుల పేర్లు వెల్లడి



(అమరావతి-మనం)రాష్ట్రంలో ఇప్పటికే పలు రాజకీయ, పరిపాలనాపరమైన సమస్యలతో సతమతమవుతున్న ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబుకు రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక మరింత తలనొప్పిగా మారింది. ఖాళీ అవుతున్న మూడు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనుండగా, ఇప్పటికే అధికార తెలుగుదేశం పార్టీలో వాటికోసం పోటాపోటీ నెలకొంది. రాజ్యసభకు ఖాళీ అవుతున్న మూడు సీట్లలో ఒకటి బీసీ, మరోకటి ఎస్సీలకు కేటాయించగా మూడో సీటు ఓపెన్ కేటగిరిలో ఉంది. బీసీ కోటాలో.. రాష్ట్ర ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు ఒక దశలో రాజ్యసభకు వెళ్లి కేంద్రమంత్రి కావాలని ఆశపడ్డారు. అయితే బీజేపీతో తెలుగుదేశం పార్టీకి నెలకొన్న విభేదాల నేపథ్యంలో యనమల వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తన కుమార్తెకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని పట్టుబట్టిన యనమల రాజ్యసభకే వెళతారా.. లేదా రాష్ట్రంలో ఉంటారా? అనేది కొద్దిరోజుల్లో తేలిపోనుంది. కాగా సీఆర్‌డీఏ సభ్యుడు బీద మస్తాన్‌రావు, శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షురాలు గౌతు శిరీష కూడా బీసీ కోటాలో రాజ్యసభకు పోటీలో ఉన్నారు. ఎస్సీ కోటాలో... ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఇటీవల వరకు బాధ్యతలు నిర్వహించిన జూపూడి ప్రభాకరరావు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ వర్ల రామయ్య కూడా తమ వంతు ప్రయత్నాలు గట్టిగానే సాగిస్తున్నారు. మూడోది ఓపెన్ కేటగిరీలో... 2016లో త్రుటిలో చేజారిన అవకాశాన్ని తిరిగి దక్కించుకునేందుకు, టీడీపీ సీనియర్ నేత పొలిట్‌బ్యూరో సభ్యుడు కంభంపాటి రామ్మోహన్‌రావు కూడా తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలిసింది. సిట్టింగ్ ఎంపీ, సీఎం రమేష్ మూడో అభ్యర్థికి ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా వై సీపీ నుంచి నెల్లూరు జిల్లాకు చెందిన గ్లోబల్ కాంట్రాక్టర్ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రంగంలోకి దిగారు. వైసీపీకి ప్రస్తుతం 44 ఓట్లు ఉన్నాయి. కావాల్సిన దానికన్నా మూడు ఓట్లు ఎక్కువగా గానే ఉన్నాయని చెబుతున్నారు. టీడీపీ నుంచి మూడో అభ్యర్థిగా సీఎం రమేష్ రంగంలోకి దిగితే... 'సర్వం సకలం' ఆయనే స్వయంగా చూసుకోవాల్సి వస్తుంది. ఈలోపల వైసీపీ నుంచి టీడీపీ వైపు ఆకర్షించేందుకు మరికొందరు ఎమ్మెల్యేల పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి. దీనికి సంబంధించి వైసీపీ ముఖ్యనేత విజయసాయిరెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి సైతం ఫిర్యాదు చేశారు. బీజేపీతో టీడీపీకి దూరం పెరుగుతున్న దశలో రాజ్యసభకు జరిగే ఓటింగ్‌లో బీజేపీ ఎమ్మెల్యేల ఓట్లు టీడీపీకి పడతాయా.. లేదా వైసీపీకి వెళ్తాయా అన్నది చర్చనీయాంశంగా మారింది.

మాజీ వైసీపీ ఎమ్మెల్యేల ఓట్లు ఎటో?

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 23 మంది ఎమ్మెల్యేల్లో అత్యధిక శాతం చంద్రబాబు నాయుడి తీరుపై తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు చెబుతున్నారు. కర్నూలు జిల్లా కోడుమూరు, కడప జిల్లా బద్వేల్ శాసనసభ్యులు మణిగాంధీ, జయరాములు బాహాటంగానే చంద్రబాబుపై తమ అసంతృప్తి గళాన్ని వినిపించారు. మరికొందరు కూడా తాము ఆశించిన స్థాయిలో తాయిలాలు అందలేదనో.. మరేదో కారణంతో లోలోపలే రగిలిపోతున్నారు. ఇప్పటికే తమ పార్టీ విడిచి వెళ్లినవారిని తిరిగి రమ్మంటూ ఓపెన్ ఆఫర్ ఇచ్చిన వైసీపీ.. వాళ్లలో కనీసం కొంత మంది ఓట్లయినా చీల్చేందుకు ప్రయత్నం చేస్తోంది. టీడీపీలో చేరిన వైసీపీ ఎమ్మెల్యేలు, టీడీపీ అధిష్ఠానం ఎంపిక చేసిన ఎంపీ అభ్యర్థులకు ఓటేస్తారా? లేదా గుట్టుచప్పుడు కాకుండా సీక్రెట్ ఓటుతో తమకు నచ్చినవారికి ఓటు వేస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. రెడ్డి కోటాలో...కర్నూలు జిల్లాకు చెందిన మాజీమంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్ రెడ్డి పేర్లను చంద్రబాబు పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ఏది ఏమైనా రెండు ఎంపీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకోవటం సునాయాసంగా కనిపిస్తుండగా మూడో స్థానం కోసం టీడీపీ - వై సీపీలమధ్య 'సామ, దాన, భేద దండో'పాయాలతో కూడిన వ్యూహ ప్రతివ్యూహాలు మొదలు కానున్నాయి. ఈ నేపథ్యంలో మూడో సీటును కైవసం చేసుకోవాలని టీడీపీ తీవ్రంగా కసరత్తు చేస్తోంది. రెండు, మూడు రోజుల్లో అభ్యర్థులను ప్రకటించనున్నారని తెలిసింది.

రాంగోపాల్ వర్మపై కేసు

- చినరాజప్ప ఆదేశాలతో విశాఖలో నమోదు



విశాఖపట్నం/విజయవాడ, ఫిబ్రవరి 22 (మనం న్యూస్ బ్యూరో): మహిళల పోరాటం నేపథ్యంలో దర్శకుడు రాంగోపాల్ వర్మపై విశాఖపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన వర్మపై కేసు నమోదు చేయాలంటూ కొద్ది రోజులుగా విశాఖలో మహిళా సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. విశాఖతో పాటు హైదరాబాద్‌లోనూ వర్మపై పోలీసులకు ఫిర్యాదులందాయి. హైదరాబాద్‌లో ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు వర్మను విచారణకు కూడా పిలిచారు. అయితే, విశాఖలో మాత్రం మొదట పోలీసులు కేసు నమోదు చేయలేదు. మహిళా కమిషన్, డీజీపీల దృష్టికి వెళ్లినా ఫలితం లేకపోవడంతో ఐద్వా ఉద్యమాన్ని ప్రారంభించింది. రెండు రోజుల క్రితం నగరానికి వచ్చిన డిప్యూటీ ముఖ్యమంత్రి, హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్పను ఐద్వా నేతలు కలసి వర్మపై కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన స్పందించి ఆదేశాలు జారీ చేయడంతో మూడవ పట్టణ పోలీసులు బుధవారం రాత్రి వర్మపై ఐపీసీ 504, 509 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. కాగా 364 ఏ, 500 సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని ఐద్వా నేతలు డిమాండు చేస్తున్నారు. గురు వారం మరోసారి పోలీసులకు ఈ మేరకు ఫిర్యాదు చేశారు.



మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త దేవి

వర్మపై చర్యలు తీసుకోండి

- ఐద్వా, ప్రజా సంఘాల నేతల డిమాండ్

మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన దర్శకుడు రాంగోపాల్ వర్మపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మహిళా నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వర్మను రక్షిస్తోందా అనే అనుమానం కలుగుతోందని ఐద్వా మహిళా నేతలు అన్నారు. 'రాంగోపాల్ వర్మను అరెస్ట్ చేయాలి, పోర్న్ ప్రకటనలు, సినిమాలను నిలిపివేయాలి' అనే అంశంపై ఐద్వా అధ్వర్యంలో గురువారం విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యవక్తగా హాజరైన సామాజిక కార్యకర్త దేవి మాట్లాడుతూ.. ప్రపంచంలో భారతీయ మహిళల పట్ల ఉన్న గౌరవాన్ని 'జీఎస్టీ' వెబ్ సిరీస్ దిగజార్చిందన్నారు. ఇలాంటి వాటి వల్ల మహిళలపై అత్యాచా రాలు మరింత పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బూతు చిత్రాలను ప్రమోట్ చేసేందుకే వర్మ దీన్ని నిర్మించారనే అనుమానం వ్యక్తం అవుతోందన్నారు. భారతీయ మహిళలను కించపరిచేలా వర్మ చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్య వ్యవస్థకు అవమానకరమన్నారు. ప్రతి ఒక్కరికి మాట్లాడే స్వేచ్ఛ ఉంటుందని, అలాగే ఎవరి మనోభావా లనూ కించపరిచే హక్కు లేదన్నారు. వాక్ స్వాతంత్ర్యం పేరుతో వర్మ చేస్తున్న వికట చేష్టలను రాష్ట్ర ప్రభుత్వం నియంత్రించాలని డిమాండ్ చేశారు. వర్మ విషయంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సదస్సులో పాల్గొన్న మహిళలు డిమాండ్ చేశారు. ఐద్వా నేతలతో పాటు ప్రజా సంఘాలకు చెందిన సుంకర పద్మశ్రీ, గంగా భవాని, దుర్గాంబ, స్వరూపరాణి, శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిపై కేసు నమోదు చేయండి

- డీజీపీకి ఎంపీ రాయపాటి ఫిర్యాదు

అమరావతి, ఫిబ్రవరి 22 (మనం ప్రతినిధి): వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిపై కేసు నమోదు చేయాలని టీడీపీ ఎంపీ రాయపాటి సాంబశివరావు కోరారు. గురువారం రాయపాటి తన ప్రతినిధుల ద్వారా ఫిర్యాదును డీజీపీ మాలకొండయ్యకు పంపించారు. ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్ చంద్ర, ఇంటలిజెన్స్ చీఫ్ వెంకటేశ్వరరావులపై విజయసాయి చేసిన వ్యాఖ్యలు బెదిరించేలా ఉన్నాయని ఫిర్యాదులో రాయపాటి పేర్కొన్నారు..

భారత్‌కు మారిషస్ ప్రభుత్వ నోటీసులు


- 50 మిలియన్ డాలర్ల పరిహారం డిమాండ్
- ఇందూ టెక్‌జోన్‌లో నష్టపోయామని వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 22: ఇందూ టెక్‌జోన్ పెట్టుబడుల కేసులో భారత ప్రధానమంత్రితో పాటు పలువురు కేంద్ర మంత్రులకు అంతర్జాతీయ న్యాయస్థానం నోటీసులు పంపింది. ఇందూ టెక్‌జోన్ ప్రతిపాదించిన ఐటీ సెజ్‌లో మారిషస్‌కు చెందిన కరీసా ఇన్వెస్ట్‌మెంట్స్ సంస్థ రూ.115 కోట్ల పెట్టుబడితో 49% వాటా కలిగి ఉంది. అయితే, దీనిపై సీబీఐ.. ఈడీ కేసులు పెట్టడంతో సెజ్‌లో పరిశ్రమలు ఏవీ రాలేదు. దీంతో తాము నష్టపోయామని.. న్యాయం చేయాలని కోరుతూ మారిషస్ ప్రభుత్వం అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. తమకు 50 మిలియన్ డాలర్ల నష్టపరిహారం ఇవ్వాలని కోరింది. ఈ కేసులో కేంద్ర ఆర్థిక, వాణిజ్య, న్యాయ, పట్టణాభివ ద్ధి శాఖల మంత్రులను ప్రతివాదులుగా చేర్చింది. మారిషస్ నోటీసులు పంపిన అంశాన్ని తెలంగాణకు చెందిన టీఎస్‌ఐఐసీ అధికారులు ధ్రువీకరించారు.



సెన్సెక్స్ ఫిబ్రవరి 22 2018


33,819.50 ▼ -25.36



పెరిగినవి	%	తగ్గినవి	%
సన్ ఫార్మా	3.32	డాక్టర్ రెడ్డీస్	-2.19
అదానీ పోర్ట్స్	2.16	ఓఎన్‌జీసీ	-2.05
కోటక్ మహీంద్రా	2.01	పవర్ గ్రిడ్	-1.88
ఇండస్‌ఇండ్	1.86	టాటా మోటార్స్	-1.59
ఎంఎం	1.76	మారుతి సుజుకి	-1.47

నిఫ్టీ ఫిబ్రవరి 22 2018

10,382.70 ▼ -14.75



పెరిగినవి	%	తగ్గినవి	%
సన్ ఫార్మా	2.99	బి.పి.సి.ఎల్	-4.49
అరబిందో	2.78	ఐడియా సెల్యులర్	-2.29
అదానీ పోర్ట్స్	2.12	ఓఎన్‌జీసీ	-2.13
ఎం అండ్ ఎం	1.91	డాక్టర్ రెడ్డీస్	-1.96
ఇండస్‌ఇండ్	1.83	పవర్ గ్రిడ్	-1.91


టాప్ లూజర్స్ 22 ఫిబ్రవరి

33,819.50

పాయింట్లు		%
2121.30	డాక్టర్ రెడ్డీస్	-2.19%
186.20	ఓఎన్‌జీసీ	-2.05%
190.95	పవర్ గ్రిడ్	-1.88%
358.55	టాటా మోటార్స్	-1.59%
8650.40	మారుతి సుజుకి	-1.47%
527.65	యాక్సిస్ బ్యాంకు	-1.41%
2971.00	బజాజ్ ఆటో	-1.24%
160.50	ఎన్‌టీపీసీ	-1.08%
1114.00	ఏసియన్ పెయింట్	-1.03%
416.05	భారతీ ఎయిర్‌టెల్	-0.79%

బి.ఎస్.ఇ సెన్సెక్స్ -25.36

బులియన్ | గత 7 రోజులు



బంగారు ఆభరణాల ఎగుమతులు

నెల	(యూఎస్ డాలర్లు మిలియన్ల్లలో)
జనవరి 2018	655.05
డిసెంబరు	981.76
నవంబరు	996.32
అక్టోబరు	900.73
సెప్టెంబరు	1199.71
ఆగస్టు	689.18
జూలై	411.37
జూన్	436.70
మే	533.51
ఏప్రిల్	497.35
మార్చి	660.56
ఫిబ్రవరి	418.99
జనవరి 2017	392.95

ఆధారం: జి.జె.ఇ.పి.సి

- హైదరాబాద్‌కు ఏఏ స్టేబుల్ రేటింగ్
- దేశంలోనే రెండో నగరంగా రికార్డు
- అట్టహాసంగా ప్రారంభ కార్యక్రమం
- వ్యూహాత్మక రహదారులకోసం బిడ్డింగ్
- ఇన్వెస్టర్ల నుంచి విశేషంగా స్పందన
- తొలి దశలో రూ.200 కోట్ల నిధులు
- దశల వారీగా వెయ్యి కోట్ల సమీకరణ
- అప్పు తెచ్చుకోవడం తప్పుకాదు: మేయర్
- జీహెచ్‌ఎంసీ 'ఏఏ' సాధిస్తుంది: సీఎస్

బీఎస్ఈలో జీహెచ్ఎంసీ

స్టాక్ ఎక్స్ఛేంజిలో బల్దియా లిస్టింగ్..



హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 22(మనం ప్రతినిధి): నిధుల సమీకరణకోసం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్‌ఎంసీ) అధికారికంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి(బీఎస్ఈ)లో నమోదు అయ్యింది. జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన లిస్టింగ్ కార్యక్రమంలో బీఎస్ఈ, ఎస్‌బీఐతోపాటు 9 బిడ్డింగ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సంస్థలు బాండ్ల ద్వారా తొలి విడత రూ.200కోట్ల నిధులను సమీకరించిన విషయం తెలిసిందే. ఈ లిస్టింగ్ కార్యక్రమాన్ని మేయర్ బొంతు రామ్మోహన్.. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, ఆర్థిక, మున్సిపల్ శాఖల ముఖ్య కార్యదర్శులు రామకృష్ణారావు, అరవింద్‌కుమార్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ డా.బి.జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ శాఖ డైరెక్టర్ టీ.కే.శ్రీదేవిలతో కలిసి ప్రారంభించారు. బాండ్ల సేకరణ చేపట్టిన జీహెచ్‌ఎంసీకి ఇన్వెస్టర్ల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని మేయర్ తెలిపారు. హైదరాబాద్ నగరాన్ని సిగ్నల్ ఫ్రీ రహిత నగరంగా చేయడానికి చేపట్టిన వ్యూహాత్మక రహదారుల పథకం(ఎస్ఆర్డీపీ) కోసం ఈ నిధులను వెచ్చించనున్నామని మేయర్ తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణ, ఆదాయ మార్గాల స్థిరత్వం, అంతర్గత వనరుల వృద్ధి, మిగులు నిధులు తదితర అంశాల్లో హైదరాబాద్ నమ్మకమైన పురపాలక సంస్థగా 'ఏఏ' స్టేబుల్ రేటింగ్ సాధించటంతో బాండ్ల జారీ సులువైందన్నారు. దశల వారీగా ఎస్ఆర్డీపీ కోసం వెయ్యి కోట్ల రూపాయలను బల్దియా బాండ్ల రూపంలో సేకరించాలని నిర్ణయించగా మొదటి దశలో 200 కోట్లను సేకరించామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ రవీందర్‌సింగ్, ఖమ్మం మేయర్ రూపాలాల్, నిజాంబాద్ మేయర్ ఆకుల లలిత, బీఎస్ఈ, ఎస్‌బీఐ, జీహెచ్‌ఎంసీ, సహా పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకే..

అప్పు తెచ్చుకునే కార్యక్రమం అట్టహాసంగా చేయాలా? అనే సందేహం కొందరిలో తలెత్తవచ్చు. కానీ అప్పుకూడా అందరికీ పుట్టదని మేయర్ బొంతు రామ్మోహన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. మౌలిక వసతుల కల్పనకోసం అప్పు తెచ్చుకోవటం తప్పుకాదని.. అప్పు కట్టే సామర్థ్యం, ఆర్థిక క్రమశిక్షణ ఉంది గనుకే అభివృద్ధి కోసం నిధులు సేకరిస్తున్నామని రామ్మోహన్ స్పష్టంచేశారు. దేశంలో నాలుగు వేల మున్సిపాలిటీలు ఉంటే.. కేవలం జీహెచ్‌ఎంసీ మాత్రమే ఆర్థిక స్థిరత్వంలో 'ఏఏ' నిలకడ సాధించిందని గుర్తుచేశారు. సేకరించిన నిధులతోపై వంతెనలు, ఆకాశ మార్గాలు, అండర్ పాస్‌ల నిర్మాణం వేగంగా పూర్తి చేస్తామని ధీమా వ్యక్తంచేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వ్యూహాత్మక రహదారి పథకం పనులు ఇకపై మరింత వేగం పుంజుకోనున్నాయని మేయర్ అన్నారు. దేశంలోనే పుణె నగరం తర్వాత బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి ద్వారా ఎలక్ట్రానిక్ బిడ్డింగ్‌తో జీహెచ్‌ఎంసీ బాండ్ల ద్వారా నిధులు సమీకరించుకుంటోందని పేర్కొన్నారు.

బల్దియాకు జాతీయ గుర్తింపు: కమిషనర్

ప్రభుత్వ సంస్థలు అప్పు తీసుకోవటాన్ని చాలామంది తప్పుగా భావిస్తారని, కానీ స్టాక్ ఎక్స్ఛేంజి బాండ్ల జారీ ద్వారా నిధులు సమీకరించటం పరపతితో కూడుకున్నదని జీహెచ్‌ఎంసీ కమిషనర్ పేర్కొన్నారు. ఇందుకు జీహెచ్‌ఎంసీ జాతీయ గుర్తింపు సాధించిందని కమిషనర్ డాక్టర్ బి.జనార్ధన్ రెడ్డి అన్నారు. పన్నుల వసూళ్లు, ఆదాయ మార్గాలను పెంచుకోవటం, పటిష్టమైన ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకోవటం ద్వారానే బాండ్ల జారీ సాధ్యమైందని వ్యాఖ్యానించారు. దేశంలోని స్థానిక సంస్థలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలన్న ప్రధాని మోదీ పిలుపుమేరకు జీహెచ్‌ఎంసీ స్వయంగా నిధుల సమీకరణ వైపు మొగ్గు చూపాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రముఖ రేటింగ్ సంస్థలు కేర్, ఇండియా రేటింగ్.. జీహెచ్‌ఎంసీ ఆర్థిక పరిపుష్టి, ఆదాయ మార్గాలకుగాను చక్కని ఆర్థిక క్రమశిక్షణ కింద మంచి రేటింగ్ ఇవ్వటంతో నిధుల సమీకరణ సులువైందన్నారు. ఈ నెల 14న ముంబైలో నిర్వహించిన ఎలక్ట్రానిక్ బిడ్డింగ్‌లో కేవలం నిమిషాల వ్యవధిలోనే 452 కోట్ల రూపాయల వరకు బిడ్డర్లు ముందుకు రాగా తొలిదశగా 200 కోట్లు మాత్రమే జీహెచ్‌ఎంసీ సేకరించిందని జనార్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ స్టేట్ బ్యాంక్ కార్ప్స్, స్పా క్యాపిటల్ లిమిటెడ్, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి ప్రతినిధులతో పాటు స్టాండింగ్ కమిటీ సభ్యులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఆదర్శం: సీఎస్ జోషి

బాండ్ల ద్వారా నిధుల సేకరణతో దేశంలోనే హైదరాబాద్ మహానగర పాలక సంస్థ సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని, స్థానిక సంస్థలు ప్రభుత్వాలపై ఆధారపడకుండా సొంతగా నిధులు సమకూర్చుకోవటం మిగతా మున్సిపాలిటీలు, స్థానిక సంస్థలకు ఆదర్శమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి ప్రశంసించారు. ప్రస్తుతం రేటింగ్ సంస్థల అంచనా ప్రకారం డబుల్ ఏ స్టేబుల్ స్థాయిని సాధించిన జీహెచ్‌ఎంసీ భవిష్యత్తులో ట్రిబుల్ ఏ పాజిటివ్ సాధించాలని కోరుకుంటున్నట్లు సీఎస్ తెలిపారు. బాండ్ల సేకరణ ద్వారా జీహెచ్‌ఎంసీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి లిస్టింగ్‌లో నమోదు కావడం చరిత్రాత్మక ఘట్టమని జోషి అభినందించారు.

39 లక్షల కోట్లు అవసరం: ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి

దేశంలోని 4,041 మున్సిపాలిటీల్లో మెరుగైన పౌర, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.39 లక్షల కోట్లు అవసరమని అహ్లూవాలియా కమిటి పేర్కొందని, ఇంత భారీ స్థాయిలో నిధులను ఏ ప్రభుత్వాలుకూడా సమకూర్చే పరిస్థితి లేనందువల్ల అంతర్గత వనరులను పెంపొందించుకోవాలని ఆర్థిక శాక ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు. స్థానిక సంస్థల ఆర్థిక స్తోమతపై అంతగా నమ్మకం ఉండదన్న మాటను వమ్ముచేస్తూ బాండ్ల ద్వారా జీహెచ్‌ఎం నిధులు సేకరించుకోవడం గొప్ప విషయమన్నారు.

సాంకేతికతో ఆదాయ పెంపు: మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి

దేశంలో రోజురోజుకు పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో మున్సిపాలిటీలు స్వయం ఆర్థిక వనరుల సేకరణకు ప్రాధాన్యమివ్వాలని, ఇందుకుగాను ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్ కుమార్ అన్నారు. అంతర్గత లోపాలను సరిదిద్దుకోవడం, పన్నుల వ్యవస్థను మరింత పటిష్టవంతంగా నిర్వహించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం తదితర కార్పొరేషన్లలోనూ అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. బీఎస్ఈలో లిస్టింగ్ అయిన రెండో భారత నగరంగా హైదరాబాద్ చరిత్రకెక్కడం గొప్ప విషయమని, దేశంలోని ఇతర నగరాలకు జీహెచ్‌ఎంసీ ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మెట్రో రెండో దశను కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్టు అర్వింద్ కుమార్ తెలిపారు.

మదుపర్లకు మూసుకుపోతున్న దారులు!

న్యూఢిల్లీ: మదుపర్లకు ఇది మంచి సమయంలా కనిపించడం లేదు. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) గత బుధవారం రిటైర్మెంట్ పొదుపు ప్రావిడెంట్ ఫండ్‌పై విధించే వడ్డీ రేటును 8.65 శాతం నుంచి 8.55 శాతానికి తగ్గించేసింది. నిజానికి 2015-16లో 8.8 శాతం ఉన్న వడ్డీ రేటును ఆ మరుసటి సంవత్సరంలో గణనీయంగా తగ్గించారు. ప్రావిడెంట్ ఫండ్‌లో సుమారు అయిదు కోట్ల మంది సభ్యులున్నారు. ఈ ధోరణి గురించి ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు కానీ, మదుపర్లకు మాత్రం ఇది ఆందోళన కలిగించే సమస్యే. బ్యాంక్ డిపాజిట్ రేట్లకు తగ్గట్టుగా చిన్న పొదుపు మొత్తాల రేట్లను తగ్గించాలనేది ప్రభుత్వ విధానం. బ్యాంకులు రుణాలపై వేసే వడ్డీ రేట్లు తగ్గాలంటే ముందుగా డిపాజిట్ రేట్లను తగ్గించాల్సి ఉంటుంది. లేని పక్షంలో బ్యాంకులకు వడ్డీల ద్వారా వచ్చే లాభాలు బాగా తగ్గిపోతాయి. డిపాజిటర్లకు ఎక్కువ చెల్లించి రుణాలపై తక్కువ సంపాదించాల్సిన పరిస్థితి ఎదురవుతుంది.

డిపాజిట్ రేట్లను తగ్గించడానికి చిన్న పొదుపు మొత్తాలకు వచ్చే వడ్డీ రేట్లను తగ్గించాల్సి ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. అందుకనే ప్రావిడెంట్ ఫండ్ వడ్డీ రేట్లను తగ్గించింది. అయితే, వాస్తవంలో ఈ తర్కం ఆశించిన స్థాయిలో పని చేయడం లేదు. బ్యాంకు డిపాజిట్ రేట్లు, చిన్న మొత్తాల పొదుపు రేట్లు తగ్గాయి (ఎస్‌బీఐ గత ఏడాది నవంబర్‌లో 6.5 శాతం ఉన్న చిన్నమొత్తాల పొదుపు రేటును 6.25 శాతానికి తగ్గించింది) కానీ, (ఇతర చిన్న పొదుపు మొత్తాల పథకాలన్నీ 7.3 శాతం నుంచి 8.3 శాతం వరకు వడ్డీ ఇస్తున్నాయి) రుణాలపై విధిస్తున్న వడ్డీ రేటు అందుకు తగ్గట్టుగా తగ్గేలా కనిపించడం లేదు. ఆర్‌బీఐ తన ద్రవ్య విధాన ప్రతిపాదనల ద్వారా ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ అది మాత్రం సానుకూలపడడం లేదు.

ద్రవ్యోల్బణంతో లింకు!



పైగా, 2018లో కూడా ద్రవ్యోల్బణం రేటు ఇదే విధంగా కొనసాగే పక్షంలో బ్యాంకుల రేట్లు పెరిగే ప్రమాదం కూడా ఉంది. ఆర్‌బీఐ కూడా తన కీలక రేట్లను పెంచక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. రుణాలపై ఇచ్చే రేట్లను పెంచే విషయంలో, రేట్లపై కోత విధించే విషయంలోనూ బ్యాంకులు తమకు అనుకూలంగానే రేట్లు మారేచ అవకాశం ఉంది. మొత్తానికి దీనంతటితో అవస్థలు పడేది మాత్రం చిన్న స్థాయి మదుపరే. ముఖ్యంగా తమ జీవిత కాల పొదుపు మొత్తాల నుంచి సరైన ప్రతిఫలం కోసం ప్రయత్నించే రిటైర్డ్ ఉద్యోగులకు మాత్రం ఇది తీరని దెబ్బ. మరీ దారుణమేమిటంటే, రిటైరైన ఉద్యోగులు తమ పొదుపు మొత్తాలను ఇతరత్రా మదుపు చేయడానికి ప్రయత్నించినా ఆ దారులు కూడా అంత ఆకర్షణీయంగా లేవు. స్థిరాస్తుల మార్కెట్ పరిస్థితి కూడా ఏమంత బాగా లేకపోవడంతో వారు తమ పొదుపు మొత్తాలను రియల్ ఎస్టేట్‌లో పెట్టడం కూడా సాధ్యం కావడం లేదు.

ఇక బిల్డర్లు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల పరిస్థితి కూడా ఏమంత ఆశాజనకంగా లేదు. నోట్ల రద్దు తర్వాత నల్లధన ప్రవాహం తగ్గడంతో వారి ప్రాజెక్టులేవీ ఒక పట్టాన పూర్తి కాక, వారు ఆందోళనలో ఉన్నారు. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టినవారు ప్రతిఫలాల కోసం చాలా కాలం పాటు ఎదురు చూడాల్సి వస్తోంది. దీర్ఘకాలిక మూలధన లాభాలపై (ఎల్‌టిసిజి) పన్ను విధించడంతో చిన్న మొత్తాల పొదుపర్లకు ఈక్విటీ మార్కెట్లు కూడా అంత ఆకర్షణీయంగా కనిపించడం లేదు. దీర్ఘకాల పెట్టుబడిదార్లపై ఇదేమంత ప్రభావం చూపించకపోవచ్చు కానీ, ఏడాదిలో లాభాలు ఆశించే చిన్న మదుపర్లకు మాత్రం ఇది ఆశనిపాతమే అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ద్రవ్యోల్బణంలోని హెచ్చు తగ్గులను బట్టి భవిష్యత్తులో బ్యాంకు రుణాల రేట్లు మారే అవకాశం ఉంది. వర్షపాతం సరిగ్గా లేని పక్షంలో ద్రవ్యోల్బణం పెరగడం ఖాయం. ఫలితంగా రుణ రేట్లపై ఒత్తిడి ఎక్కువవుతుంది. మొత్తానికి చిన్న మదుపర్లకు ఇది మంచి సమయం కాదనే అనిపిస్తోంది.

నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

ముంబయి: ప్రపంచవ్యాప్తంగా మదుపర్లలో తాజాగా వడ్డీ రేట్ల పెంపు అంచనాలు పెరిగాయి. ఇవి ఆందోళనలకు తెరతీయడంతో స్టాక్స్‌లో అమ్మకాలు ఊపందుకున్నాయి. అటు అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ జనవరిలో నిర్వహించిన పాలసీ సమావేశం, ఇటు రిజర్వ్ బ్యాంక్ ఫిబ్రవరి తొలి వారంలో చేపట్టిన పరపతి సమీక్షల వివరాలు మినిట్స్ ద్వారా వెల్లడయ్యాయి. ఫెడ్ ఓపెన్ మార్కెట్ కమిటీ ఇకపై వడ్డీ రేట్ల పెంపు వైపు దృష్టిసారించినున్నట్లు సంకేతమివ్వడంతో అమెరికా స్టాక్ మార్కెట్లు పతనం కాగా.. మానిటరీ పాలసీ కమిటీ రేట్ల తగ్గింపు బాటను వీడి పెంపుదల బాటలో సాగేందుకు ఆసక్తి చూపడంతో దేశీయంగానూ అమ్మకాలదే పైచేయిగా నిలిచింది. దీంతో మార్కెట్లు ఆద్యంతమూ నష్టాల మధ్యే కదిలాయి. తొలుత 125 పాయింట్ల వరకూ క్షీణించిన సెన్సెక్స్ చివరికి రికవర్ అయి, 25 పాయింట్ల స్వల్ప నష్టంతో 33,819 వద్ద నిలవగా.. నిఫ్టీ 14.75 పాయింట్లు తక్కువగా 10,382 వద్ద స్థిరపడింది.

ఆందోళనకరంగా మరో టెలికాం సంస్థ

- ఎయిర్‌సెల్ మూతపడనుందా?



చెన్నై: రుణభారంతో మూతబడుతున్న టెలికాం సంస్థల జాబితాలో తాజాగా ఎయిర్‌సెల్ కూడా చేరబోతోంది. సుమారు రూ. 15,500 కోట్ల రుణాలు పేరుకుపోవడంతో కంపెనీ త్వరలో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముందు దివాలా పిటిషన్ దాఖలు చేయనుంది. మలేసియాకి చెందిన మాతృ సంస్థ మ్యాక్సిస్ గతంలో ఎయిర్‌సెల్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చినప్పటికీ.. ఆ తర్వాత వెనక్కి తగ్గినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రూ. 15,500 కోట్ల రుణాల పునర్వ్యవస్థీకరణ కోసం గతేడాది సెప్టెంబర్ నుంచి బ్యాంకులతో ఎయిర్‌సెల్ చర్చలు జరుపుతున్నప్పటికీ.. ఫలితం కనిపించలేదని తెలిసింది. వ్యాపారాన్ని నిర్వహించేందుకు కంపెనీ దగ్గర ప్రస్తుతం కనీస స్థాయిలో కూడా నిధులు లేవని, ఈ వారాంతంలో ఉద్యోగుల జీతాలను చెల్లించడం కూడా నిలిపివేసే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వివరించాయి. కంపెనీ సీఈవో సైతం ఉద్యోగులకు ఒక మెయిల్ రాశారని సమాచారం. అందులో కంపెనీ పరిస్థితి మరింత దిగజారేందుకు సైతం అవకాశమున్నట్లు ఉద్యోగులను హెచ్చరించారని టెలికాంటాక్ రిపోర్ట్ నివేదించింది.

మరింత సులువుగా అమ్మకాల రిటర్నుల ప్రక్రియ

- జీఎస్టీ రిటర్నులు మరింత సులభతరం




న్యూఢిల్లీ: జీఎస్టీ రిటర్నులకు సంబంధించి చిన్న వ్యాపారులు సతమతమవుతున్న తరుణంలో జీఎస్టీ నెట్వర్క్ పన్ను రిటర్నులను సులభతరం చేసింది. జీఎస్టీ ఫైలింగ్‌కు సంబంధించి ప్రతి వ్యాపారి జీఎస్టీఆర్ 1,2,3లను నెలలో ఒకసారి సమర్పించాలి. అయితే వీటిల్లో ఏవైనా సమస్యలున్న వారు చివర్లో జీఎస్టీఆర్3బీని ఎంచుకుంటారు. ఇంతకు ముందు దీనిలో ఎన్నో వివరాలు ఇవ్వాల్సి ఉండగా, ఇప్పుడు అందులో వివిధ ఆప్షన్లు ఇవ్వడం ద్వారా అవసరమైన వివరాలు మాత్రమే నమోదు చేసేలా మార్పులన్నీ చేశారు. దీంతో నిమిషాల వ్యవధిలో జీఎస్టీఆర్ 3బీ దాఖలు ప్రక్రియ పూర్తవుతుంది.

ఇప్పుడు జీఎస్టీఆర్-3బీలో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ ఎంత ఉందో సులువుగా తెలుసుకోవచ్చు. రిటర్నుల ఫారంలో నిల్వ ఎంత ఉందో అప్పటికప్పుడే ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చని జీఎస్టీఎన్ సీఈవో వెల్లడించారు. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను ఉపయోగించే విషయంలో పన్ను చెల్లింపుదార్లు అయోమయంలో అర్థం కాక తప్పు వివరాలను నమోదు చేస్తున్నారు. దీంతో ఐటీసీ మినహాయించగా, నగదు రూపంలో ఇంకా ఎంత చెల్లించాలనే విషయంలో సమస్య ఏర్పడుతోంది.

ప్రస్తుతం యూజర్ ఇంటర్ ఫేస్ మెరుగుపరచడం, వెబ్‌సైట్లో అవసరమైన మార్పులు చేయడం ద్వారా జీఎస్టీఆర్-3బీ దాఖలు పరచడం సులభతరం అయినట్లు జీఎస్టీఎన్ సీఈవో ప్రకాశ్ కుమార్ వెల్లడించారు. ఇందులో భాగంగా ఒకటే చోట అవసరమైన మొత్తం సమాచారం కనిపించేలా ఏర్పాటు చేశామని తెలిపారు. తాజా మార్పుల తర్వాత రిటర్నులు సమర్పణ చేసే వారందరికీ తప్పులు లేకుండా, వేగంగా, సమయం ఆదా అయ్యేలా ఉంటుందని కుమార్ చెప్పారు.

నూతన అప్‌డేట్స్‌తో దడ పుట్టిస్తున్న టాటా



ముంబయి: దివాలా తీసే పరిస్థితుల్లో ఉన్నప్పుడు టాటా మోటార్స్ విడుదల చేసిన టియాగో హ్యాచ్‌బ్యాక్ ఇప్పుడు టాటాకు బెస్ట్ సెల్లింగ్ కారుగా నిలిచింది. ఇంపాక్ట్ డిజైన్ ఫిలాసఫీ ఆధారంగా రూపొందించిన టియాగో హ్యాచ్‌బ్యాక్, టిగోర్ కాంపాక్ట్ సెడాన్ రెండూ కూడా మంచి ఫలితాలు సాధిస్తున్నాయి. ఇదే జోరు మీద ఉన్న టాటా కస్టమర్లను ఆకట్టుకునేందుకు టియాగో, టిగోర్ కార్లలో మరో కొత్త కలర్ స్కీమ్ పరిచయం చేసింది. అంతే కాకుండా టాటా వీటిలో కొన్ని మార్పులు చేర్పులు కూడా చేసింది. టాటా టియాగో, టిగోర్ కార్లలో సరికొత్త టైటానియం గ్రే కలర్‌ను పరిచయం చేసింది. అంతే కాకుండా ఈ రెండు కార్లు ఇది వరకు లభించే స్ట్రైకర్ బ్లూ రంగును తొలగిస్తున్నట్లు కూడా ప్రకటించింది. టాటా మార్కెట్ విలువను పెంచడానికి దోహదపడిన ఈ రెండు కార్లలో అవే పెట్రోల్, డీజల్ ఇంజన్‌లు ఉన్నాయి. సాంకేతికంగా టియాగో, టిగోర్ కార్లలో ఉన్న 1.2-లీటర్ రివట్రాన్ పెట్రోల్ ఇంజన్ గరిష్టంగా 84బిహెచ్‌పి పవర్, 114ఎన్ఎమ్ గరిష్ట టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇది 5-స్పీడ్ మ్యాన్యువల్, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌లో లభ్యమవుతోంది.

ఈ-కామర్స్ విస్తరణ వైపు వాల్‌మార్ట్ అడుగులు

న్యూయార్క్ : రాబోయే రోజుల్లో వినియోగదారులకు మరింత చేరువయ్యే దిశగా ప్రముఖ గొలుసుకట్టు దుకాణాల కంపెనీ వాల్‌మార్ట్ అడుగులు వేస్తోంది. ఇందుకోసం తన వెబ్‌సైట్లో ఫ్యాషన్, గృహోపకరణాల అమ్మకాలను చేరుస్తూ కొన్ని మార్పులు చేర్పులు చేయనున్నట్లు గురువారం వెల్లడించింది. వచ్చే సంవత్సరం నుంచి అందుబాటులోకి రానున్న వెబ్‌సైట్ ద్వారా వినియోగదారుల అభిరుచికి తగ్గట్లు పచారీ సామాన్లు, ఆర్థిక లావాదేవీలు, ఫ్యాషన్ ఉత్పత్తులు, గృహోపకరణాలు చేర్చనుంది. ఈ నేపథ్యంలో ప్రముఖ వస్త్ర ఉత్పత్తుల కంపెనీ లార్డ్ అండ్ టేలర్ నుంచి కొన్ని ఉత్పత్తులను సమీకరించుకొని అమ్మకాలు జరపనుంది. వినియోగదారులు తమ అభిరుచికి తగ్గట్లుగా ఎలాంటి మార్పులు కోరుకుంటున్నారో తెలుసుకునేందుకు కూడా ఇందులో అవకాశం కల్పించనుంది. సులభంగా, వేగంగా అందరికీ నప్పే విధంగా తమ ఈ-కామర్స్ వెబ్‌సైట్లో మార్పులు చేయడమే తమ ముందున్న లక్ష్యమని కంపెనీ సీనియర్ ఉపాధ్యక్షుడు ఆంటొనీ సాహో పేర్కొన్నారు. ఇప్పటికే ఈ-కామర్స్ రంగంలో దూసుకుపోతున్న అమెజాన్‌ను లక్ష్యంగా చేసుకొని వాల్‌మార్ట్ ఈ ముందడుగు వేస్తోంది. గృహోపకరణాల్లో అమెజాన్ సొంత బ్రాండ్ల విక్రయంతో తనదైన ముద్రవేసింది. వేఫెయిర్ సైతం ఫర్నిచర్ విక్రయాల్లో దూసుకుపోతున్నా అమెజాన్‌కు గట్టి పోటీనివ్వలేకపోతోంది.

మనం టెక్నాలజీ
శుక్రవారం, 23 ఫిబ్రవరి 2018
www.manamnews.com



స్మార్ట్ ఫోన్ రూపంలో శక్తిమంతమైన కెమెరా నేడు అందుబాటులోకి వచ్చింది. దీంతో వేడుకలు, పిల్లల ఆటపాటలు, బయటకు వెళితే అరుదైన దృశ్యాలను వీడియో తీసే అలవాటు పెరుగుతోంది. అయితే, చాలా మందికి వీడియోలను నాణ్యంగా, మెరుగ్గా తీయడం ఎలాగన్నది తెలియదు. మరి అద్భుతంగా వీడియోలను షూట్ చేయాలంటే తెలుసుకోవాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి...

మొబైల్ వీడియో

కెమెరా గ్యాడ్జెట్స్

స్మార్ట్ ఫోన్లు పూర్తి స్థాయి కెమెరా గ్యాడ్జెట్స్ కాకపోయినప్పటికీ, ప్రీమియం ఫోన్లలో దాదాపు చాలా ఆప్షన్స్ ఉంటున్నాయి. భిన్న రకాల రిజల్యూషన్, ఫ్రేమ్ రేట్స్ తో వస్తున్నాయి. 1080 ఏ 30 ఫ్రేమ్స్ ఇది స్టాండర్డ్ రిజల్యూషన్, ఫ్రేమ్ రేట్ కాంబినేషన్. ప్రతీ సెకనుకు చూపించే ఫ్రేమ్స్ (ఎఫ్ పీఎస్) ఎక్కువగా ఉంటాయి. 1080 ఏ 24 ఫ్రేమ్స్, 1080 ఏ 60 ఫ్రేమ్స్ అన్నవి ప్రతీ సెకనుకు కెమెరా బంధించే దృశ్యాలు. 60 ఎఫ్ పీఎస్ లేదా అంతకంటే ఎక్కువ ఎఫ్ పీఎస్ తో (120 లేదా 240 ఎఫ్ పీఎస్) తీసే వీడియో స్లో మోషన్ తో (నిదానంగా) ఉంటుంది. 120 ఎఫ్ పీఎస్ అన్నది సాధారణ వేగం కంటే ఐదు రెట్లు తక్కువ. అలాగే, 240 ఎఫ్ పీఎస్ అయితే 10 రెట్లు నిదానంగా ఉంటుంది. కెమెరా సెట్టింగ్స్ కు వెళ్లి అక్కడ స్పీడ్‌ను తగ్గించుకోవచ్చు, పెంచుకోవచ్చు.



4కే వీడియో

ప్రీమియం స్మార్ట్ ఫోన్లలో 4కే వీడియో తీసే ఆప్షన్ కూడా ఉంటోంది. ఇందుకోసం సెట్టింగ్స్ కు వెళితే ఈ ఆప్షన్ ఉన్నదీ, లేనిదీ తెలుస్తుంది. 3840-2160 రిజల్యూషన్‌తో షూట్ చేసుకోవచ్చు. అయితే, చాలా మంది 4కే వీడియో ఆప్షన్ ఎంచుకోరు. ఎందుకంటే ఈ స్థాయి అధిక రిజల్యూషన్ వీడియోలను చూపించే స్క్రీన్లు తక్కువే. అయితే, 4కేలో షూట్ చేస్తున్నారంటే అవి భవిష్యత్తు ఆధారిత వీడియోలను తీస్తున్నట్టు. సమీప భవిష్యత్తులో అన్ని రకాల స్క్రీన్లు ఈ వీడియోలను చూపించే సామర్థ్యాన్ని కలిగి ఉండొచ్చు. 4కే లో తీసే వీడియోలో వివరాలు చాలా ఎక్కువగా ఉంటాయి. అయితే, సాధారణ వీడియోల కంటే ఎన్నో రెట్లు అధికంగా స్టోరేజీ స్పేస్ తీసుకుంటాయి.

4కే అంటే...?

వీడియో రిజల్యూషన్ సూచిక. ఇది అధిక రిజల్యూషన్. అంటే ఎక్కువ పిక్సల్స్ ఉంటాయి. పిక్సల్స్ ఎక్కువగా ఉంటే చిత్రాలు స్పష్టంగా ఉంటాయి. హెచ్ డీ వీడియో రిజల్యూషన్ 1080 పిక్సల్స్ తో ఉంటుంది. 4కే దానికి నాలుగు రెట్లు అధికం. ప్రస్తుతానికి ఇదే అధిక రిజల్యూషన్. ప్రీమియం ఫోన్లలో ఈ ఆప్షన్ ఉంటోంది.



జూమ్ వీడియో

చాలా ఫోన్లలో ఉంటున్నది డిజిటల్ జూమ్. ఇది ఎందుకూ ఉపయోగం లేని ఫీచర్. దీనివల్ల వీడియో నాణ్యత దారుణంగా వస్తుంది. దీని కంటే కూడా దగ్గర్నుంచి వీడియో తీసుకోవడం నయమన్నది నిపుణుల సలహా. ఎందుకంటే డిజిటల్ జూమ్ అంటే కనిపిస్తున్న దృశ్యాన్ని పెద్దది చేయడం. దాంతో రిజల్యూషన్ చెదిరిపోతుంది. కెమెరా లెన్స్ ఆప్టికల్ జూమ్ విధానంలో ఫోన్‌కు, సబ్జెక్ట్‌కు మధ్య దూరాన్ని తగ్గిస్తుంది. దీంతో క్లారిటీ దెబ్బతినదు.

ఫ్లాష్‌తో క్వాలిటీ

వీడియోలోని వ్యక్తుల చర్మం పసుపురంగులో ఉండడం, ఎరుపురంగుతో కూడిన కళ్ల ఛాయలు, బ్యాక్ గ్రౌండ్ నలుపుతో ఉండడం గమనించే ఉంటారు. ఇవి ఫ్లాష్ కారణంగా వచ్చినవే. కొన్ని స్మార్ట్ ఫోన్లలో ఫ్లాష్ కోసం ఏర్పాటు చేసే ఎల్ ఈడీ లైట్లు చాలా బ్రైట్ గా ఉంటున్నాయి. ఇవి కొన్ని సందర్భాల్లో కలర్ టెంపరేచర్‌ను మార్చేస్తాయి. ఫ్లాష్‌కు బదులు ఇతర లైటింగ్‌ను ఉపయోగించుకోవడం నయం. సరైన వెలుగు అన్నది కెమెరాపై చాలా ప్రభావమే చూపిస్తుంది. ఎందుకంటే స్మార్ట్ ఫోన్ కెమెరాలలో ఇమేజ్ సెన్సార్లు, లెన్స్‌లు చిన్నవిగానే ఉంటాయి. కనుక సరిపడా వెలుగు స్మార్ట్ ఫోన్ వీడియోలైనా, ఫొటోలకైనా ప్రాణవాయువు వంటిది. అందుకే వీడియో తీసే సమయంలో సరిపడా వెలుగు ఉండేలా చూసుకోవాలి. దీంతో వీడియో ఫుటేజీలో షేడ్స్ లేకుండా ఉంటుంది. అలాగే, లైటింగ్ వచ్చే సోర్సెస్ వైపు కెమెరా డైరెక్షన్ ఉంచరాదు.

ఇమేజ్ స్టెబిలైజేషన్

ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ ఫీచర్ లేటెస్ట్ ఫోన్లలో చాలా వాటిలో ఉంటోంది. ఫోన్లోని గైరోస్కోప్, యాసిలరోమీటర్ ఇచ్చే సమాచారం ఆధారంగా కెమెరా ఆప్టికల్స్ ఫోన్ కదలికలను పసిగడుతుంది. దీంతో వీడియో తీస్తున్న సమయంలో చేయి కదిలినా, నడుస్తూ, కదులుతూ ఉన్న సమయంలో వీడియో తీస్తుంటే ఆ ప్రభావాన్ని వీడియోపై పడనీయకుండా ఇమేజ్ కదలికలను ఫోన్ నియంత్రిస్తుంది. డిజిటల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ అనే ఆప్షన్ కూడా ఉంట్నుంది. ఇది ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ మాదిరిగానే ఫోన్ షేకింగ్ ను గుర్తించి నిలకడగా ఉండేలా చూస్తుంది. అయితే, డిజిటల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ లో వీడియోను కదలకుండా ఉండాలంటే ఇమేజ్ నాణ్యతను త్యాగం చేయాల్సి వస్తుంది. ఈ తేడా తెలుసుకోవాలంటే ఒకే ఇమేజ్ ను డిజిటల్ ఇమేజ్ స్టెబిలైజేషన్ ఆన్ చేసి, ఆన్ చేయకుండా తీయాలి. వీడియో తీసే సమయంలో రెండు చేతులతో ఫోన్‌ను పట్టుకుని బాడీకి దగ్గరగా ఉంచుకోవడం ద్వారా షేకింగ్‌ను చాలా వరకు దూరం చేయవచ్చు. అలాగే, ఫోన్ తో షేకింగ్ లేకుండా నిలకడైన వీడియో తీసేందుకు ట్రైపాడ్, క్లాంప్, స్టెబిలైజర్ రింగ్స్ వంటి పరికరాలను వాడొచ్చు. లెన్స్ ఎంత శుభ్రంగా ఉన్నాయనేది సాధాణంగా పట్టించుకోరు. లెన్స్ ను వీడియో తీయడానికి ముందు క్లీన్ చేసుకోవాలి. వీడియో క్లారిటీకి ఇది కీలకం.





దగ్గరగా, హారిజాంటల్‌గా!

సబ్జెక్ట్ (వీడియో తీయాలనుకుంటున్న అంశం)కు దగ్గరగా వెళ్లి వీడియో తీయడం వల్ల చిత్రాల నాణ్యత మెరుగ్గా వస్తుంది. డిజిటల్ నాయిస్ తక్కువగా ఉంటుంది. ఫోన్ చక్కగా ఫోకస్ చేయడానికి వీలుంటుంది. అలాగే, ఆడియో క్యాప్చరింగ్ కూడా మెరుగ్గా ఉంటుంది. ఇక వీడియోను ఫోన్ ను అడ్డంగా (హారిజాంటల్) పట్టుకుని తీయాలి. నిలువుగా తీయడం వల్ల వీడియో చూసేందుకు సౌకర్యంగా ఉండదు. సబ్జెక్ట్ వైడ్‌గా ఉండదు. ఇతర స్క్రీన్లలో వీడియో ప్లే చేసినప్పుడు చూసేందుకు అనువుగా ఉండాలంటే అది హారిజాంటల్ మోడ్‌లో ఉండేలా చూసుకోవాలి. యూట్యూబ్ లో ఏ వీడియోను గమనించినా అది హారిజాంటల్ గానే ఉంటుంది. మీరు తీసే వీడియోలు వాటితో ఇమిడిపోవాలంటే హారిజాంటల్‌గా తీయడమే సరైనది.

స్లో మోషన్ మోడ్

ప్రీమియం ఫోన్లలో 4కేతోపాటు స్లో మోషన్ వీడియో ఆప్షన్ కూడా ఉంటోంది. కొన్ని రకాల సీన్లకు ఇది బాగుంటుంది. అయితే, స్లో మోషన్ వీడియోలకు వెలుగు తగినంత తప్పనిసరి. వీడియోస్లో మోషన్‌లో ఉందంటే ఎఫ్ పీఎస్ అధికంగా ఉంటుంది. అధిక ఎఫ్ పీఎస్ వల్ల ఇమేజ్ రిజల్యూషన్ తక్కువ అవుతుందన్నవిషయం గుర్తు పెట్టుకోవాలి.


ఆడియో రికార్డింగ్

వీడియోలో భాగంగా ఆడియో రికార్డింగ్ స్పష్టంగా ఉండేలా చూసుకోవాలి. ఫోన్లలో ఇన్ బిల్ట్ గా ఉండే మైక్రో ఫోన్ వాయిస్ ను బాగా గ్రహించలేకపోతే ఫోన్‌ను వాయిస్‌కు దగ్గరగా ఉండేలా చూసుకోవాలి. లేదా విడిగా ఎక్స్ టర్నల్ ప్రొఫెషనల్ మైక్రోఫోన్ వాడుకోవడం మంచిది.

వీడియో కంప్రెస్ అవకుండా!

వీడియోను టెక్స్ట్ ద్వారా పంపాలనుకుంటే చాలా వరకు స్మార్ట్ ఫోన్లు ఫైల్ సైజ్‌ను కంప్రెస్ చేస్తాయి.


దీంతో క్వాలిటీ తగ్గిపోతుంది. కనుక కెమెరా సెట్టింగ్స్‌లో వీడియోను అధిక క్వాలిటీకే సెట్ చేసుకోవాలి. దాంతో ఫైల్ కంప్రెస్ అవకుండా ఉంటుంది. దీనివల్ల వీడియో ఫైల్ అధిక స్పేస్ తీసుకుంటుంది. కావాలనుకుంటే తర్వాత ఎడిట్ చేసుకోవచ్చు.



ఇదే ఎయిర్ ట్యాక్సీ!

ఇద్దరు ప్రయాణించేలా రెండు సీట్లతో ఎగిరే ఎయిర్ ట్యాక్సీ ఇది. దీనికి పైలట్ అవసరం లేదు. యాప్ సహాయంతో నడుస్తుంది. యాప్‌లో బుక్ చేసుకొని దగ్గర్లోని వోలోపోర్ట్‌కు వెళ్తే అక్కడ అందుబాటులో ఉంటుంది. ఎంచక్కా ఎక్కి ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్లిపోవచ్చు. జీపీఎస్ ద్వారా దీని ప్రయాణం సాగుతుంది. విడ్డూరంలా ఉంది గానీ.. భద్రత మాటేంటి? అనే సందేహం అక్కర్లేదు. భద్రతా పరమైన అన్ని చర్యలూ చేపడుతున్నారు. అత్యవసర సమయంలో రెండు ఎయిర్ బెలూన్లతో ప్రయాణం సాగించొచ్చు. ఎయిర్ ట్యాక్సీల రూపకల్పనకు ఉబర్ సంస్థ నాసాతో ఒప్పందం చేసుకొంది కూడా. అంతేకాదు... ఫ్రెంచ్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇప్పటికే ప్రొటోటైప్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను రూపొందిస్తోంది. దీనికి వాహన్ అని నామకరణం చేశారు. దీన్ని 2020 నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని యోచిస్తోంది. మరోవైపు దుబాయ్ ప్రభుత్వం ఇప్పటికే చైనాతో కలిసి ప్రయోగాలు చేసింది. ఎహెంగ్ అనే డ్రోన్ తరహా ఎయిర్‌ట్యాక్సీని రూపొందించింది. ఇందులో ఒక్కరే ప్రయాణించడానికి వీలుంది. వోలోకాప్టర్‌లో ఇద్దరు వెళ్లవచ్చు. అమెరికా తయారుచేస్తున్న ఎయిర్‌ట్యాక్సీలో 4 నుంచి 6 మంది వరకూ వెళ్లే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

నాజూకు ల్యాపీ



స్మార్ట్ ఫోన్లే కాదు. ల్యాపీలు కూడా తెరల తీరుని ఆధునికంగా మార్చుకుంటూ ముందుకొస్తున్నాయి. కావాలంటే 'అసుస్ వివోబుక్ ఎస్14' ల్యాపీని చూడండి. 14.8ఎంఎం మందంతో నాజూకుగా తీర్చిదిద్దారు. చూడ్డానికి 13 అంగుళాల సైజు ల్యాప్‌టాప్‌లా కనిపించినా... అంచుల వరకూ తెరతో 14 అంగుళాల హెచ్‌డీ డిస్‌ప్లే తెరని కలిగిఉంది. అందుకే 'నానోఎడ్జ్ డిస్‌ప్లే'గా పిలుస్తున్నారు. కాన్ఫిగరేషన్ విషయానికొస్తే... ఇంటెల్ కోర్ ఐ7 ప్రాసెసర్‌ని వాడారు. 8జీబీ ర్యామ్, 512జీబీ ఇంటర్నల్ మెమొరీ అందిస్తున్నారు. ల్యాపీని సురక్షితంగా వాడుకునేలా టచ్ ప్యాడ్‌లో 'ఫింగర్‌ప్రింట్ సెన్సర్'ని నిక్షిప్తం చేశారు. బరువు 1.2కేజీలు.



సెల్ఫీ కోసం ఫ్లాష్ లైట్

స్నేహితులతో సెల్ఫీ, బంధువులతో సెల్ఫీ.. మనుషులు మారినా సెల్ఫీ మాత్రం మారదు. అయితే సరైన వెలుతురు లేకపోతే సెల్ఫీ మసకగా మారిపోతుంది. అలాంటప్పుడే స్మార్ట్‌ఫోన్ వెనుక వైపు ఉండే ఫ్లాష్‌లైట్ ముందువైపున కూడా ఉంటే బాగుండనిపిస్తుంది. ఇటీవల కొన్ని కంపెనీలు ముందువైపున ఫ్లాష్‌లైట్ ఇస్తున్నారు. మరి పాత ఫోన్లు, ట్యాబ్‌లు, ల్యాపీల సంగతి? ఇప్పుడు దీని కోసం ఓ ఎల్ఈడీ లైట్ మార్కెట్‌లోకి వస్తోంది. దీన్ని మీ ఫోన్, ట్యాబ్, ల్యాపీలకు అమర్చుకొని ప్రకాశవంతమైన సెల్ఫీలు తీసుకోవచ్చు. ఫోన్ బ్యాటరీ ద్వారా ఇది పని చేస్తుంది. ఈ లైట్‌కు క్లిప్ లాంటి అమరిక ఉంటుంది.



డిజిటల్ కిడ్డీ బ్యాంక్

నాణేలు, నోట్ల వాడకం తగ్గి... క్రెడిట్, డెబిట్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ వాడకం పెరుగుతూ వస్తోంది. ఇంకా పిల్లలు కిడ్డీ బ్యాంకుల్లోనే డబ్బులు దాచుకోవాలంటే ఎలా? ఈ కాలానికి తగ్గట్లుగా ఓ న్యూజిల్యాండ్ బ్యాంకు డిజిటల్ కిడ్డీ బ్యాంకును తయారు చేసింది. దాని పేరు 'క్లెవర్ క్యాష్'. పసుపు రంగులో ఉన్న ఓ ఏనుగు బొమ్మకు ఓ చిన్న డిస్‌ప్లేని అమర్చింది. ఈ బొమ్మను పిల్లలకు కిడ్డీ బ్యాంకులా ఇవ్వొచ్చు. అయితే అందులో నేరుగా డబ్బులు జమచేసే వీలుండదు. తల్లిదండ్రులు తమ స్మార్ట్‌ఫోన్‌లో ఈ కిడ్డీ బ్యాంకు అనుబంధ ఆప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి. బ్లూటూత్ సాయంతో ఫోన్, పిగ్గీబ్యాంకుని జత చేయాలి.

నడిస్తే మొబైల్ ఛార్జింగ్

రోజూ ఉదయాన్నే వాకింగ్ చెయ్... కొత్త ఉత్సాహంతో ఉరకలేస్తావ్ అంటుంటారు. మీరే కాదు మీ మొబైల్ కూడా ఉత్తేజితం అవుతుంది... ఎలా అంటారా? మీరు నడిస్తే మీ మొబైల్‌లో ఛార్జింగ్ అవుతుంది కాబట్టి. అవును... నడకతో బ్యాటరీ చార్జింగ్ అయ్యే సాంకేతికతను శాస్త్రవే త్తలు కనుగొన్నారు. నడిచేటప్పుడు కండరాల కదలికల వల్ల విద్యుత్తును ఉత్పత్తి చేయొచ్చని చాలా కాలం క్రితమే శాస్త్రవే త్తలు నిరూపించారు. దాని ఆధారంగానే ఇప్పుడు బ్యాటరీ ఛార్జింగ్ సాంకేతికతను రూపొందించారు. దీని కోసం ప్రత్యేక చిప్‌లు తయారు చేశారు. వీటిని మడ మల దగ్గర అతికించుకొని నడవడం, చేతులూ పడం లాంటివి చేస్తే చిన్న మొత్తంలో విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దీన్ని పెంచే ఆలోచన కూడా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొబైల్స్‌తో పాటు వేరబుల్ గ్యాడ్జెట్లను ఛార్జ్ చేసుకోవచ్చు.



శుభ్రపరిచే హ్యాంగర్

ఆఫీసు నుంచి వచ్చి బీరువాలో హ్యాంగర్‌కు చొక్కా తగిలించి... రేపు ఉదయం లేచి చూస్తే ఎలా ఉంటుంది? రాత్రి ఎలా ఉందో అలానే కనిపిస్తుంది. ఇది మామూలు హ్యాంగర్ అయితే. అదే పానసానిక్ హ్యాంగర్‌కు చొక్కా తగిలిస్తే ఉదయం లేచి చూసేసరికి దానికి ఉన్న దుర్వాసనలు అన్నీ పోయి సువాసనభరితమవుతుంది. ఈ సాంకేతికతతో పానసానిక్ ఈ-హ్యాంగర్‌ను రూపొందించింది. ఇందులోని నానో సాంకేతికత ద్వారా నానోస్కోపిక్ వాటర్ పార్టికల్స్ ఉత్పత్తి అవుతాయి. ఇవి చొక్కాలోని దుర్వాసనను తొలగిస్తాయి. దీంతోపాటు దుస్తుల మీద సుగంధ ద్రవ్యాలు చల్లే సదుపాయమూ ఉంది. సెప్టెంబరులో ఈ హ్యాంగర్ జపాన్ మార్కెట్‌లోకి వస్తుంది. మన దేశంలో ఎప్పుడనేది తెలియాల్సి ఉంది.

మనం స్పోర్ట్స్
శుక్రవారం 23 ఫిబ్రవరి 2018
www.manamnews.com

వరుణుడి వల్లే ఓడాం

టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ



సెంచూరియన్: సౌతాఫ్రికాతో జరిగిన రెండో టీ20లో ఓటమికి టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ వరుణుడిని నిందించాడు. నిరంతర చినుకుల వల్ల తమ బౌలర్లు రాణించలేకపోయారని చెప్పాడు. మరో వైపు సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్‌ను కోహ్లీ ప్రశంసించాడు. వర్షం వల్ల అవుట్ ఫీల్డ్ తడిగా ఉండడంతో బంతిపై పట్టు (గ్రిప్) సాధించలేకపోయాడు. దీంతో నాలుగు ఓవర్లలో 64 పరుగులు సమర్పించుకున్నాడు. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేయగా.. తర్వాత 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 189 పరుగులు సాధించింది. 'బౌలర్లకు చాలా కష్టంగా మారింది. ఆరంభంలోనే వికెట్లు పడటంతో ప్రత్యర్థిని 175 పరుగులు చేయగలమని భావించాం. కానీ మనీష్, రైనా అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. అంతేకాదు మనీష్, ఎంఎస్ ధోనీ బ్యాటింగ్ కారణంగా భారీ స్కోరు చేయగలిగాం. ఆ స్కోరుతో గెలవగలమని భావించాం. తర్వాత వాతావరణం మా పట్ల కఠినంగా వ్యవహరించింది. 12వ ఓవర్ వరకు అంతా సవ్యంగా ఉండింది. కానీ చినుకులు పడటంతో ప్రత్యర్థి బ్యాట్స్‌మన్ క్రీజు వద్ద నిలదొక్కుకున్నారు. చినుకుల వల్ల బంతి జారుతోంది. దీంతో బౌలర్లు బంతిపై పట్టు సాధించలేకపోయారు' అని కోహ్లీ అన్నాడు.



కిదాంబి శ్రీకాంత్‌కు 3వ సీడ్

3వ సీడ్‌గా శ్రీకాంత్ బరిలోకి దిగనున్నాడు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 1000 టోర్నీ తొలి రౌండ్ మ్యాచ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన బ్రైస్ లెవెర్డెజ్‌తో శ్రీకాంత్ ఆడనున్నాడు. ఈ టోర్నీ వచ్చే 14 నుంచి 18వ తేదీ వరకు జరగనుంది. పురుషుల సింగిల్స్‌లో తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో బి. సాయి ప్రణీత్, హెచ్‌ఎస్ ప్రణయ్‌లు కఠినమైన ప్రత్యర్థులతో తలపడనున్నారు. తొలి మ్యాచ్‌లో ప్రణీత్ కొరియాకు చెందిన సన్‌తో, ప్రణయ్ చైనీస్ తైపీకి చెందిన చౌ టీన్ చెన్‌తో ఆడనున్నారు. డబుల్స్ తొలి రౌండ్‌లో చిరాగ్ శెట్టి, స్వాస్తిక్‌సాయిరాజ్ జోడీ జపాన్‌కు చెందిన టకురౌ హౌకి, యుగౌ కొబయషి జంటతో, ప్రణవ్ చోప్రా, ఎన్ సిక్కి రెడ్డి జంట జర్మనీకి చెందిన మార్విన్ ఎమిల్ సీడెల్, లిండా ఎఫ్లర్ ద్వయంతో తలపడనున్నారు. వర్ధమాన మహిళల డబుల్స్ జంట జక్కంపూడి మేఘన, పూర్విష ఎస్ రామ్ జపాన్‌కు చెందిన షిహౌ టనక, కొహరు యొనెమొటౌ జోడీతో తలపడనుంది.



భారత షట్లర్లకిది.. స్వర్ణయుగం

హైదరాబాద్ స్టార్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్

హైదరాబాద్: భారత షట్లర్లకిది స్వర్ణ యుగమని.. ఈ ఏడాది కామన్వెల్త్ గేమ్స్, ఆసియా గేమ్స్‌లో పతకాలే లక్ష్యంగా కొత్త స్టార్లు రంగ ప్రవేశం చేస్తున్నారని హైదరాబాద్ స్టార్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ అన్నాడు. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో శ్రీకాంత్ 3వ ర్యాంక్‌లో, హెచ్‌ఎస్ ప్రణయ్ 11వ ర్యాంక్‌లో, సాయి ప్రణీత్ 14వ ర్యాంక్‌లో ఉన్నారు. ప్రపంచ బ్యాడ్మింటన్‌లో పవర్ హౌస్‌గా పేరొందిన చైనాతో సమానంగా భారత షటర్లు కూడా టాప్-15లో కొనసాగుతున్నారు. మహిళల ర్యాంకింగ్స్‌లో పీవీ సింధు 4వ ర్యాంక్‌లో, సైనా నెహ్వాల్ 11వ ర్యాంక్‌లో ఉన్నారు. వీరిద్దరూ ఒలింపిక్ పతక విజేతలు. 'మాకు అద్భుతమైన జట్టు ఉంది. పురుషుల సింగిల్స్‌లో ఐదారుగురు ఉండగా.. మహిళల సింగిల్స్‌లో సింధు, సైనా సత్తా చాటుతున్నారు. డబుల్స్ ప్లేయర్స్ కూడా రాణించడం మరింత బలాన్ని స్తోంది. గత పదేళ్లుగా మేము అత్యుత్తమ ప్లేయర్స్‌గా కొనసాగుతున్నాం' అని శ్రీకాంత్ అన్నాడు. భారత్‌లో సింగిల్స్ హీరోలు కూడా ఉన్నారు. ప్రకాశ్ పదుకునే 1980లోనే ఆల్ ఇంగ్లండ్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను గెలిచారు. జాతీయ కోచ్ పుల్లెల గోపీచంద్ కూడా ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. అదే సమయంలో ప్రస్తుతమున్న భారీ సంఖ్యలో ప్రతిభావంతులు మునుపు లేరు. ఒకే క్యాలెండర్ ఇయర్‌లో నాలుగు సూపర్ సిరీస్ వరల్డ్ టూర్ టైటిళ్లు గెలిచిన ఏకైక భారత షట్లర్‌గా శ్రీకాంత్ రికార్డుల్లోకెక్కాడు. దీంతో పురుషుల సింగిల్స్‌లో కెరీర్ అత్యుత్తమ 2వ ర్యాంక్‌ను సాధించాడు. కానీ ఆ తర్వాత శ్రీకాంత్ గాయం పాలై కొన్ని టోర్నీలకు దూరమయ్యాడు. గాయం నుంచి కోలుకున్న శ్రీకాంత్ తొలిసారి ఈ నెలలో జరిగిన ఇండియా ఓపెన్‌లో పాల్గొన్నాడు. కానీ మలేసియాకు చెందిన క్వాలిఫయర్ ఇస్కందర్ జుల్కర్‌నైన్ చేతిలో రెండో రౌండ్‌లోనే వెనుదిరిగడం అందరినీ ఆశ్చర్యప రిచింది. 2014 చైనా ఓపెన్‌లో చైనీస్ స్టార్ ప్లేయర్ లిన్ డాన్‌ను ఓడించి సంచలనం సృష్టించిన శ్రీకాంత్ రెండేళ్ల తర్వాత రియో ఒలింపిక్స్ క్వార్టర్ ఫైనల్లో అదే ప్రత్యర్థి చేతిలో ఓటమిపాలయ్యాడు. అయితే ఇప్పటికీ శ్రీకాంత్ ఒలింపిక్ పతకంపై ఓ కన్నేసి ఉంచాడు. ముందుగా ఏప్రిల్‌లో ఆస్ట్రేలియాలో జరగనున్న కామన్వెల్త్ గేమ్స్, ఆ తర్వాత ఆగస్టులో ఇండోనేషియాలో జరగనున్న ఆసియా గేమ్స్‌పై శ్రీకాంత్ దృష్టి పెట్టాడని అతని అన్న కె. నందగోపాల్ చెబుతున్నాడు. 'నిజంగానే ఒలింపిక్ పతకం సాధించడం నా అంతిమ లక్ష్యం. కానీ 2020 ఒలింపిక్స్ గురించి ఇప్పటి నుంచే ఆలోచించడం మంచిది కాదు. ముందుగా మరో రెండు నెలలో జరగనున్న టోర్నీల గురించి ఆలోచిస్తున్నాను. ప్రతి పెద్ద టోర్నీలో రాణించడం చాలా అవసరం. గతేడాది సూపర్ సిరీస్ ఆడాను గాయాలపాలయ్యాను. కోలుకుని మళ్లీ సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచాను. కనుక ఈ ఏడాది పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండి గతేడాది కంటే మరిన్ని ఎక్కువ టోర్నీల్లో పాల్గొనాలనుకుంటున్నాను' అని శ్రీకాంత్ చెప్పాడు. డెన్మార్క్‌కు చెందిన విక్టర్ యాక్సెల్‌సెన్‌తో శ్రీకాంత్‌కు దగ్గరి విరోధం ఉంది. వీరిద్దరూ ఏడుసార్లు తలపడగా అందులో డెన్మార్క్ షట్లర్ నాలుగింటిలో గెలిచాడు. అయితే వరల్డ్ ర్యాంకింగ్స్ గురించి ఆలోచించి తనపై తాను ఒత్తిడి పెంచుకోవం ఇష్టం లేదని.. నంబర్ వన్ ర్యాంక్‌పై శ్రీకాంత్ దృష్టి పెట్టాడు.



ఐ జుతో సైనా ఢీ

ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో సైనా నెహ్వాల్‌కు కఠినమైన డ్రా ఎదురైంది. తొలి రౌండ్‌లో సైనా చిరకాల ప్రత్యర్థి ఐ జు యింగ్‌తో తలపడనుంది. కాగా పీవీ సింధుకు ఈజీ డ్రా లభించింది. తొలి రౌండ్‌లో సింధు థాయ్‌లాండ్‌కు చెందిన పార్న్‌పవీ చొచువాంగ్‌తో ఆడనుంది. 2015 ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు చేరిన ప్రపంచ 11వ ర్యాంక్ సైనా గత నెలలో జరిగిన ఇండోనేషియా ఓపెన్‌లో తైవానీస్ ప్రపంచ నంబర్ వన్ ఐ జు చేతిలో ఓటమిపాలైంది. ఐ జుపై పేలవ రికార్డు ఉన్న సైనా ఈసారైనా గెలిచి ప్రతీకారం తీసుకోవాలని భావిస్తోంది. ఒకవేళ తొలి రౌండ్‌లో సైనా గెలిస్తే రెండో రౌండ్‌లో అమెరికాకు చెందిన బీవెన్ ఝూంగ్ ఝూంగ్‌తో తలపడే అవకాశముంది. కానీ ఇండియా ఓపెన్ ఫైనల్లో సైనాను ఝూంగ్ ఓడించింది.

రిచర్డ్స్ కంటే కోహ్లీ ఉత్తమ బ్యాట్స్‌మన్

మాజీ కెప్టెన్ కపిల్ దేవ్



న్యూఢిల్లీ: తాజా ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్ ర్యాంక్స్ సాధించిన టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ, బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాలపై మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ ప్రశంసల వర్షం కురిపించారు. బ్యాటింగ్ విషయంలో వెస్టిండీస్ దిగ్గజం వివిఎన్ రిచర్డ్స్‌ను కోహ్లీతో పోలిస్తే టీమిండియా కెప్టెనే ఒకడుగు ముందున్నాడని కపిల్ అన్నారు. రిచర్డ్స్ కంటే కోహ్లీనే ఉత్తమ బ్యాట్స్‌మన్ అని చెప్పారు. ఐసీసీ వన్డే బ్యాట్స్‌మన్ ర్యాంకింగ్స్‌లో కోహ్లీ 909 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. రిచర్డ్స్ ఒక ఏడాది 935 పాయింట్లు సాధించారు. అంటే రిచర్డ్స్ రికార్డును బద్దలు కొట్టేందుకు కోహ్లీ 26 పాయింట్ల దూరంలో ఉన్నాడు. 'కోహ్లీ ఆ రికార్డును బద్దలు కొడతాడో లేదో నాకు తెలీదు. కానీ నిర్ణీత ఓవర్ల ఫార్మాట్‌లో అతని స్వేచ్ఛాయుత బ్యాటింగ్ వివ్ రిచర్డ్స్ కంటే కోహ్లీ ఒక అడుగు ముందే నిలబెట్టింది' అని ఓ క్రికెట్ వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కపిల్ అన్నారు. బుమ్రాపై కూడా ప్రశంసలు గుప్పించారు. 'అతను ఎక్కడ నుంచి ఎక్కడికి చేరాడో గమనించండి. తనకు తాను సరిచేసుకుంటూ మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నాడు. బుమ్రా లేని టీమిండియాను ఊహించలేం. అందుకే అతను నంబర్ వన్ అయ్యాడు' అని కపిల్ చెప్పారు.

రోహిత్‌ను ఆటపట్టించిన నెటిజెన్లు



సెంచూరియన్: సౌతాఫ్రికాతో రెండో టీ20లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఇన్నింగ్స్ రెండో ఓవర్లో తొలి రోహిత్ శర్మ డకౌటయ్యాడు. జేపీ డుమిని, హెన్రిచ్ క్లాసెన్‌ల వీర విహారంతో ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా 6 వికెట్లతో గెలిచింది. ఈ డకౌట్‌తో భారత టీ20ల్లో అత్యధికసార్లు డకౌటైన ఆటగాడిగా రోహిత్ శర్మ నిలిచాడు. ఈ జాబితాలో ఆశిష్ నెహ్రా, యూసుఫ్ పఠాన్‌లు సంయుక్తగా మూడో స్థానంలో ఉన్నారు. మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ, మనీష్ పాండే కలిసి అజేయ 98 పరుగుల భాగస్వామ్యాన్ని అందించడంతో టీమిండియా 4 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేయగలిగింది. అయితే ఈ డకౌట్‌పై నెటిజన్లు ముంబై ఇండియన్స్ కెప్టెన్ రోహిత్ శర్మను వదిలిపెట్టలేదు. వెంటనే స్పందించి రోహిత్‌ను ఆట పట్టించారు. 'రోహిత్ శర్మ మరోసారి అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. ఆలియా భట్ వంటి అరుదైన టాలెంట్‌ను ఈ గోల్డెన్ డక్ ద్వారా నిరూపించుకున్నాడు' 'రోహిత్ శర్మ చిన్నప్పటి ఇష్టమైన కార్టూన్ సిరీస్ ఏంటో తెలుసా? డక్-టేల్స్' 'బ్యాట్స్‌మన్ ఆఫ్ ది డే రోహిత్ శర్మ.. గోల్డెన్ డక్. బౌలర్ ఆఫ్ ది డే చాహల్ హాఫ్ సెంచరీ' 'గోల్డెన్ డక్ ద్వారా రోహిత్ శర్మ ఈ సిరీస్‌లో గోల్డ్ సాధించాడు' అంటూ సరదా కామెంట్స్ చేశారు. ఈ అనవసరమైన రికార్డుతో ఈ జాబితాలో టీమిండియా ఇతర ఓపెనర్ల సరసన రోహిత్ నిలిచాడు. టీ20ల్లో గోల్డెన్ డక్ అయిన వారిలో మురళీ విజయ్ (2010లో సౌతాఫ్రికాపై), అజింక్య రహానే (2016లో పాకిస్థాన్‌పై), కేఎల్ రాహుల్ (2016లో జింబాబ్వేపై) ఉన్నారు.



టీ20 ముంబై లీగ్‌కు భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. మరో పదిహేను రోజుల్లో ఈ టోర్నీ ప్రారంభం కానుంది. అయితే భారత క్రికెట్‌కు ముంబై గుండె వంటిదని సచిన్ కొనియాడారు.

రష్యా అథ్లెట్ పతకం రద్దు

పెంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్



పెంగ్‌చాంగ్: రష్యాకు చెందిన కర్లర్ అథ్లెట్ అలెగ్జాండర్ క్రుషెల్‌నిష్కీ పెంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌లో గెలిచిన బంగారు పతకాన్ని అధికారులు రద్దు చేశారు. ఇతను వింటర్ ఒలింపిక్స్‌లో డోపింగ్‌లో పట్టు బడడంతో స్పోర్ట్స్ మధ్యవర్తిత్వ కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. డోపింగ్ కుంభకోణంతో నిషేధానికి గురైనప్పటికీ వింటర్ ఒలింపిక్స్‌కు అర్హతకు కఠినమైన డోపింగ్ టెస్టులో పాసైన 168 మంది రష్యా అథ్లెట్లలో ఇతను కూడా ఉన్నాడు. 'ఈ అథ్లెట్ యాంటీ డోపింగ్ నిబంధనను ఉల్లంఘించాడు. దీంతో మిక్స్‌డ్ డబుల్స్ కర్లింగ్ ఈవెంట్‌కు అనర్హుడు' అని కోర్టు తీర్పు చెప్పింది.



మేరీకోమ్‌కు పతకం ఖాయం

స్ట్రాండ్జా మెమోరియల్ బాక్సింగ్

సోఫియా (బల్గేరియా): ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన భారత ప్రముఖ మహిళా బాక్సర్ ఎంసీ మేరీకోమ్ స్ట్రాండ్జా మెమోరియల్ పురుషులు, మహిళల బాక్సింగ్ టోర్నీలో సెమీఫైనల్‌కు చేరుకుంది. దీంతో ఆమె మరో అంతర్జాతీయ పతకాన్ని ఖాయం చేసుకుంది. ఆసియా చాంపియన్‌షిప్, ఇండియా ఓపెన్ టోర్నీల్లో స్వర్ణం గెలిచి ఈ టోర్నీకి వచ్చిన మేరీకోమ్ క్వార్టర్ ఫైనల్ పోరులో రుమేనియాకు చెందిన చిరకాల ప్రత్యర్థి స్టెలుట డుటను చిత్తు చేసింది. ఆసక్తికరమైన అంశమేంటంటే.. 2006, 2008, 2010 వరల్డ్ చాంపియన్‌షిప్‌లలో మేరీకోమ్ చేతిలో ఓడిపోయి స్టెలుట రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఇక పురుషుల సింగిల్స్‌లో ధీరజ్ రంగీ (64 కిలోల కేటగిరి) తొలి రౌండ్ పోరులో లూయిస్ కొలిన్ రిచర్నో చేతిలో ఓటమిపాలై ఇంటిముఖం పట్టాడు.



చాహల్ బౌలింగ్ అంటే చాలా ఇష్టం

సౌతాఫ్రికా విధ్వంసకర బ్యాట్స్‌మన్ క్లాసెన్

సెంచూరియన్: టీమిండియా మణికట్టు స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్ బౌలింగ్ అంటే తనకు చాలా ఇష్టమని సౌతాఫ్రికా విధ్వంసకర బ్యాట్స్‌మన్ హెన్రిచ్ క్లాసెన్ అన్నాడు. బుధవారం ఇండియా, సౌతాఫ్రికా జట్ల మధ్య ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో చాహల్ బౌలింగ్‌లో క్లాసెన్ వీర బాదుడు బాదాడు. దీంతో సౌతాఫ్రికా జట్టు సునాయాస విజయం సాధించింది. 'చాహల్ బౌలింగ్ అంటే చాలా ఇష్టం. నా కెరీర్ ఆరంభంలో అమెచ్యూర్ క్రికెట్ ఆడుతున్న సమయంలో ఇద్దరు క్వాలిటీ స్పిన్నర్లు ఉండేవారు. టైటాన్స్ (క్లాసెన్ దేశవాళీ జట్టు)లో షాన్ వాన్ బెర్గ్ (లెగ్ స్పిన్నర్) బౌలింగ్‌లో ఆడాను. చాహల్ బౌలింగ్ కూడా అలాగే ఉంటుంది. లెగ్ స్పిన్నర్ల కెరీర్‌ను చితగ్గొట్టాలని సరదాగా అనుకునే వాళ్లం. అది ఇక్కడ జరిగింది. నేను అనుకున్న చోటికి బంతిని పంప గలిగాను. చాలా సంతోషంగా ఉంది. చాహల్ బౌలింగ్‌లో వీలైనన్ని ఎక్కువ పరుగులు సాధించాలనుకున్నాను. అదే జరిగింది. ఇలా ఆడాలని నేను ముందుగా అనుకోలేదు. కానీ టీమిండియా సీమ్ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేయడంతో స్పినర్‌పై పడాల్సి వచ్చింది' అని క్లాసెన్ వివరించాడు.

సెమీస్‌లో ఆంధ్రప్రదేశ్

క్వార్టర్ ఫైనల్లో ఢిల్లీపై గెలుపు • విజయ్ హజారే వన్డే టోర్నీ

న్యూఢిల్లీ: ఢిల్లీ బ్యాటింగ్ లైనప్ పేకమేడలా కూలిపోవడంతో విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టు సెమీఫైనల్‌కు చేరుకుంది. గురువారమిక్కడ జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు 6 వికెట్లతో ఢిల్లీ జట్టును ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూఢిల్లీ జట్టు 32.1 ఓవర్లలో 111 పరుగులకు ఆలౌటైంది. తర్వాత ఆంధ్రప్రదేశ్ జట్టు 28.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 112 పరుగులు సాధించింది. మీడియం పేసర్ శివ కుమార్ (10 ఓవర్లలో 4/29), ఎడమ చేతి స్పిన్నర్ భార్గవ్ భట్ (7.1 ఓవర్లలో 3/28) ఢిల్లీ జట్టును కోలుకోలేని దెబ్బ తీశారు. గెలుపు లక్ష్యంతో బరిలోకి దిగిన ఆంధ్ర జట్టులో రికీ భుయ్ 32, అశ్విన్ హెబ్బార్ 38 పరుగులు చేశారు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ జట్టు బ్యాట్స్‌మెన్ స్కోరు చేయడానికి బదులు క్రీజులో నిలదొక్కుకునేందుకే ప్రాధాన్యత ఇచ్చారు. శివ వేసిన ఇన్ స్వింగర్‌కు ఉన్ముక్ చంద్ (4) క్లీన్ బౌల్డ్ కాగా.. గంభీర్ (8) బి. సుమంత్‌కు సింపుల్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. యువ ఆటగాడు హిటెన్ దలాల్ (11) అనవసరమైన షాట్‌కు పోయి అవుట్ కావడంతో ఢిల్లీ జట్టు 9 ఓవర్లలో 33 పరుగులకు 3 వికెట్లు కోల్పోయింది. తర్వాత గంటకు 120 కిలోమీటర్ల వేగంతో శివ వేసిన నిప్పులు చెరిగే బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఢిల్లీ బ్యాట్స్‌మన్ విఫలమయ్యారు. నితీష్ రాణా (2) భండారు అయ్యప్ప బౌలింగ్‌లో ఎల్‌బిడబ్ల్యూగా వెనుదిరిగాడు. అయితే రిషబ్ పంత్ (38), ధ్రువ్ షోరే (21) కలిసి ఐదో వికెట్ 36 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి ఆంధ్రప్రదేశ్ బౌలర్లను ఎదుర్కొనే ప్రయత్నం చేశారు. కానీ అనవసరమైన షాట్లకు పోయి అవుటయ్యారు. దీంతో 35 పరుగులకు ఢిల్లీ జట్టు 5 వికెట్లు కోల్పోయింది. భట్ వేసిన బంతిని సరిగా అర్థం చేసుకోలేకపోయిన షోరే స్టంపవుటయ్యాడు. కాగా శివ బౌలింగ్‌లో పంత్.. భట్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. పంత్ అవుటయ్యాక వచ్చిన వాళ్లెవ్వరూ ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయారు.



అశ్విన్ హెబ్బర్

హర్మన్‌ప్రీత్‌కు డీఎస్‌పీ ఉద్యోగం



చండీఘర్: భారత క్రికెట్ మహిళల టీ20 జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పంజాబ్ పోలీస్ శాఖలో డీఎస్‌పీ (డిప్యూటీ సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్) ఉద్యోగంలో చేరేందుకు రంగం సిద్ధమైంది. మార్చి 1వ తేదీన ఆమె ఈ ఉద్యోగంలో చేరనుంది. అయితే పంజాబ్ పోలీస్ శాఖలో చేరాలన్న హర్మన్‌ప్రీత్ అభ్యర్థనను ఇండియన్ రైల్వేస్ మన్నించి నప్పుడే ఇది సాధ్యమవుతుంది. ఈ విషయంపై పంజాబ్ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరిందర్ సింగ్ కూడా దృష్టి పెట్టారు. మొగ నివాసస్థురాలైన హర్మన్‌ప్రీత్‌కు షరతులతో కూడిన రైల్వేస్ బాండ్ నుంచి విడుదల కలిగించి పంజాబ్ డీఎస్‌పీ ఉద్యోగంలో చేరేలా చర్యలు తీసుకోవాలని రైల్వే మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. పోలీస్ ఆఫీసర్ కావాలన్న ఆమె కలను సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి అమరిందర్, హర్మన్‌ప్రీత్‌ల అభ్యర్థనను రైల్వే శాక కేంద్ర ప్రభుత్వానికి పంపినట్టు పంజాబ్ ముఖ్యమంత్రి కార్యాలయానికి చెందిన ఓ అధికారి తెలిపారు. ఇండియన్ రైల్వేస్‌తో ఒప్పందం ప్రకారం ఐదేళ్ల వరకు ఆమెకు విడుదల ఉండదు. ఒకవేళ వెళ్లాలనుకుంటే ఆమె ఐదేళ్ల జీతాన్ని రైల్వేస్‌కు చెల్లించాల్సి వుంటుంది. వెస్ట్రన్ రైల్వేలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా హర్మన్‌ప్రీత్ ఇప్పటికే మూడేళ్లు పూర్తి చేసింది. డీఎస్‌పీ వైద్య పరీక్షలకు హాజరైన హర్మన్‌ప్రీత్ గతేడాదే రైల్వేస్‌కు రాజీనామా సమర్పించింది. కానీ ఇండియన్ రైల్వేస్ విడుదల ఇవ్వనంత వరకు ఆమె పోలీస్ ఉద్యోగంలో చేరలేదు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.